అంధులకు సాయం చేసే ఏఐ కండ్లద్దాలు




2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 39 | పేజీలు:12 | వెల రూ.5

మూడో తరగతి నుంచే ఏఐ




2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

## 114 రఫేల్



## జెట్ల కొనుగోలుకు కేంద్రం ఓకే

వెల్లడించిన రక్షణ మంత్రిత్వ శాఖ

18న భారత్‌కు రానున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

ఢిల్లీ, ఫిబ్రవరి 12: త్రివిధ దళాల పోరాట సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌ను దడదడలాడించిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పింది. రూ.3.60 లక్షల కోట్ల

...మిగతా 2లో

# నేనే రాజు నేనే మంత్రి

## నేనెవరితోనూ పోల్చుకోను.. నాకు నేనే సాటి

2029లో జమిలి ఎన్నికలు

త్వరలో హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం

ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుగుతోంది

కాళేశ్వరం నివేదిక అందాక బాధ్యులపై చర్యలు

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం బ్యూరో): తెలంగాణలో నేనే రాజు...నేనే మంత్రి అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. తాను ఎవరితోనూ పోల్చుకోననీ, తనకు ఎవరూ పోటీ కాదని స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 2029లో జమిలి ఎన్నికలు రానున్నాయనీ, వచ్చే పదేళ్ల పాటు తానే సీఎంగా ఉంటానని పునరుద్ఘాటించారు. ఎన్టీయార్‌కు భారతరత్న అవార్డు ఇవ్వడంపై తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలోనే హైదరాబాద్‌లో ఎన్టీయార్ విగ్రహం ఏర్పాటు చేసి తానే ఆవిష్కరణ చేస్తానని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎంత నష్టం జరిగిందో అంచనా కోసం కమిటీకి బాధ్యతలు అప్పగించామనీ, కమిటీ నివేదిక అందిన తరువాతే చర్యలపై ఆలోచిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టులో మూడు పిల్లర్లు మాత్రమే కూలాయని చెప్పడం పద్ధతి కాదన్నారు. ప్రాజెక్టు లోపల బాంబు పెడితే పైన పేలుతుంది.. కింద కూలదని స్పష్టం చేశారు. మూడు పిల్లర్లా? ముప్పయ్ పిల్లర్లా? అనేది కమిటీ నిర్ధారించిన తరువాత చెబుతామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రాన్ని కోరామనీ, అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పెండింగ్‌లో పెట్టిందని వ్యాఖ్యానించారు. కృష్ణా జలాలపై తాము అడిగినవన్నీ

...మిగతా 2లో

## 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు



పారదర్శకంగా జర్నలిస్టులందరికీ న్యాయం చేస్తం

అక్రిడిటేషన్.. జారీ నిరంతర ప్రక్రియ

రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం బ్యూరో): రాష్ట్రంలో 44 వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు పారదర్శకంగా ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషన్ సిహెచ్ ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్వో మల్సూర్‌తో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి

...మిగతా 2లో

## గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు రండి

- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు 100 ఎకరాల డిఫెన్స్ స్థలం బదలాయించండి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌తో రేవంత్ భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం బ్యూరో): మూసీ పునరుజ్జీవం, రైలు మార్గాల మంజూరు, విమానాశ్రయాల పనులు వేగవంతమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన సాగుతోంది. గురువారం సీఎం రక్షణ శాఖ

...మిగతా 2లో

## జీపీలకు మరో రూ.387 కోట్లు విడుదల

కేంద్రం వద్ద పెండింగ్‌లో ఇంకా రూ.2400 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం బ్యూరో): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.387 కోట్లను మంజూరు చేసింది. 15వ ఆర్థిక సంఘం కింద గురువారం ఈ నిధులను మంజూరు చేసింది. ఇటీవల మొదటి విడతగా రూ.259.36 కోట్లను విడుదల చేసిన విషయం తెలిసిందే. 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి రూ.3000 కోట్లు రావాల్సి ఉంది. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడంతో కొత్త పాలక మండళ్లు ఏర్పడ్డాయి. దీనితో కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ఇంకా సుమారు రూ.2,400 కోట్లు విడుదల కావాల్సి ఉండగా, తాజాగా రూ.387 కోట్లు మంజూరయ్యాయి. పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

## లేబర్ కోడ్‌లు వెనక్కి తీసుకోవాల్సిందే

- కార్మిక సంఘాల డిమాండ్
- ఎన్డీయే సర్కార్ కార్మిక చట్టాల సవరణకు దేశవ్యాప్త నిరసన
- సార్వత్రిక సమ్మెలో 30 కోట్ల మంది కార్మికులు!

ఢిల్లీ, ఫిబ్రవరి 12: కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్ లను వ్యతిరేకిస్తూ సీఐటీయూ నేతృత్వంలో కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా 30 కోట్ల మంది పాల్గొన్నారు. సమ్మెకు దేశంలోని కార్మిక సంఘాలన్నీ ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు. ఎన్డీయే మిత్రపక్షాలు మినహా రాజకీయ పార్టీలన్నీ సమ్మెకు మద్దతు తెలపడంతో పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ దేశవ్యాప్తంగా రకరకాల

...మిగతా 2లో

## కార్మిక హక్కులను కాలరాస్తున్న మోడీ సర్కార్

ర్యాలీలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్




హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం బ్యూరో): ఎన్డీయే సర్కార్ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పేదల హక్కులను కాలరాయడమే మోడీ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు. కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆటో, ఆర్టీసీ యూనియన్లు, వివిధ వర్గాల కార్మికులు,

...మిగతా 2లో

## టెన్షన్.. అటెన్షన్

ఫలితాల కోసం ఎదురు చూపు

హైదరాబాద్, ఫిబ్రవరి 12: రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాలు మరి కొన్ని గంటల్లో వెలువడనున్నాయి. మొత్తం 123 కౌంటింగ్ కేంద్రాల్లో ఉదయం 8గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. రేపు కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది. ఫలితాల కోసం రాష్ట్రమంతా ఆసక్తితో ఎదురు చూస్తోంది. అభ్యర్థులు టెన్షన్.. టెన్షన్‌గా ఉన్నారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు నిఘా

12 వేల మంది పోలీసులతో భద్రత

డీజీపీ బి. శివధర్ రెడ్డి



హైదరాబాద్: ఫిబ్రవరి 12: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 కౌంటింగ్ స్టేషన్లను సిద్ధం చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతను ఏర్పాటు చేసినట్లు డీజీపీ పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం 12 వేల మంది పోలీసు బలగాలతో పాటు సాయుధ బలగాలు , క్విక్ రెస్పాన్స్ టీమ్స్ నిరంతరం పహారా కాస్తాయని, అదనపు భద్రత కోసం ప్రతి కౌంటింగ్ కేంద్రాన్ని సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంచామని, వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను తన కార్యాలయ కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షిస్తామని వివరించారు. లెక్కింపు కేంద్రాలకు వచ్చే మార్గాలను కఠినంగా నియంత్రిస్తున్నామని, పాసులు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఏదైనా అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో సంబంధిత

...మిగతా 2లో

## 18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి

ఢిల్లీ, ఫిబ్రవరి 12: వానాకాలం పంటకు (2025-26 సీజన్) సంబంధించి తాము అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కలిశారు. వానా కాలం పంటకు సంబంధించి

...మిగతా 2లో

యాసంగి ధాన్యం సేకరణ గడువు రెండు నెలలు పొడిగించండి

బాయిల్డ్ రైస్‌లో అయిదు శాతం నూకకు అనుమతించండి

2014-15 బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయండి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వినతి

## ఎర్రకోట పేలుళ్లు 'జైషే' పనే

వెల్లడించిన ఐరాస నివేదిక



న్యూయార్క్, ఫిబ్రవరి 12: గతడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై ఐక్యరాజ్య సమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుకు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర సంస్థతో సంబంధముందని పేర్కొంది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ జైషే సహా పలు ఉగ్రముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలకంగా పని

...మిగతా 2లో

## కిమ్ వారసురాలు.. 13 ఏండ్ల ఆయన బిడ్డే



ఈ మధ్య తరచూ అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్న కిమ్ జు యే

ఉ. కొరియా రాజకీయ పరిణామాలపై ద. కొరియా నిఘా సంస్థ అంచనా

పురుషాధిక్య నాయకత్వ వ్యవస్థలో ఇదో సంచలన పరిణామం

సియోల్, ఫిబ్రవరి 12: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తెనే ఆయన వారసురాలని దక్షిణ కొరియా నిఘా సంస్థ 'నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్' అంచనా వేసింది. ఈ విషయాన్ని చట్టసభ సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. కిమ్ జు యే భవిష్యత్తు నాయకురాలిగా నియామకానికి చేరువలో ఉన్నట్లు తెలిపింది. ఈ నెలాఖరులో అతిపెద్ద రాజకీయ సదస్సును నిర్వహించేందుకు ఉత్తర కొరియా సన్నాహాలు చేస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. కిమ్ తన కుమార్తె కిమ్ జు యేను మొదటిసారిగా 2022లో ప్రపంచానికి పరిచయం చేశారు. 2023లో మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్యోంగ్యాంగ్లో మరోసారి

...మిగతా 2లో



బంగ్లాదేశ్‌లో ముగిసిన పోలింగ్

## షురువైన కౌంటింగ్

ఫలితాలపై ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆసక్తి

ఢాకా, ఫిబ్రవరి 12: బంగ్లాదేశ్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. కౌంటింగ్ షురువైంది.. మొత్తం 299 పార్లమెంట్ స్థానాలకు ఉదయం 7:30 గంటలకు ఓటింగ్ ప్రారంభమై సాయంత్రం 4:30 గంటల వరకు పోలింగ్ జరిగింది. అభ్యర్థి మరణంతో

...మిగతా 2లో

# అంధులకు సాయం చేసే ఏఐ కళ్లద్దాలు

- **ఆవిష్కరించిన బెంగళూరు నారాయణ నేత్రాలయ**

**బెంగళూరు, ఫిబ్రవరి 12:** బెంగళూరుకు చెందిన నారాయణ నేత్రాలయ ఆధ్వర్యంలో స్మార్ట్ విజన్ గ్లాసెస్ అల్ట్రా కళ్లజోళ్లను తయారైంది. ఈ కళ్లజోడు ద్వారా అంధులు తమ ముందు కనిపించే వస్తువులు, పుస్తకాల్లోని అక్షరాలు, వెళ్లే మార్గాలను సులువుగా తెలుసుకుంటారు. ఈ కళ్లజోళ్లలోని లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సెన్సార్లు పరిసరాలకు సంబంధించిన వివరాలను స్కాన్ చేసి బ్లూటూత్ ద్వారా వ్యక్తికి వినిపించేలా చేస్తాయి. ఈ ఆవిష్కరణ గురించి నారాయణ నేత్రాలయ బడ్స్ అండ్ బ్లూజమ్స్ విభాగం ఆప్టొమెట్రిస్ట్ డాక్టర్ మహ్మద్ డ్యానిష్ మాట్లాడుతూ ఐదేండ్లుగా మా వద్దకు వచ్చే అంధులను పరీక్షించి, వారికి రోజువారీ కనీస అవసరాలను సిద్ధం చేసి వాటిని ఈ కళ్లజోడులోని కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ద్వారా అందించే ఏర్పాటు చేశామన్నారు. వందశాతం చూపులేని వారికి కూడా ఈ స్మార్ట్ కళ్లజోడు ఉపయోగపడుతుందన్నారు. 'మొత్తం 18 భారతీయ భాషలు, కొన్ని విదేశీ భాషలను ఈ కళ్లజోడు ద్వారా చదవగలరు. వస్తువులు, వ్యక్తుల ముఖాలు, కరెన్సీ నోట్లను ఇందులోని ఏఐ సాంకేతికత ద్వారా గుర్తించగలరు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్మార్ట్ కళ్లజోడుతో పోలిస్తే ఈ గ్లాసులు తక్కువ ధరలకే అందుబాటులో ఉంటాయి' అని ఆయన వెల్లడించారు.

# 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ముందుగా జీవో 252 జారీ చేశామనీ, అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను పరగణనలోనికి తీసుకుని అవసరమైన సవరణలు చేసి జీవో 103ని జారీ చేసినట్లు వెల్లడించారు.

ఈ సవరణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని చెప్పారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు.

2,50 లక్షలకు పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుంచి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న 24 పత్రికలకు 17,784 కార్డులు, 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదే విధంగా 15,001 నుంచి 25001 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661, 15 వేల లోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే, 21 శాటిలైట్ చానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ చానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ చానళ్లకు 200, డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు.

ఇందులో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16056 నియోజకవర్గ, మండల స్థాయిలో 28650 కార్డులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు.

అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అనీ, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించిట్లు తెలిపారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

# 3వ తరగతి నుంచే ఏఐ

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**ఢిల్లీ, ఫిబ్రవరి 12:** ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో లానే విద్యారంగంలోను కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తుంది. ఈ కొత్త ఏఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులున్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఏఐ కాంక్లేవ్-2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్ లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు పూర్తిగా నిమగ్నమయ్యాయన్నారు. ప్రస్తుతం ఏఐ యాంత్రిక మేధస్సుతో పాటు మనుషుల భావోద్వేగాలను కూడా అర్థం చేసుకుంటున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గొప్ప విజయమని అభివర్ణించారు. ఈ సమావేశానికి ముందు ఢిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన ఎడ్‌టెక్ ఏఐ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 10 వినూత్న భారతీయ ఎడ్‌టెక్ స్టార్టప్ల వ్యవస్థాపకులతో ఆయన సమావేశమయ్యారు.

# కిమ్ వారసురాలు.. 13 ఏండ్ల ఆయన బిడ్డే

(మొదటి పేజీ తరువాయి)

కనిపించింది. నాటినుంచి పలు అధికారిక కార్యక్రమాలకు హాజరవుతోంది. గత నెలలోనూ తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం 'కుమ్సుసన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్'ను సందర్శించింది. ఇవన్నీ ఆమె కిమ్ వారసురాలన్న వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. ఉత్తర కొరియా పగ్గాలు ఆమెకే అప్పగిస్తారా? అని దక్షిణ కొరియా నిఘా అధికారులు మొదట్లో అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ దేశ సంప్రదాయవాద సంస్కృతి, పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుని ఈమేరకు అంచనాకు వచ్చారు. కానీ.. దేశ మీడియాలో ఆమె ప్రముఖంగా కనిపిస్తుండటంతో పునఃసమీక్ష చేశారు. ఈ క్రమంలోనే ఆమె వారసురాలిగా నియమాకం కీలక దశలో ఉన్నట్లు తెలిపారు. ఉన్నత స్థాయి సైనిక కార్యక్రమాల్లో పాల్గొనడం, కుమ్సుసన్ పర్యటనలో భాగం కావడం, కొన్ని విధానపరమైన విషయాల్లో తండ్రి ఆమె అభిప్రాయాలను కోరడం వంటివాటిని సంకేతాలుగా ఉదహరించినట్లు సమాచారం. దక్షిణ కొరియా నిఘా వర్గాల ప్రకారం.. కిమ్ కు ముగ్గురు పిల్లలు. కిమ్ జు యే రెండో సంతానం. ఆమెకు 13 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. కిమ్ కూడా వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చారు. తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణానంతరం పగ్గాలు చేపట్టారు. ఫిబ్రవరి నెలాఖరులో కిమ్ రాజకీయ పార్టీ అయిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఐదేండ్ల కాలానికి కిమ్ తన వారసత్వ ప్రణాళికలకు పార్టీ ఆమోదముద్ర వేయించుకుంటారని ద. కొరియా నిఘా సంస్థ అంచనా వేస్తోంది.

# ఆర్కిటిక్ ప్రాంతాల్లో కొత్త సైనిక కార్యక్రమం చేపడుతున్న నాటో

**బ్రస్సెల్స్, ఫిబ్రవరి 12:** ఆర్కిటిక్ వలయంలోని ప్రాంతాల్లో భద్రతను మెరుగుపరిచేందుకు 'ఆర్కిటిక్ సెంట్రీ' పేరుతో కొత్త సైనిక కార్యక్రమానికి నాటో బుధవారం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నాటో తొలుత ఆర్కిటిక్ ఎండ్యూరెన్స్ (డెన్మార్క్), కోల్ రెస్పాన్స్ డ్రిల్స్ (నార్వే) వంటి పలు సైనిక విన్యాసాల్లో పాల్గొననుంది. 'ఆర్కిటిక్ సెంట్రీ' మిలిటరీ ఆపరేషన్ కాదు. ఈ కార్యక్రమం కింద ఆర్కిటిక్ వలయంలో, దాని సమీప ప్రాంతాల్లో శాశ్వతంగా బలగాలను మోహరించే ఉద్దేశాలేవీ నాటోకు లేవు. తమభాగస్వామ్యపక్షాలు కలిసికట్టుగా అక్కడ విన్యాసాల్లో పాల్గొననుండటమే 'ఆర్కిటిక్ సెంట్రీ'లో కొత్త విషయమని బ్రస్సెల్స్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్ ప్రకటించారు.

# లేబర్ కోడ్‌లు వెనక్కి తీసుకోవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలు నిర్వహించింది. ఒక ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వీధుల నుండి పార్లమెంటు వరకు, తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వ వాణిజ్య ఒప్పందం, కార్మిక చట్టాలు, మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ట్రేడ్ యూనియన్లు, రైతులు, కార్మికులు వీధుల్లో ఆందోళన చేపట్టారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు.

లక్షలాది మంది శ్రమిస్తున్న రైతులు, కార్మికులు మరియు కార్మికుల భవిష్యత్తును తాకట్టు పెట్టిన ప్రజా వ్యతిరేక 'ట్రాప్ డీల్'ను మేము గట్టిగా వ్యతిరేకిస్తున్నాము. విదేశీ ఒత్తిడికి లొంగి, మోడీ ప్రభుత్వం దేశంలోని కోట్లాది మంది యువత జీవితాలను దెబ్బతీసింది అని మండిపడ్డారు. అబ్కీ బార్ ట్రంప్ సర్కార్ అని నినాదాలు చేసిన వారు భారతదేశ జాతీయ ప్రయోజనాలకు హాని కలిగించారని, దీనికి అతిపెద్ద వ్యతిరేకత మన కార్మికులు, చిన్న వ్యాపారులు మరియు సామాన్య ప్రజల నుండి వస్తుందని ఖర్గే అన్నారు. వీధుల నుండి పార్లమెంటు వరకు, మా పోరాటం కొనసాగుతుంది ఖర్గే హెచ్చరించారు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న మోడీ సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

రైతు సంఘాలు, సీపీఐ, సీపీఎం(ఎల్) న్యూడెమొక్రసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌లో మహేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఎస్టీ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ మీదుగా ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ జరిపి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మీహేష్ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల చెమట కష్టంతో ఈ దేశం నడుస్తోంది. కార్మికుల పరిపూర్ణమైన హక్కులను ప్రధాని మోడీ, ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపుమేరకు కార్మికులు ధర్నా చేస్తున్నారు. ప్రధాని మోడీ ప్రభుత్వం పెట్టుబడి వ్యవస్థకు దారులు తెరిచింది. మోడీ, అమిత్ షాలను కేంద్రంలో రాహుల్ గాంధీ ధైర్యంగా ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేదల హక్కులను కాలరాయడమే కాకుండా 'నరేగా' ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆ చట్టాలపై అసెంబ్లీలో చర్చిస్తాం. నాలుగు కోడ్‌ల రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి. ప్రధాని మోడీ దిగొచ్చి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి. అప్పటి వరకు ఈ ఉద్యమం కొనసాగాలని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# ఎర్రకోట పేలుళ్లు 'జైషే' పనే

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ఐరాస భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలను ప్రస్తావించింది. 'ఆంక్షలు ఉన్నప్పటికీ జైషే ముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐరాస సభ్య దేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్ను ఏర్పాటుచేసుకుంది. ఇది చాలా ఆందోళనకర పరిణామం' అని ఐరాస తమ నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్లో జరిగిన పహల్గాం ఘటనను కూడా ఐరాస తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు తెలిపింది. జైషే, లష్కరే తయ్యిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్థాన్ పదేపదే వాదిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఐరాస ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడినట్లయ్యింది.ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడి వెనక జైషే మహ్మద్ హస్తం ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఎర్రకోట వద్ద ఆత్మాహుతి చేసుకున్న డాక్టర్ ఉమర్ నబీకి సంబంధించి ఓ వీడియోను స్వాధీనం చేసుకున్నారు. అందులో భారత దేశవ్యాప్తంగా ఆత్మాహుతి దాడులకు ఈ ముఠా కుట్రలు పన్నినట్లు తేలింది. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

# 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు కేంద్రం ఓకే

(మొదటి పేజీ తరువాయి)

వ్యయంతో ఫ్రాన్స్‌తో అతిపెద్ద రక్షణ ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 114 రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదించిందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కొనుగోలుకు రక్షణశాఖ నుంచి ఆమోదం లభించిండం గమనార్హం. అయితే, ఏడాది చివరి నాటికి ఈ కొనుగోళ్ల కోసం ఇరు దేశాల మధ్య అధికారిక ఒప్పందం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ 114లో 88 సింగిల్ సీట్, 26 ట్విన్ సీట్ వేరియంట్లు భారత వాయుసేన (ఐఏఎఫ్)లో చేరుతాయి. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబ్లీ కోసం ఫ్రాన్సుకు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్.. భారత్లోని ప్రయివేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటుంది.

# నేనే రాజు నేనే మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తే ఏపీకి సైతం సహకరిస్తామని స్పష్టం చేవారు. కవిత పార్టీ గురించి తనకు తెలియదనీ, ఆ విషయాలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఎన్టీయార్ జాతీయ నాయకుడనీ, ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదు... జాతీయ సొత్తు అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్టీయార్‌కు భారతరత్న ఇవ్వాలని తాను వ్యక్తిగతంగా డిమాండ్ చేస్తున్నానని తెలిపారు. ఎన్టీయార్ గురించి ఎవరైనా తక్కువగా మాట్లాడితే అంత మూర్ఖులు ఎవరూ ఉండరని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీయార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నేనే ఆవిష్కరిస్తానని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ఎన్టీయార్ విగ్రహం పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దత్తపుత్రుడనీ, కాళేశ్వరంపై 48 గంటల్లో విచారణ చేయిస్తామని చెప్పి కిషన్ రెడ్డి గతంలో ప్రకటించారని గుర్తు చేశారు. కానీ, ఇప్పటి వరకూ సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించలేదంటూ కిషన్ రెడ్డిని ప్రశ్నించారు. జడ్జిలు, జర్నలిస్టులు, రాజకీయ నేతల ఫోన్లు సైతం ట్యాప్ చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డ సీఎం రేవంత్ అందుకు కారకుడైన ప్రభాకరరావు 20 నెలల పాటు విదేశాలకు పారిపోతే సుప్రీం కోర్టు ఆదేశాలతో స్వదేశానికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. ప్రభుత్వం మారిన తరువాత ఎస్ఐబీలో కంప్యూటర్లు, హార్డ్‌డిస్కులు ధ్వంసం చేశారనీ, ఫోన్ ట్యాపింగ్ కేసును తెలంగాణ హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తోందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు రండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో వరుసగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, భూ బదలాయింపులు, నిధుల మంజూరు కోరుతూనే ప్రభుత్వపరంగా ఇవ్వనున్న మద్దతు, భూ కేటాయింపులను కేంద్ర మంత్రులకు వివరించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ సందర్భంగా సీఎం రేవంత్ ఈసా...మూసీ నదుల సంగమ స్థలిలో ప్రపంచస్థాయి విద్యా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా నిర్మించనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు రావాలని ఆహ్వానించారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో పర్యావరణ హితంగా, స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 100 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు.

### కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం నిర్మించండి : అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి

కేంద్ర నిధులతో కృష్ణా-వికారాబాద్ రైలు మార్గాన్ని నిర్మించాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు భూసేకరణకు అవసరమైన మొత్తాన్ని తామే భరిస్తామని స్పష్టం చేశారు. ఈ మార్గంలోని టేకల్‌కోడ్‌లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామనీ, సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు స్పష్టం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు కర్ణాటకలోని పలు సిమెంట్ పరిశ్రమలకు కృష్ణా కేంద్రంగా ఉందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### అంతర్జాతీయ ప్రమాణాలతో మామునూరు నిర్మించండి : కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు సీఎం రేవంత్ విజ్ఞప్తి

తెలంగాణలో అతి పెద్ద నగరమైన వరంగల్‌కు సమీపంలోని మామునూరు ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు ఓవర్‌హాల్ రిపేర్ సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందనీ, ఉమ్మడి వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు కేంద్రంగా ఉంటుందని పేర్కొన్నారు.




# శారీరక శ్రమ లేకపోవడం వల్లే

## 13% మధుమేహుల్లో హృద్రోగ సమస్యలు!

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** డయాబెటిస్ రోగుల్లో హృద్రోగ సమస్యలకు సంబంధించి తాజాగా ఓ అంతర్జాతీయ అధ్యయనం కీలక అంశాలు వెల్లడించింది. శారీరక శ్రమ లేకపోవడం వల్ల భారత్లోని మధుమేహుల్లో 13 శాతం కన్నా ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నట్లు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా మధుమేహ బాధితుల్లో నమోదయ్యే ప్రతి పది రక్తనాళ సమస్యల్లో ఒకటి శారీరక శ్రమ లేకపోవడం వల్లేనని తెలిపింది. జర్నల్ ఆఫ్ స్పోర్ట్ అండ్ హెల్త్ సైన్స్ నివేదికలో ఈ అంశాలు పేర్కొంది. దక్షిణాసియాతోపాటు ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో 23లక్షల మందికిపైగా మధుమేహుల సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. శారీరక శ్రమ లేకపోవడం వల్ల వీరిలో పది శాతం కన్నా ఎక్కువ మంది స్ట్రోక్, 9.7 శాతం మంది డయాబెటిస్ రెటినోపతి, 7.3శాతం మందిలో గుండె వైఫల్యాలు, ఐదు నుంచి ఏడు శాతం మందిలో హృదయ సంబంధ జబ్బులు సంభవిస్తున్నట్లు గుర్తించారు. 'మధుమేహం కారణంగా కొన్ని అనివార్య సమస్యలు కనిపిస్తుంటాయి. శారీరక శ్రమ పెంచడం వల్ల వీటిలో అనేక సమస్యలను నివారించవచ్చని మా పరిశోధనల్లో నిరూపితమైంది' అని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన బ్రెజిల్ యూనివర్సిటీకి చెందిన జయ్ నే ఫెటర్ పేర్కొన్నారు. మరోవైపు వారానికి కనీసం 150 నిమిషాల శారీరక శ్రమ ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) వెల్లడించింది.

# షురువైన కౌంటింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఒక స్థానంలో పోలింగ్ నిలిపివేశారు. అధికారులు ఊహించినవిధంగానే పోలింగ్ సమయంలో అక్కడ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఖుల్నా 2 నియోజకవర్గంలో జమాత్ నాయకులు, కార్యకర్తలు జరిపిన దాడిలో బీఎన్పీ నాయకుడు మోహిబజ్జమాన్ కొచ్చి మృతి చెందారు. బంగ్లాదేశ్ ఎన్నికల చరిత్రలో.. పోలింగ్ సమయంలో ప్రాణ నష్టం జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. డైలీ స్టార్ మీడియా ప్రకారం.. మొత్తం 2034 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయగా 51 పార్టీలు బరిలోకి దిగాయి. ప్రధానంగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాత్-ఇ-ఇస్లామీ, నేషనల్ సిటిజన్ పార్టీ, నేషనల్ పార్టీల మధ్య పోటీ నెలకొంది.

### కౌంటింగ్ షురూ..

పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ కూడా మొదలైంది. ఈ రాత్రికే ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు నిఘా

(మొదటి పేజీ తరువాయి)

చట్టాల ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు.

### తనికీలు ముమ్మరం:

కౌంటిగ్ కేంద్రాల వద్ద ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తామని డీజీపీ వివరించారు. ముఖ్యంగా జన సమూహాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని జిల్లా ఎస్పీలు మరియు పోలీస్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, పోలీసు అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తూ కౌంటింగ్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు.బి ఎన్ ఎస్ ఎస్ 163 ప్రకారంగా కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎక్కువ మంది గుమికూడటం, ఆయుధాలు ధరించడం వంటి చర్యలపై నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని డిజిపి పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతంగా ముగిసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు ప్రజలు పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని డిజిపి కోరారు.

# 18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

53.73 లక్షల మెట్రిక్ టన్నులకు (ఎల్ఎంటీ) అనుమతించారని.. కానీ భారీగా పంట ఉత్పత్తి కావడంతో అదనంగా 18 ఎల్ఎంటీలు తాము సేకరించినందున ఆ మొత్తాన్ని 10 శాతం నూకతో ఎఫ్ సీఐ సేకరించాలని కేంద్ర మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. 2024-25 యాసంగి పంటకు సంబంధించి 5 శాతం నూకతో అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి జోషిని సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. 2024-25 వానా కాలం పంటకు సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు నిర్దేశించారని, దానిని మరో రెండు నెలలు పాటు పొడిగించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) 2014-15 వానా కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం, రాష్ట్ర మంత్రి కోరారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దష్టికి వారు



తీసుకెళ్లారు. నాడు సేకరణకు తాము రుణం తీసుకున్నామని.. దానికి వడ్డీ రూ.2 వేల కోట్లకుపైగా పెరిగిందని తెలియజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021, మే నుంచి 2022, మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేష్ షెట్కార్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



## శాంతి భద్రతల కోసం సెక్షన్ 163 ఆదేశాలు

- ఫ్యూచర్ సిటీ కమిషనర్ జి.సుధీర్ బాబు వెల్లడి

**షాద్ నగర్, ఫిబ్రవరి12 (మనం న్యూస్)ః** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలు కాపాడుటకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు(ఐపీఎస్),భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు జారీ చేశారు.13-02-2026 తేదీన ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 11:00 గంటల వరకు సంబంధిత కౌంటింగ్ కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో 5 మందికి మించిన గుంపులు కూడకుండా నిషేధం అమల్లో ఉంటుంది.ఈ ఆదేశాలు ఆమనగల్, ఇబ్రహీంపట్నం, షాద్నగర్, శంకర్పల్లి, మొయినాబాద్ మరియు చేవెళ్ల ప్రాంతాల్లో అమలులో ఉంటాయని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతి భద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేయబడింది. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు.

# కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**రంగారెడ్డి, ఫిబ్రవరి 12 (మనం న్యూస్)ః** 4 లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె చైతన్యపురి డివిజన్ లోని చైతన్యపురి పెయింటర్స్ లేబర్ అడ్డా దగ్గర, కార్మిక సంఘాలు ప్రజా సంఘాలు అన్ని ట్రేడ్ యూనియన్లు కలుపుకొని ర్యాలీ నిర్వహించి సమ్మె చేయడం జరిగింది .తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ కాచం సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు మల్లెపాక వీరయ్య,గంధం మనోహర్ రాష్ట్ర నాయకులు, సమ్మెను ఉద్దేశించి ప్రసంగించారు.. నాలుగు లేబర్ కోడ్స్ అంటే ఏమిటి? బ్రిటిష్ కాలం నుండి కార్మికులు వారి ప్రాణ త్యాగాలు అర్పించి 29 కార్మిక చట్టాలను సాధించుకున్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా 4 లేబర్ కోడ్స్ తీసుకొచ్చారు , కారణం ఎందుకు అంటే? బడా పెట్టుబడిదారులు కార్మికులు 8 గంటలు పని చేస్తున్నందువల్ల నష్టాల్లో ఉన్నారు, వారి బాగోగుల గురించి 8 పని గంటలు తొలగించి 12 గంటలు మార్చారు. కార్మికులందరూ ఆర్థిక అభివృద్ధితో విలాసవంతంగా సంతోషంగా ఉన్నారంట!! అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా 12 గంటలు వద్దు పది గంటలు బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వం 2గంటలు తగ్గించి 10 గంటలు పని చేయాలని, జీవో తీసుకొచ్చి వెంటనే అమలు చేసే ప్రయత్నం చేస్తుంది.. . వాస్తవంగా బడా వ్యాపారులు కార్పొరేట్ శక్తులు నష్టాల్లోఉన్నారా!! లక్షల కోట్లకు అధిపతులై విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు.. సరూర్ నగర్ సర్కిల్ భవన నిర్మాణ కార్మిక యూని యన్ సిఐటియు అధ్యక్షులు ఎండి లతీఫ్, వృత్తిదారుల సంఘం నాయకులు సిహెచ్. వెంకన్న , రంగారెడ్డి జిల్లా రజక సంఘం కార్యదర్శి సి. మల్లేష్, కృష్ణ, కే. రాములు, గోపీనాయక్, కట్టా శ్రీనివాస్, గోకు మల్ల చైతన్య, కే చంద్రయ్య ,ఎల్ శంకర, పి శ్రీను, హనుమంతుబట్టు, పరశురాములు, బి నరసింహ, సిహెచ్ యాదగిరి, డి ధర్మయ్య పాల్గొన్నారు.

**దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎల్బీనగర్ చౌరస్తాలో ఏఐటీయూసీ ,వివిధ ప్రజాసంఘాలు, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ , నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బొడ్డుపల్లి కృష్ణ , మద్దిలేటి , ఆర్ రాజేందర్ లలిత తదితరులు పాల్గొన్నారు.**

- (రంగారెడ్డి మనం న్యూస్)




## ఘనంగా సింఫోని సర్వ సమ్మేళనం





**వనస్థలిపురం ఫిబ్రవరి 13 (మనం న్యూస్)ః** వనస్థలిపురం హిల్ కాలనీ లోని బచ్పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం వేడుకలను సింఫోని సర్వ సమ్మేళనం పేరట ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బచ్పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్స్ కె శ్రీకాంత్ రెడ్డి, కే రూపా రెడ్డి, కె కౌశిక్ రెడ్డితో పాటు పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ కల్పవల్లి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన అనేక సాంస్కృతిక నృత్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ నిలబడాలంటే విద్య తో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, సృజనాత్మక త, సామాజిక బాధ్యత మొదలైన విలువలతో కూడిన విద్యను తమ విద్యాసంస్థలు విద్యార్థులకు అందిస్తున్నాయని, దీనికి తల్లిదండ్రులు కూడా తమ పూర్తి సహకారం అందించాలని, అప్పుడే బాలల భవిష్యత్తు బంగారమయం అవుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో బచ్పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్స్ ప్రాంతీయ కార్యాలయ బృందం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకుల కళా తాళ ధ్వనులతో పాఠశాల వార్షికోత్సవం వేడుకలు సంబరాలు అంబరాన్నంటాయి.

## నేడే తీర్పులో లోపల భయం టెన్షన్ టెన్షన్ లో అభ్యర్థులు

- ఉంటామా ఉడుతామా అన్న ఉత్కంఠతో అభ్యర్థులు
- 'అన్న నువ్వే గెలుస్తావ్' అని అనుచరులిస్తున్న ధైర్యం
- మొత్తానికి అభ్యర్థుల భవిష్యత్తు షాద్ నగర్ స్టేడియం స్ట్రాంగ్ రూములో ఉన్న బ్యాలెట్ బాక్సుల్లో...

**షాద్ నగర్, ఫిబ్రవరి 12, (మనం న్యూస్):** మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ ముగియగా, ఇప్పుడు అందరి చూపు నేటి ఫలితాలపై నిలిచింది. పైపైకి గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు లోలోపల మాత్రం టెన్షన్తో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముంచుతారా? గట్టెక్కిస్తారా? అన్న ఆందోళనతో రాత్రింబవళ్లు లెక్కలు వేసుకుంటున్నారు. పోలింగ్ పూర్తయ్యాక ఏజెంట్ల వద్ద ఉన్న ఓటరు జాబితాల ఆధారంగా సామాజిక వర్గాల వారీగా ఓట్ల లెక్కలు తీస్తున్నారు. ఎక్కడెక్కడ ఎక్కువ ఓట్లు పడ్డాయి? ఏ వర్గం తమకు అనుకూలంగా నిలిచింది? ప్రత్యర్థికి ఎన్ని ఓట్లు వెళ్లాయో అన్నదానిపై గణాంకాలు గీస్తున్నారు. కొందరు మెజారిటీ లెక్కలు వేసుకుంటుంటే, మరికొందరు పరువు నిలుస్తుందా లేదా అన్న ఆలోచనలో మునిగిపోయారు. ఎన్నికల ప్రచారంలో డబ్బు, దావతులు, వాగ్దానాలు అన్నీ చేశామని చెప్పుకుంటున్నా, తుది తీర్పు మాత్రం ఓటర్ల చేతుల్లోనే ఉందని అందరికీ తెలుసు. ఉంటామా... ఊడుతామా? అన్న ఉత్కంఠతో అభ్యర్థులు కునుకులేకుండా ఉన్నారు. అనుచరులు మాత్రం అన్నా నువ్వే గెలుస్తున్నావ్ అంటూ ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి అభ్యర్థుల భవిష్యత్తు ఇప్పుడు స్ట్రాంగ్ రూమ్లో ఉన్న బ్యాలెట్ బాక్సులోనే బందీ అయింది. రేపటి ఫలితాలతో ఎవరి రాజకీయ ప్రయాణం ఎటు మలుపు తిరుగుతుందో అని టెన్షన్... టెన్షన్... వెయిట్ అండ్ సీ!

# కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి

## సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ

**రంగారెడ్డి, ఫిబ్రవరి 12 (మనం న్యూస్)ః** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కొత్తపేట చౌరస్తాలో నిరసన కార్యక్రమం ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్ ఆధ్వర్యంలోచేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ హాజరై అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సవరణ చట్టం- 2025, విబి జి-రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ ఐ సి 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించాలని, కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.




కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని, కార్మికుల్ని నిరాయుధులను చేసి పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లకు బంగారు పళ్ళెంలో పెట్టి బహుమానం ఇచ్చేందుకు సిద్ధమైందని అన్నారు. అందులో భాగంగానే వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది. వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను 6 సంవత్సరాల క్రితం (2019, 2020 సంవత్సరాలలో) తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడిన ఫలితంగా ఇంతకాలం వాటిని అమలు చేయకుండా ఆపగలిగాము. కానీ నేడు మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుతో కార్పొరేట్ సంస్థల సులభతర వ్యాపారానికి ద్వారాలు తెరిచి , కార్పొరేట్ల ప్రయోజనాలు, వారి లాభాలు పెంచేందుకే 2025 నవంబర్ 21న లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫికేషన్ జారీ చేసింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గ్యార క్రాంతి కుమార్, కమలమ్మ, ఇస్మాయిల్, శ్యామల, రమణమ్మ ,ఉష, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రిని హతమార్చిన కొడుకు అరెస్ట్



**షాద్ నగర్, ఫిబ్రవరి 12 (మనం న్యూస్)ః** షాద్నగర్ పట్టణ పరిధిలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు వేగ వంతంగా చేదించారు. సొంత తండ్రిని హత్య చేసిన కుమారుడిని పాల్త్యవత్ మోహన్ అలియాస్ గుండును గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు. ఫరూక్ నగర్ మండలం దేవుని బండ తండాకు చెందిన పాతులవత్ బాలు (43) తన కూతురు పెళ్లి విషయంలో తన పేరుపై ఉన్న ఐదు గంటల భూమిని విక్రయించే విషయంలో బాలు నిరాకరించడంతో ఆగ్రహించిన సొంత కొడుకు తండ్రికి మద్యం తాగించి అనంతరం ఆటోలో తీసుకువెళ్లి నేరెళ్ల చెరువు వద్ద గుంతలో తోసి హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. భార్య సోనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డిసిపి శిరీష, ఏసీ పి లక్ష్మీనారాయణ ఆదేశాను సారం దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆటో టి ఎస్ 06 యు డి 9111 లో పారిపోతున్న నిందితున్ని అరెస్టు చేసి విచారణ చేయడంతో కుమారుడే తండ్రిని హతమార్చినట్లు తెలిపారు. డిసిపి శిరీష, ఏసీపి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కేసును చేదించినట్లు సిఐ తెలిపారు. ఈ కేసు చేతనలో విచారణ అధికారి వెంకటేశ్వర్లు, సుశీల, పీసీలు బాలరాజు, మోహన్, రాజేష్, జోత్స్న, నరేందర్ తదితరులు కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.

## వార్డు సభ్యులకు శాఖల కేటాయింపు

### సర్పంచ్ వినూత్న ఆలోచన

**కొడిమ్యాల, ఫిబ్రవరి 12 :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నమిలకొండ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం సర్పంచ్ మహమ్మద్ షాబుద్దీన్ వార్డు సభ్యులకు శాఖలను కేటాయించారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం కోసం సభ్యులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి శాఖను వార్డు సభ్యులకు కేటాయించాం. ఈ విధంగా బాధ్యతలు పంచుకోవడం ద్వారా అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. ప్రజలతో నేరుగా అనుసంధానం ఏర్పడి సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయి అని తెలిపారు. గ్రామస్థులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, పంచాయతీ పనులు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**1వ వార్డు ప్రశాంత్.. పారిశుద్ధ్య డంపింగ్ నిర్వహణ**
**2వ వార్డు దొంతి సారపు మౌనిక.. స్త్రీ శిశు సంక్షేమ శాఖ నిర్వహణ**
**3వ వార్డు గోనే పెల్లి నవ్య.. ఆరోగ్యశాఖ నిర్వహణ**
**4వ వార్డు సాత్రాజీ రాజు.. రెవెన్యూ శాఖ నిర్వహణ**
**5వ వార్డు శ్రీమంతుల వెంకటరమణ.. తాగునీటి నిర్వహణ**
**6వ వార్డు కోనేపల్లి ప్రశాంత్.. విద్యాశాఖ నిర్వహణ**
**7వ వార్డు ఎగుర్ల నవత.. వ్యవసాయం పశుపోషణ శాఖ నిర్వహణ**
**8వ వార్డు చేలు మల్ల లత.. విద్యుత్ శాఖ నిర్వహణ**
**9వ వార్డు పబ్బా మహేష్.. ఉపాధి హామీ నిర్వహణ**
**10వ వార్డు కోమటి అనిల్.. గృహ నిర్మాణ శాఖ నిర్వహణ**

# ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు
- ఉద్యోగుల ఆరోగ్య భద్రతపై విస్తృత సమావేశం

**హైదరాబాద్,ఫిబ్రవరి12(మనం ప్రత్యేక ప్రతినిధి)ః** ఉద్యోగుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు ఉద్ఘాటించారు.గురువారం చీఫ్ సెక్రెటరీ అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం కొత్తగా అమలు చేయబోయే ఎంప్లాయిస్ హెల్త్ స్కీం పై అన్ని ఉద్యోగ సంఘాలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణరావు మాట్లాడుతూ, గతంలో అమలైన హెల్త్ స్కీంలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుతూ, ఉద్యోగులకు సమగ్రంగా,సమర్థవంతంగా వైద్య సేవలు అందించేలా కొత్త విధానాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. పాత విధానంలో ఉద్యోగులకు సరైన వైద్య సదుపాయాలు అందకపోవడం, చికిత్సల విషయంలో పరిమితులు ఉండడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ మేరకు ఈ కొత్త స్కీంను తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశానికి తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ హాజరై, ఉద్యోగుల సమస్యలను ప్రధాన కార్యధర్శికి తెలియజేశారు

**కొత్త విధానంః**

కొత్తగా రూపొందించిన విధానం ప్రకారం ఉద్యోగుల మూల వేతనం నుండి 1.5 శాతం కాంట్రిబ్యూషన్ వసూలు



చేయబడుతుందని,దీనివల్ల సుమారు సంవత్సరానికి రూ. 500 కోట్ల నిధులు సమకూరనున్నాయన్ని సీఎస్ తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం కూడా సంవత్సరానికి రూ. 500 కోట్లు కాంట్రిబ్యూట్ చేయడం ద్వారా మొత్తం రూ. 1000 కోట్లతో ఈ స్కీంను అమలు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కొత్త పథకాన్ని15 రోజుల్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోగ్య భద్రత పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు 15 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు,వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్య చికిత్సలకు అపరిమితమైన లబ్ధి చేకూరనున్నట్లు సీఎస్ స్పష్టంచేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం శుభపరిణామమని, స్కీం అమలులో పారదర్శకత,సమర్థతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యధర్శికి విన్నవించారు.

# మీరువోతే బాదేం లేదు ?..

- కార్యకర్తలే పార్టీకి వెన్నెముక
- వారంత 'పూజకు పనికిరాని పువ్వు'లు : కేటీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** హైదరాబాద్ మహానగరంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఒకటి కాదు?.. ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్లో చేరారు. తెలంగాణ భవన్లో జరిగిన ఈ కార్యక్రమంలో.. కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్వన్ కోటగా నిలిచిందన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

**తెలంగాణకు.. కేసీఆర్యే శ్రీరామరక్ష..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్బీఐ బ్రాంచ్లో దోపిడీలు, చందానగర్లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

**పార్టీ పటిష్టానికి డివిజన్ల వారీగా సమావేశాలు..**

త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం.

ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటాం అని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.




## 15న సేవాలాల్ జయంత్యుత్సవాలు

- బంజారా భవన్లో సేవాలాల్ సాంస్కృతిక కార్యక్రమాలు
- గిరిజన సంక్షేమ శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** ఈ నెల 15 వ తేదీన బంజారాహిల్స్ లోని సేవాలాల్ బంజారా భవన్ లో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఘనంగా జరుగనుంది. ఈ జయంతి ఉత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాష్ట్రానికి చెందిన అందరు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక కార్పొరేటర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని గిరిజన సంక్షేమ శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా లంబాడీ గిరిజన సాంప్రదాయ పద్ధతి ప్రకారం సంత్ సేవాలాల్ ఆరాధన కార్యక్రమాలు, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 2024 నాటి సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని గౌ. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు అప్పటి వరకు వేడుకలకు ఖర్చు పెడుతున్న రూ. కోటిని రూ. రెండు కోట్లుగా రెట్టింపు చేయడమే కాకుండా బంజారా ఉద్యోగులకు ఉత్సవాలు జరుపుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 15 నాడు స్పెషల్ లీవ్ శాంక్షన్ చేశారని గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి 21 వరకు అన్ని జిల్లాలలోని అన్ని ఎమ్మెల్యే నియోజకవర్గాలలో జరుగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహ ణకై రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరికీ ఆహ్వానం పలికారు.

## నగరాభివృద్ధి కొక్కానికి వేలాడే మనిషి గోస

రాతిరి ఎన్నెల భంగు తాగిన
లోకం కదలకుండా ఉంటే
గూళ్లలో నుండి వస్తున్న
ఊపిరి ఎగపోత శబ్దాలు
లోకమింకా బతికే ఉందని
చెబుతున్నాయి ఏలికలకు
నగరంలో తెల్లార్లు తీరొక్క బండ్లు చేసే
తీరుతీరు అసంబద్ధపు సప్పుల్లకన్నా
రాతిరి నిశ్శబ్దంలో ఆకలితో
అరిచే ఏ కుక్కల అరుపులో
మురికి కాలువల పక్కన
ఫుట్ పాతుల మీద దొర్లే
అభాగ్యుల ఆకలి కడుపులు చేసే
రొదలే మహా ఇబ్బంది కలిగిస్తాయి
నగరం అవతలి గోదాము దగ్గర
భయం భయంగా తిరిగే పందికొక్కుల చూసి
మీరే నయం కడుపు నింపుకోడానికే
చీకటేలా దొంగచాటు గొస్తారు
మమ్ముల ఏలేటోళ్ళు మాత్రం
ఎదేచ్చగా పట్టపగలే దోస్తారు అనీ
లోలోపలే గునుగుతున్నాడు
గోదాముకు కాపలున్న వాచ్మెన్
బయటకి వినబడితే తన
డొక్కెండుతుందనే భయంతో
గోదాము చివరన చీకటి
డేరా కింద చేరిన పడుసు జంట
నాలుగు పెదాలను మెలికేసుకుని
రెండు ముక్కులతో ఒకే ఊపిరి
తీసుకుందామనుకుంటే
పక్కనే వచ్చి కిచకిచా చప్పుడు చేస్తూ
ఇబ్బంది పెట్టే ఎలుకలు
విసుగ్గా ముసుగు తీసి
బయటకొచ్చిన జంటకు తోడుగా
నగరం ఏ మూలనుండో ఏ ఆకలిదో
తెలియని కుక్క తీస్తున్న శోక రాగం
మన బతుక్కి ఆ కుక్కలా తుర్తిగా
అరిచే వీలు కూడా లేదాయె
తెల్లార్లు చూసిన
అన్యాయాలను మరిసిపోడానికే
రాతిరి సౌలతి కనిపెట్టీ మనుసులకు
బతుకాస పెట్టారనుకుంటే
తు.. మన బతుక్కు ఏ ఆకలి
సరిగ్గా తీర్చుకునే దారి లేదు తు...
తు తు తూ అంటూ ఉమ్మిన వారి
ఉమ్మే ఆకాశంలో మెరిసే సుక్కలు
గుడిసె నుండి చిరాగ్గా
బయటకొచ్చిన వారిద్దరిప్పుడూ
రాజు సుఖం కోసమే కదిలి అరిగే
బండిరుసు గిర్రల్లా నిలబడ్డారు
సూర్యుణ్ణి ఎక్కించుకుని లోకాన్ని
ఎట్టికి ఎలుగు మయం చేయడానికి

**- దిలీప్.వి**
8464030808



## సఖీ!

మధువులొలికే ఓ చల్లని రేయిలో
సుషుప్తావస్థలో తలపులలోకి
నాలో వెలుగుకి కారణమైన
నీ సిరిమువ్వల అందెలరవళి
వచ్చి చేరడంతో ,ఒక్క ఉదుటున
మెలకువ వచ్చింది
కిటికీలోంచి బయటకు చూస్తే
శారదాకాశంలో
తేలియాడుతోన్న తెలిమబ్బులు,
కర్పూరపుపొడిలా కురుస్తోన్న
వెన్నెలసోనల జడి
ప్రియా! నీవేనేనైన ఆరోజుల్లో ...
నీ సమక్షం, వేసవి సందెవేళ
వికసించిన మల్లెల సౌరభాన్ని
మోసుకుపోయే చల్లగాలిలా,
శరత్కాలంలో
పూలపరాగంతో వెలిగిపోతున్న నింగిలా,
మరువపు సుగంధంలా,ఉండేది.
ఆ మధురక్షణాల్లో నీ సాంగత్యంతో
పెల్లుబికిన కవితావేశంతో,
మదిలోని భావసౌగంధికలను గుదిగుచ్చి
నీపై నేనల్లిన ప్రేమ కవితలెన్నో.
రసరమ్యమైన వాటినాస్వాదించడానికి,
చకోరాలు సైతం వెన్నెల్లో విహరించిన
మధురక్షణాలెన్నెన్నో
ఓ ప్రియతమా! నీతో ముడిపడి
ఇంపుగా మలచబడి,
ఎంతో ఆనందానిచ్చిన ఈ వేళలో
నాలో చెలరేగిన అలజడులెన్నో
ప్రవాహమై మదిని ముంచేస్తోంటే,
కలలో పలకరించిన కోయిల
ఇలలో మధురగానంతో ఎదురై
అలరిస్తుందని నమ్మడం వినా
ఏమిచేయలేక
నీకోసం మరోజన్మ ఎత్తడానికైనా
సిద్ధంగా ఉన్న ఆశాజీవిని

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# కౌంటింగ్ టేబుల్‌పై నగర పాలన భవిష్యత్

నేడు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పట్టణ ప్రజాస్వామ్యానికి ఒక కీలక ఘట్టంగా నిలుస్తోంది. గత కొన్ని వారాలుగా జరిగిన ప్రచార హోరు, వ్యూహాత్మక రాజకీయ కసరత్తులు, అభ్యర్థుల మధ్య పోటీ, ఓటర్ల తీర్పు-ఇవన్నీ ఇప్పుడు ఒకే కేంద్ర బిందువుకు చేరుకున్నాయి. అదే కౌంటింగ్ టేబుల్. పోలింగ్ ముగిసిన నాటి నుంచి పార్టీల శిబిరాల్లో నెలకొన్న ఉత్కంఠ, ఆశలు-ఆందోళనలు నేడు తారాస్థాయికి చేరు కున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా చిన్న రాజకీయ సంఘటనలుగా భావించినప్పటికీ, వాస్తవానికి ఇవే పట్టణ పాలనకు పునాది వేస్తాయి. నీటి సరఫరా నుంచి పారిశుధ్యం వరకు, రోడ్లు నుంచి ప్రజా ఆరోగ్య సేవల వరకు, పట్టణ జీవన ప్రమాణాలను నిర్ణయించేది ఈ స్థానిక పాలనా వ్యవస్థే. అందువల్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కేవలం విజయం-పరాజయాల గణాంకం మాత్రమే కాదు. పట్టణ ప్రజల అభిలాషల ప్రతిబింబం.

ఈ ఎన్నికల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలంటే పోలింగ్ దశను పరిశీలించాల్సిందే. లక్షలాది మంది పట్టణ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించడం ప్రజాస్వామ్యంపై పెరుగుతున్న విశ్వాసాన్ని సూచిస్తోంది. కొన్ని ప్రధాన రాష్ట్రాల్లో నమోదైన భారీ పోలింగ్ శాతం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యానికి గురి చేసింది. పట్టణ ప్రాంతాల్లో సాధారణంగా కనిపించే నిరాసక్తతకు భిన్నంగా,ఈసారి యువత, మహిళలు, మధ్యతరగతి ఉద్యోగులు కూడా చురుకుగా పాల్గొనడం గమనార్హం. ఇది స్థానిక సమస్యలపై ప్రజల్లో పెరిగిన అవగాహనకు సంకేతం. పట్టణ మౌలిక వసతులు, పన్నుల వినియోగం, పర్యావరణ పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా నియమ నిబంధనలకు లోబడి సాగేందుకు ఎన్నికల యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ కేంద్రాల్లో బహుళ స్థాయి భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో లెక్కింపు వంటి చర్యలు అమల్లో ఉన్నాయి. ప్రతిరౌండ్ ముగిసిన తర్వాత ఫలితాలను అధికారికంగా నమోదు చేయడం, అభ్యంతరాలకు అవకాశం కల్పించడం వంటి విధానాలు ప్రజాస్వామ్య నమ్మకాన్ని బలపరుస్తాయి.

సాంకేతిక పరిజ్ఞాన వినియోగం కూడా లెక్కింపు వేగం, ఖచ్చితత్వాన్ని పెంచింది. ఈ ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా రాజకీయంగా పెద్ద చర్చకు దారితీయగలదనే అవగా హనతో



అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

పార్టీల దృష్టిలో ఈ ఎన్నికలు కేవలం స్థానిక అధికార పోరాటం మాత్రమే కాదు. భవిష్యత్ రాజకీయ దిశను సూచించే సంకేతాలు. ప్రధాన జాతీయ, ప్రాంతీయ పార్టీలు పట్టణ ఓటర్ల మద్దతును తమ రాజకీయ బలం కొలమానంగా చూస్తున్నాయి. ప్రచార దశలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, అవినీతి నిరోధం వంటి అంశాలు ప్రధాన అజెండాగా నిలిచాయి. ఇప్పుడు ఆ వాగ్దానాలకు ఓటర్లు ఇచ్చిన తీర్పు వెల్లడవుతోంది. కౌంటింగ్ కేంద్రాల వెలుపల పార్టీ కార్యకర్తల ఆత్రుత, అభ్యర్థుల ఉద్విగ్నత, నాయకత్వం నుంచి వస్తున్న ప్రకటనలు-ఇవన్నీ రాజకీయ ఉష్ణోగ్రతను పెంచుతున్నాయి.

కొన్ని రాష్ట్రాల్లో నమోదైన గణాంకాలు ఈ ఎన్నికల ఉత్కంఠను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో నమోదైన అధిక ఓటింగ్ శాతం ప్రజల పాల్గొనడాన్ని తెలియజేస్తోంది. వేల సంఖ్యలో అభ్యర్థులు పోటీలో నిలవడం స్థానిక రాజకీయాల్లో పెరిగినపోటీని సూచిస్తోంది. అనేక స్థానాల్లో గెలుపు-ఓటమి తేడా స్వల్పంగా ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి కొత్త అభ్యర్థులు, యువ నాయకులు ఎక్కువగా రంగంలోకి రావడం కూడా విశేషం. ఇది పట్టణ రాజకీయాల్లో తరాల మార్పుకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఓట్ల లెక్కింపు దశలో ప్రతి రౌండ్ కీలకం. ప్రారంభ రౌండ్లలో ఆధిక్యం సాధించిన పార్టీ చివరికి విజయం సాధిస్తుందనే హామీ లేదు. పోస్టల్‌బ్యాలెట్లు, సేవాఓట్లు, చివరి రౌండ్ల లెక్కింపు అనూహ్య మలుపులకు కారణమవుతాయి. అందువల్ల పార్టీల వార్‌రూముల్లో నిరంతర విశ్లేషణ కొనసాగుతోంది. ప్రతి టేబుల్ నుంచి వచ్చే సమాచారం ఆధారంగా వ్యూహాత్మక ప్రకటనలు విడుదలవుతున్నాయి. సోషల్ మీడియా, టెలివిజన్ ఛానెళ్లు, డిజిటల్ వేదికలు క్షణక్షణం నవీకరణలను అందిస్తూ ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

ఈ ఎన్నికలు పట్టణ పాలనపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశముంది. గెలిచే ప్రజా ప్రతినిధులు రాబోయే సంవత్సరాల్లో పట్టణ అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాల్సి ఉంటుంది. స్మార్ట్ మౌలిక వసతులు, పారిశుధ్య సంస్కరణలు, నీటి నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో స్పష్టమైన కార్యాచరణ అవసరం. ఓటర్లు ఈ అంశాల పైనే తీర్పు ఇచ్చారని భావించవచ్చు. విజేతలపై బాధ్యత మరింత పెరుగుతుంది.

రాజకీయంగా ఈ ఫలితాలు విస్తృత సందేశాన్ని ఇస్తాయి. పట్టణ ఓటర్ల మూడ్ను అంచనా వేసేందుకు పార్టీలు ఈ గణాంకాలను విశ్లేషిస్తాయి. రాబోయే అసెంబ్లీ లేదా పార్లమెంటు ఎన్నికల వ్యూహాలపై కూడా ఇవి ప్రభావం చూపుతాయి. పట్టణ ప్రాంతాల్లో బలమైన పట్టు సాధించిన పార్టీలు తమ రాజకీయ వ్యూహాన్ని విస్తరించే అవకాశముంది. అదే సమయంలో ఆశించిన ఫలితాలు రాకపోతే ఆత్మపరిశీలనకు దారితీస్తాయి.

ఓట్ల లెక్కింపు కేవలం గణాంక ప్రక్రియ మాత్రమే కాదు; ప్రజాస్వామ్య విశ్వాసానికి ప్రతీక. ప్రతి ఓటు విలువైనదనే భావనను ఈ దశ మరొకసారి గుర్తుచేస్తుంది. స్వల్ప తేడాలతో నిర్ణయించబడే విజయాలు ప్రజాస్వామ్యంలో ఓటుశక్తిని ప్రతిబింబిస్తాయి. ఓటర్లు ఇచ్చిన తీర్పు రాజకీయ నాయకత్వానికి మార్గదర్శకం. ప్రజల ఆశలు, ఆవశ్యకతలు, స్థానిక సమస్యలపై స్పష్టమైన సంకేతం.

నేడు కౌంటింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న ఉత్కంఠ, రాజకీయ శిబిరాల్లో ఉత్సాహం, ప్రజల్లో ఆసక్తి-ఇవన్నీ ప్రజాస్వామ్య జీవ తత్వాన్ని సూచిస్తున్నాయి. ఫలితాలు ఏవైనా కావొచ్చు. ముఖ్యమైనది ప్రజలు పాల్గొన్న ప్రక్రియ. పట్టణ ప్రజాస్వామ్యం బలపడితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యం. ఈ ఎన్నికలు అదే దిశగా ఒక కీలక అడుగు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి విజేతలు ప్రకటించబడతారు; కానీ అసలు విజయం ప్రజాస్వామ్యానిదే. ప్రజల తీర్పును గౌరవిస్తూ, పట్టణ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కొత్త పాలనా అధ్యాయం ప్రారంభమవుతుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# తెలుగు వారి గుండెచప్పుడు ఆకాశవాణి



విజ్ఞాన వినోదాల వేదిక మన రేడియో. ప్రపంచం ఎంత వేగంగా మారుతున్నా, సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్నా, సామాన్యుడి నేస్తంగా, పేదవాడి విజ్ఞాన గనిగా, తరగని ఆదరణతో వర్ధిల్లుతున్న ఏకైక మాధ్యమం 'రేడియో'. అద్భుతమైన ఈ ఆవిష్కరణకు, ఆకాశవాణి సేవలకు గుర్తుగా మనం ప్రతి ఏటా ఫిబ్రవరి 13న 'ప్రపంచ రేడియో దినోత్సవం' జరుపుకుంటాం. 'అద్భుత రేడియో ఆవిష్కర్త శాస్త్రవేత్త గూగ్లియెల్మో మార్కోని.

శబ్ద తరంగాలను గాలిలో ప్రయాణింపజేసి, ఖండాంతరాలకు సమాచారాన్ని చేరవేయగలమని నిరూపించిన గొప్ప శాస్త్రవేత్త మార్కోని. మార్కోని వైర్‌లెస్ (నిస్తంత్రీ) విధానం ద్వారా రేడియోను ఆవిష్కరించి కమ్యూనికేషన్ రంగంలో విప్లవం సృష్టించారు. 1890లలో ఆయన వేసిన పునాది, నేడు మనం అనుభవిస్తున్న ఇంటర్నెట్, వైఫై, మొబైల్ సేవలకు మాతృక అని చెప్పక తప్పదు.

చారిత్రక నేపథ్యం గురించి తెలుసుకుందాం. 1946, ఫిబ్రవరి 13న ఐక్యరాజ్యసమితి రేడియో తన తొలిప్రసారాన్ని ప్రారంభించింది. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, యునెస్కో 2011లో ఈ రోజును 'ప్రపంచ రేడియో దినోత్సవం'గా ప్రకటించింది. ఎన్ని ఆధునిక సాంకేతిక పరికరాలు వచ్చినా, ప్రసార మాధ్యమాలలో 'రేడియో'కి ఉన్న స్థానం సుస్థిరమైనది. కంటికి కనిపించకుండానే, కేవలం శబ్ద తరంగాలతో కోట్లాది మంది హృదయాలను తాకే అద్భుత సాధనం రేడియో. రేడియో మాధ్యమం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం, సమాచార మార్పిడిలో దీనిని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు లేదా అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు, విద్యుత్ సరఫరా లేని మారుమూల ప్రాంతాల్లో కూడా సమాచారాన్ని చేరవేసే ఏకైక సాధనం రేడియో. టీవీ, స్మార్ట్‌ఫోన్‌లను ఎదుర్కొనలేక 'రేడియోకి కాలం చెల్లిపోయింది అనుకున్నారు. టీవీ వచ్చాక రేడియోను ఎవరూ వినరని భావించారు. ఆ తర్వాత ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్లు (చరవాణి) వచ్చాయి. టీవీ చూడాలంటే మనం ఒకే చోట కూర్చోవాలి, కానీ రేడియో అలా కాదు. పొలం పనులు చేసుకుంటూ, వంట చేస్తూ, లేదా వాహనం నడుపుతూ కూడా వినగలిగే ఏకైక నేస్తం రేడియో. నేడు ఎఫ్.ఎమ్ రూపంలో, పాడ్‌కాస్ట్‌ల రూపంలో రేడియో తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ యువతకు కూడా దగ్గరైంది.

భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవించడం, సమాచారాన్ని అందరికీ చేరువ చేయడం. భారతదేశంలో ఆకాశవాణి నెట్‌వర్క్ చాలా విస్తృతమైనది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రేడియో నెట్‌వర్క్‌లలోఒకటి. ఆకాశవాణి కేంద్రాల సంఖ్య ప్రస్తుతం దేశవ్యాప్తంగా



సుమారు 479 ఆకాశవాణి కేంద్రాలు ఉన్నాయి. ఇవి దేశంలోని 92% భౌగోళిక ప్రాంతాన్ని మరియు 99.19% జనాభాను కవర్ చేస్తాయి. ఆకాశవాణి 23 ప్రధాన భాషల్లోనూ, 179 మాండలికాల్లోనూ ప్రసారాలు అందిస్తోంది. ప్రధానమైన ఆకాశవాణి కేంద్రాలు. ఆకాశవాణి సేవలను ప్రధానంగా మూడు రకాలుగా విభజించవచ్చు.

దేశంలోని మెట్రో నగరాల్లో ఉన్న కేంద్రాలు అత్యంత కీలకమైనవి. న్యూఢిల్లీ కేంద్రం ఇది ఆకాశవాణి ప్రధాన కార్యాలయం. ఇక్కడి నుంచే జాతీయ వార్తలు, పార్లమెంట్ విశేషాలు ప్రసారమవుతాయి. ముంబై, కోల్‌కతా, చెన్నై కేంద్రాలు కూడా జోనల్ స్థాయిలో చాలా ముఖ్యమైనవి.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో ఉన్న ప్రధాన కేంద్రాలు. హైదరాబాద్. ఇది తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద కేంద్రం. ఇక్కడి నుంచి ప్రాంతీయ వార్తలు, వివిధ భారతి, ఎఫ్.ఎమ్ రెయిన్‌బో సేవలు అందుతాయి. విజయవాడ... ఆంధ్రప్రదేశ్‌లో ఇది అత్యంత కీలకమైన కేంద్రం. కోస్తా జిల్లాలకు ఇది ప్రధాన సమాచార వనరు. విశాఖపట్నం. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రధాన కేంద్రం. ఇవి కాకుండా కర్నూలు, తిరుపతి, కడప, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ వంటి చోట్ల కూడా ముఖ్యమైన కేంద్రాలు ఉన్నాయి. వివిధ భారతి ఇది వినోదానికి, సినిమా పాటలకి పెట్టింది పేరు. ఇది దేశ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన ఛానెల్. ఎఫ్.ఎమ్ రెయిన్‌బో యువత కోసం రూపొందించిన ఆధునిక మ్యూజిక్ ఛానెల్.

'బహుజన హితాయ - బహుజన సుఖాయ' అనే నినాదంతో పనిచేసే ఆకాశవాణి వార్తలు అత్యంత విశ్వసనీయమైనవిగా ప్రజలు భావిస్తారు. రైతులకు వ్యవసాయ సూచనలు, వాతావరణ సమాచారం అందించడంలో ఆకాశవాణి కీలక పాత్ర పోషిస్తోంది. ఇంటర్నెట్ లేని మారుమూల గ్రామాలకు కూడా ఇది అందుబాటులో ఉంటుంది.

శాస్త్రీయ సంగీతం, జానపద కళలు, సాహిత్యం మరియు నాటకాలను పరిరక్షించడంలో ఆకాశవాణిది పెద్ద చెయ్యి. విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఉపయోగపడే పాఠాలు, చర్చా కార్యక్రమాలు ఇందులో ప్రసారమవుతాయి.

తుఫానులు, భూకంపాలు, యుద్ధాల వంటి విపత్కర పరిస్థితుల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నప్పుడు, ప్రజలకు ధైర్యాన్ని, సమాచారాన్ని అందించే ఆపద్బాంధవుడైన ఏకైక సాధనం రేడియోనే.

ఒకప్పుడు పెద్ద పెట్టెలా ఉండే రేడియో, నేడు ఎఫ్.ఎమ్‌గా, మొబైల్ యాప్స్‌గా, పాడ్‌కాస్ట్‌లుగా మారి యువత జేబుల్లోకి చేరింది.

విజయవాడ ఆకాశవాణి కేంద్రం 1948, డిసెంబర్ 1న ప్రారంభమైంది. ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి ఒకగొప్ప చరిత్ర ఉంది. తెలుగు వారి గుండె చప్పుడైన 'ఆకాశవాణి' ప్రస్తావన రాగానే విజయవాడ రేడియో స్టేషన్ గుర్తుకు రాక మానదు. ఉదయాన్నే భక్తి గీతాలతో నిద్ర లేపడం దగ్గర్నుంచి, రాత్రి లలిత సంగీతంతో జోల పాడే వరకు రేడియో ఒక కుటుంబ సభ్యుడిలా ఉంటుంది. సాహిత్యం, సంగీతం, వ్యవసాయం మరియు నాటక రంగాల అభివృద్ధికి విజయవాడ కేంద్రం చేసిన కృషి అమోఘం. 'భక్తి రంజని', 'కార్మికుల కార్యక్రమాలు', 'మహిళా కార్యక్రమాలు' శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిజాయితీ వార్తలు రేడియోకే సొంతం. రైతు నేస్తం గురించి... ఏ సమయంలో వర్షం పడుతుంది? ఏ పంటకు ఏ మందు వాడాలి? వంటి విషయాలను శాస్త్రీయంగా రైతులకు చేరవేస్తూ, దేశానికి వెన్నెముకైన రైతుకు రేడియో చేదోడువాదోడుగా నిలుస్తోంది. బాలానందం పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమం. 'రేడియో అన్నయ్య' (న్యాయపతి రాఘవరావు),'రేడియో అక్కయ్య'(కామేశ్వరి) పిల్లలకు చెప్పే కథలు, పాటలు ఎంతో ఆసక్తికరంగా ఉండేవి.

పిల్లల సృజనాత్మకతకు ఇది తొలి వేదిక. కార్మికుల కార్యక్రమం కష్టపడి వచ్చిన కార్మికులకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించే కార్యక్రమం. ఇంకా ఆరోగ్య చిట్కాలు, విద్యార్థులకు పాఠాలు, మరియు మానసిక ఉల్లాసాన్నిచ్చే వినోద కార్యక్రమాలు... ఇలా అన్నింటినీ మేళవించిన అద్భుత సమాహారం రేడియో. అందుకే రేడియో ఎప్పటికీ అద్భుతమే. టీవీ, మొబైల్ ఫోన్ల హోరులో కూడా రేడియో తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగుతోంది.

**- పింగళి భాగ్యలక్ష్మి**
9704725609

# చెంచుల బ్రతుకులకు భద్రత కల్పించండి



ఈ దేశ మూలవాసులు ఆదిమ తెగకు చెందిన చెంచులు నల్లమల్ల అరణ్య ప్రాంతంలో వేల సంవత్సరాలుగా నివసిస్తున్న ఆదివాసీ తెగ చెంచు ప్రజలు అడవిలోనే జీవితం, అడవితోనే సంస్కృతి, అడవితోనే వారి గుర్తింపు. అలాంటి చెంచు ప్రజల అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు వారికి కావాల్సింది విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన జీవన ప్రమాణాలు మెరుగుపరచవలసింది పోయి వలసవాదులైన లంబాడా,బంజారాలు ఆరాధించే సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేయడమంటే చెంచు ప్రజల జీవన విధ్వంసం చేయడమే అవుతుంది. ప్రకృతి ఒడిలో జీవిస్తున్న చెంచు ప్రజల సాంస్కృతి, సాంప్రదాయాలు,భాష,కలలను,సామాజిక, ఆచారాలను రక్షిస్తూ వారి బ్రతుకులకు భద్రత కల్పించాలి. మనిషిని మహా ఋషిగా చిత్రీకరించిన లంబాడా, బంజారాలు సేవాలాల్ విగ్రహాన్ని మన్ననూరు ఏజెన్సీ ప్రాంతమైన మద్దిమడుగు చెంచుపెంట, పదర మండలం, నాగర్ కర్నూలు జిల్లా ఆదివాసి చెంచు ఆరాధ్యుడు అభయ ఆంజనేయ స్వామి పురాతన ఆలయం వద్ద 122 అడుగుల ఎత్తైన సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటుకు 22 ఎకరాల భూమిని సేకరించే పనిలో ఇప్పటికే అధికార యంత్రాంగం నిమగ్నమైన విషయం విదితమే. దానిలో 5 ఎకరాల భూమి గ్రామకంఠ మరో 17 ఎకరాల భూమిని స్థానిక చెంచు,ఇతర రైతుల వద్ద నుండి బలవంతంగా సేకరించేందుకు చెయ్యని ప్రయత్నం లేదు. చూపని ఆశ లేదు. పెట్టని భయం లేదు. ఎందుకంటే ఈ నెల 15న తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సేవాలాల్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమానికి ముహూర్తం ఖరారు అయినందున మద్దిమడుగు చెంచు పెంట పరిసర ప్రాంతాలలో అధికార యంత్రాంగం వలసవాదులు హడావుడి అంతా ఇంతా కాదు. అడవికి ప్రకృతికి ఆదివాసి చెంచు ప్రజలకి సంబంధం లేని సేవాలాల్



విగ్రహాన్ని మద్దిమడుగులో ఏర్పాటు చేసేందుకు చూపే శ్రద్ధ... ప్రభుత్వం నల్లమల్ల బిడ్డలైన చెంచుల అభివృద్ధికి కృషి చేయాలి.

ప్రస్తుత కాలంలో చెంచు ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అడవిని కాపాడిన వారే అడవిలో హక్కులు లేకుండా జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. అటవీ హక్కుల చట్టం-2006 ఉన్నప్పటికీ, చాలామంది చెంచులకు ఇప్పటికీ భూమి హక్కుల పట్టాలు లేవు. అటవీ ఉత్పత్తులపై సంపూర్ణ హక్కులు లేకపోవడం వల్ల వారి సంప్రదాయ ఉపాధులు నశిస్తున్నాయి. అందువల్ల చెంచుల అభివృద్ధికి మొదటి అడుగు అడవిపై చట్టబద్ధమైన హక్కుల అమలు కావాలి.

ఉపాధి రంగంలో కూడా చెంచులు తీవ్ర వెనుకబాటులో ఉన్నారు. తేనె, చింతపండు, ఔషధ మొక్కలు వంటి అటవీ ఉత్పత్తులు వారి ప్రధాన జీవనాధారం. కానీ వీటికి సరైన ధరలు లభించకపోవడం, మధ్యవర్తుల దోపిడీ వల్ల చెంచులు లాభపడటం లేదు. ప్రభుత్వం నేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, విలువ జోడింపు శిక్షణ ఇచ్చినట్లయితే చెంచులకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. అలాగే అటవీ సంరక్షణ పనుల్లో చెంచులకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వడం అవసరం.

విద్య విషయానికి వస్తే, చెంచు పిల్లలు చదువు పేరుతో తమ సంస్కృతికి దూరమవుతున్నారు. ఆశ్రమ పాఠశాలలు అడవికి దగ్గరగా ఉండాలి. చెంచు భాష, సంప్రదాయాలను గౌరవించే విధంగా విద్యావిధానం ఉండాలి. చదువుతోపాటు జీవన నైపుణ్యాలు నేర్పితేనే ఆ విద్య వారికి ఉపయోగపడుతుంది.

ఆరోగ్యంలో కూడా చెంచులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. దూరపు ఆసుపత్రులు వారికెంతమాత్రం ఉపయోగపడవు. అడవుల్లో మొబైల్ హెల్త్ యూనిట్లు, పోషకాహార పథకాలు, సంప్రదాయ వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మాత్రమే వారి ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతాయి.

అభివృద్ధి పేరుతో అడవిని నాశనం చేయడం మరో పెద్ద సమస్య. రోడ్లు, భవనాలు అవసరమైన చోట మాత్రమే, పర్యావరణానికి హాని కలగకుండా ఉండాలి. చెంచుల జీవన విధానానికి అనుగుణంగా నివాసాలు, తాగునీరు, సౌర విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలి.

ముఖ్యంగా, చెంచు ప్రజలకు సంబంధించిన ఏ నిర్ణయమైనా వారి అంగీకారంతోనే జరగాలి. గ్రామ సభలకు నిజమైన అధికారాలు ఇవ్వాలి. వాళ్లపై నిర్ణయాలు తీసుకోవడం కాదు, వాళ్లతో కలిసి నిర్ణయాలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. ఆదివాసి చెంచు ప్రజలకు కావాల్సింది విగ్రహాలు కాదు. వారి భూమి హక్కులు, జీవనోపాధి, విద్య, ఆరోగ్యం, గౌరవం. అడవిని కాపాడిన చేతులకే భద్రత కల్పించినప్పుడే, చెంచు ప్రజల అభివృద్ధికి నిజమైన నిదర్శనంగా చెప్పవచ్చు.

**- డాక్టర్. సాగబోయిన పాపారావు**
ఆదివాసీ విద్యార్థి సంఘం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
9989828774

# సమన్వయంతో మహా శివరాత్రి జాతర విజయవంతం చేయాలి

- పకడ్బందీగా తుది ఏర్పాట్లు పూర్తి చేయాలి
- ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్
- వివిధ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి):** మహా శివరాత్రి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి.. విజయవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు స్వామి వారి దర్శనాన్ని సౌకర్యంగా చేసుకునేలా తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టుల్లో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుంచి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆద్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్దంగా ఉండాలని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్దంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని సూచించారు. వృద్ధులు,దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని, వీఐపీ, వీవీఐపీల దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు ఉన్నారు

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు సర్వం సిద్ధం



**జగిత్యాల, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని 5 మున్సిపాలిటీల కౌంటింగ్ ప్రక్రియ కేంద్రాన్ని ఎస్.కె.ఎన్.ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయగా ఈ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లను, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కౌంటింగ్ టేబుళ్ల అమరికపై అధికారులతో చర్చించారు. సిబ్బందికి కేటాయించిన బాధ్యతలపై మార్గదర్శకాలు ఇచ్చారు. ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అభ్యర్థుల ఏజెంట్లకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈవీఎంల భద్రతా ప్రమాణాలను అధికారులు తనిఖీ చేశారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.అత్యవసర సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కౌంటింగ్ రోజున సిబ్బంది సమయానికి హాజరుకావాలని సూచించారు.ఫలితాల ప్రకటనలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజాస్వామ్య ప్రక్రియను గౌరవించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు.ఎన్నికలు శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని వెల్లడించారు.ఈ కార్యక్రమం లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేసేంతవరకు పోరాడుదాం

- సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు




**సుల్తానాబాద్, ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం సుల్తానాబాద్ చేపల మార్కెట్ నుండి సిఐటియు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ అనంతరం రైస్ మిల్లు ఓనర్స్ అసోసియేషన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఇందులో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవల్లి ముత్యంరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ ను రద్దుచేసి, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించేంతవరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గాన్ని పెట్టుబడుదారులకు, కార్పొరేట్లకు బానిసలుగా మారుస్తూ 4 లేబర్ కోడ్స్ ను తెచ్చిందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో పాల్గొన్న కార్మికులకు అభినందనలు తెలిపారు, 2025 విద్యుత్తు సవరణ బిల్లు పేరుతో విద్యుత్తు వాడిన వినియోగదారులే విద్యుత్తు బిల్లు చెల్లించాలని నిబంధన మోడీ ప్రభుత్వం తెచ్చిందని, దీనితో తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు ఇస్తున్న ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల లోపు ఉన్న గృహజ్యోతి వినియోగదారులకు ఉచిత కరెంటు అందకుండా చేస్తున్నారని, ఇది తెలంగాణ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వి బి జి రాం జీ పేరుతో కొత్త పథకం తెచ్చి గ్రామీణ పేదలకు ఉపాధి లేకుండా చేస్తున్నారని అన్నారు, త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో 4 లేబర్ కోడ్స్ ను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయమని, 2025 విద్యుత్తు సవరణ బిల్లును అమలు చేయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. లేకుంటే రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కూలీలు తిరుగుబాటు చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల సిఐటియు కన్వీనర్ తాండ్ర అంజయ్య, కో. కన్వీనర్ మాతంగి రాజమల్లు , ఆపరేటర్ల సంఘం నాయకులు చారి, బండారు తిరుపతి, స్వామి సంపత్ రమేష్,,గుమస్తాలు హరికిషన్ భగవాన్ కొమురయ్య ప్రకాష్, రమేష్ ప్రశాంత్,రాజ్ కుమార్, సత్యం, లారీ డ్రైవర్లు యూనియన్ అధ్యక్షులు, పోగుల తిరుపతి, జంగ తిరుపతి మంజూరు అంజయ్య శంకర్ రబ్బాని శీను మునీర్ మజార్ కిరణ్ షమీం వాజీజ్, ఈజాజ్, మహిళా కార్మిక అధ్యక్షురాలు అన్నపూర్ణ రమ శోభ వెంకటమ్మ విజయ, అంగన్వాడి మండల అధ్యక్షురాలు భార్గవి శోభారాణి వివిధ రంగాల కార్మికులు మహిళలు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళి ని ఎమ్మెల్యే విజయ రమణారావు గురువారం ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో పార్టీ అభ్యర్థులు, నాయకుల తో కలిసి సమీక్షించారు. శుక్రవారం జరిగే కౌంటింగ్ సందర్భంగా తీసుకునే జాగ్రత్తల గురించి ఎమ్మెల్యే కార్యకర్తలకు పలు కీలక, సూచనలు సలహాలు ఇచ్చారు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ మున్సిపల్ లోని 15 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తుందని పేర్కొన్నారు. దాదాపు 20 రోజులుగా పార్టీ విజయం కోసం అహర్నిశలు కష్టపడి కృషి చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఇన్చార్జులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రానున్న రోజుల్లోనూ సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేసి మరింతగా ప్రజల మన్ననలను పొందుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు, ఓదెల ఆలయ చైర్మన్ చికట్ల మొండన్న, ఉట్ల వర ప్రసాద్,సాయిరి మహేందర్, డాక్టర్ రమేష్ వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, కౌన్సిలర్ అభ్యర్థులు, సర్పంచ్ లు,ఎన్నికల ఇంచార్జులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహణ

- జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్

**పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి):** ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు టాటా మోటార్స్, హుండాయ్ కంపెనీల్లో 40 సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, పెద్దపల్లి, రామగుండం, కరీంనగర్ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఈ ఉద్యోగాల కొరకు విద్యార్హతలు ఐటిఐ, డిప్లమా, ఎలక్ట్రికల్, మెకానికల్, ఏదైనా డిగ్రీ అర్హత, వయస్సు 19 సంవత్సరాల నుండి 25 సంవత్సరాలు ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి గలవారు ఫిబ్రవరి 18న బుధవారం రోజు ఉదయం 11 గంటల నుంచి సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థు రూమ్ నెంబర్. 233 వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఉపాధికల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అంతారం గ్రామ సభ సమాచారం



**చేవెళ్ల, ఫిబ్రవరి 12 (మనం న్యూస్) :**చేవెళ్ల మండల పరిధి అంతారంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామ అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనపై గ్రామస్తులతో సమగ్రంగా చర్చించారు. గ్రామ ప్రజల సమస్యలను నేరుగా విని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో: ఉప సర్పంచ్ కావలి వెంకటేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి నామ శ్రీకాంత్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగలు

- భారీగా నగలు మాయం

**కామారెడ్డి క్రైమ్, ఫిబ్రవరి 12 ( మనంన్యూస్):** తాళం వేసిన ఇంట్లో చొరబడి 16 తులాల బంగారం, 3 తులాల వెండి, రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లిన ఘటన కామారెడ్డి పట్టణంలోని బృందావన్ కాలనీలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం., పాల్వంచ మండలం భవానిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న శ్రీ రేఖ బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి దేవునిపల్లి గ్రామంలో ఉంటున్న తల్లి వద్దకు వెళ్లింది.

తిరిగి గురువారం ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడంతో ఆందోళనకు గురైంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడి ఉండటం, బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు భావించిపోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు, సీసీఎస్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు

- కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పారదర్శకంగా ఫలితాలు ప్రకటించేందుకు కఠినమైన మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ సందర్భంగా గోదావరిఖని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా కౌంటింగ్ కేంద్రాల లోపలి భాగం, బయటి ప్రాంగణం, వెలుపలి ప్రధాన రహదారుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో వెలుపలి రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, అనధికార వాహనాలు, వ్యక్తులకు అనుమతి లేకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా చేరకుండా ఉండాలని సూచించారు. ప్రజలు, రాజకీయ ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించిన వారికే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, లైటర్లు వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లలోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని, బాణాసంచా, డీజేలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు, ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీస్ భద్రతా సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

# మేయర్ పీఠం గులాబీ జెండాదే



- కార్పొరేషన్‌లో బిఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించబోతుంది
- కాంగ్రెస్ గుండాగిరికి రౌడీ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పబోతున్నారు
- కేసిఆర్ సంక్షేమ పాలనే పార్టీకి శ్రీ రామరక్ష
- కేసిఆర్ పాలన ప్రజలు కోరుకుంటున్నారు
- రామగుండం మాజీ ఎమ్మెల్యేకోరుకుంటి చందర్

**గోదావరిఖని, ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలందరూ బిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కు మద్దతుగా నిలిచారని, మెజార్టీ స్థానాలను బిఆర్ఎస్ పార్టీ సాధించి మూడవ సారి రామగుండం మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగరవేస్తమని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఎన్టీపీసీలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. రామగుండంలో గూండా పాలన, పోలీస్ పాలన సాగుతుందని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కపాడేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేశారన్నారు. రామగుండం నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల జరుగుతున్న కాంగ్రెస్ దుర్మార్గపు అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. బెదిరింపులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా నామినేషన్లు విత్ డ్రా చేయించని రామగుండం కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుడు మెక్కవోని ధైర్యంతో ఎన్నికల్లో కోట్లాడారన్నారు. ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలిచారన్నారు.

తొలి సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించడం జరిగిందన్నారు. సంక్షేమ సారధి కేసిఆర్ పాలన ప్రజలందరూ కోరుతున్నారన్నారు రాబోవు కాలంలో తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేఖరుల సమావేశంలో నాయకులు మూల విజయ రెడ్డి, మిర్యాల రాజి రెడ్డి, గోపు అయులయ్య, నడిపల్లి అభిషేక్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల విద్యుత్ ఉద్యోగుల నిరసన




- కేంద్ర ప్రభుత్వ అమెండ్మెంట్ బిల్లుకు నిరసనగా ధర్నా

**జగిత్యాల, ఫిబ్రవరి 12(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్ 2025, కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని జాతీయ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు టీజీపీఈ జాక్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా విద్యుత్ కార్యాలయం ఆవరణలో భోజనం విరామ సమయమున విద్యుత్ ఉద్యోగులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసనలో భాగంగా జేయేసి నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే నిలిపి వేయాలని, ప్రైవేటీకరణ తొ ఇప్పుడు ఉన్న ఉద్యోగులకు తీవ్రమయిన అన్యాయం జరగడమే కాకుండ నిరుద్యోగులకి ప్రభుత్వ కొలువులు రావని చెప్పారు, అలాగే రైతులకి, సామాన్య ప్రజలకి విద్యుత్ చార్జీలు ప్రతి సంవత్సరం ఏప్రిల్ లో పెరుగుతాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్ని సబ్సిడీలను క్రమ క్రమంగా ఎత్తి వేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 150 సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలని రద్దు చేసి కోరలు తీసిన 4 చట్టాలను అమలు చేసిందని దీనివల్ల కార్మికులకి తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. నూతన కార్మిక వ్యతిరేక చట్టాలద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, పనిభారం తీవ్రంగా పెరుగుతుందని మరియు కార్మికుల సమస్యల పట్ల సంఘాలు గళమెత్తే అవకాశం కోల్పోతామని చెప్పారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ మరియు కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసెంతవరకు వరకు మా నిరసనలు ఆగవని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమములో ఎస్.ఈ..సుదర్శనం, డి ఈ లు అంజయ్య, గంగారాం, మదసూదన్, గోపి కృష్ణ, ఎస్ ఏ ఓ శ్రీనివాస్, జేయేసి నాయకులు చేరాలు, ఆర్ముల్లా ప్రసాద్, రాంజీ, వరుణ్, జవహర్లాల్ నాయక్, సతీష్, ప్రవీణ్, ఆంజనేయులు, రహీమ్, అశోక్ రెడ్డి, భూమయ్య, అభీద్, అజీజా, పలు సంఘాల నాయకులు, విద్యుత్ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లతో కార్మిక హక్కుల హత్య

హైర్ అండ్ ఫైర్ తో శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించడమే

కార్మికుడి కడుపు ఆకలి..హక్కుల పోరాటంలో పాల్గొనని బీఎంఎస్ కార్మిక వ్యతిరేకే

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి కార్మికులంతా ఏకం కావాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యకులు ప్రకాష్ రావ్

సంగారెడ్డిలో సమ్మె సందర్భంగా భారీ బైక్ ర్యాలీ...సభ..



**సంగారెడ్డి, ఫిబ్రవరి 12 మనం ప్రతినిధిః** లేబర్ కోడ్లతో కార్మిక హక్కుల హత్య చేయబడతాయని, హైర్ అండ్ ఫైర్ తో శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించడమే తప్ప మరోటి కాదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. గురువారం నాడు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సంగారెడ్డిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చుక్కారాములు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి కార్మికులంతా ఏకం కావాలన్నారు. కార్మికుడి కడుపు ఆకలి..హక్కుల పోరాటంలో పాల్గొనని బీఎంఎస్ కార్మిక వ్యతిరేకే అన్నారు. ఇప్పటివరకు ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను మరింతగా దోచుకునే విధంగా లేబర్ కోడ్లు రూపొందించారని అన్నారు. లేబర్ కోడ్ల ద్వారా వేతనాల నిర్ణయంలో ఉన్న త్రైపాక్షిక విధానాన్ని రద్దు చేసి, 'ఒకే దేశం ఒకే వేతనం' పేరుతో రోజుకు రూ.178 కనీస వేతనం నిర్ణయించడం ద్వారా కార్మికుల ఆదాయం తగ్గే పరిస్థితి ఏర్పడిందని అలాగే పని గంటలను 8 నుంచి 12కు పెంచి, ఓవర్టైంకు అదనపు వేతనం చెల్లించకుండా చేస్తున్నారని ట్రేడ్ యూనియన్ నమోదు నిబంధనలను కఠినతరం చేసి, కార్మికుల సంఘటిత శక్తిని దెబ్బతీస్తున్నయని పరిశ్రమల లేఆఫ్, లాకౌట్, మూసివేతలకు సంబంధించిన నిబంధనలను సడలించి, యజమానులకు అనుకూలంగా మార్చారని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ వంటి హక్కులను కాంట్రాక్ట్ కార్మికుల నుంచి క్రమంగా తొలగించే విధంగా కోడ్లు రూపొందించారని అనేక రాష్ట్రాల్లో ఉన్న కార్మిక సంక్షేమ బోర్డులను రద్దు చేసి, కార్మికుల విద్య, వైద్యం, వివాహ, ప్రసూతి సహాయాలను నిలిపివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్లు ప్రకటించినప్పటికీ దొడ్డిదారిగా అమలు చేస్తున్నారని రైతుకు గిట్టుబాటు ధర లేకుండా ఎరువులు పురుగుమందులు విత్తనాలు దారుల పెంచి రైతులకు మోసం చేస్తుందని,ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడంతో గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా లేకుండా పోయిందని లేబర్ కోడ్ల ద్వారా తనిఖీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్మికులకు శిక్ష యజమానులకు రక్ష అనే విధానాన్ని అమలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. సామాన్య ప్రజలను విస్మరించి, కేవలం సంపన్నుల ప్రయోజనాల కోసమే కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. చట్టబద్ధంగా లభించాల్సిన సౌకర్యాలు అందనప్పుడు, శాంతియుత నిరసనలు మరియు సమ్మెలు కార్మికుల ఆయుధాలన్నారు. రేపు పొద్దున మన ఉద్యోగం ఉంటుందో లేదో తెలియని స్థితిలో కార్మికుడు నిరంతరం భయం భయంగా గడపాల్సి వస్తుందన్నారు. ఉద్యోగం పోతుందనో, వేతనం తగ్గుతుందనో భయపడితే యజమాన్యాలు మరింత అణిచివేస్తాయి. మరణానికైనా సిద్ధపడితే పోరాటం విజయవంతం అవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది...కార్మికులు సమ్మెలో ఉంటే ఇక్కడికి ఎందుకు రాలేదనీ ఆయన ప్రశ్నించారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ రావు మాట్లాడుతూ₹ ప్రజల కష్టార్జితమైన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం ధర దత్తం చేస్తుందని అన్నారు. కార్మికులందరూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేక చర్యలకు నిరసనగా కార్మికులందరూ పెద్ద సంఖ్యలో కదలడం చాలా సంతోషంగా ఉందని ఉన్నారు, కేంద్ర బిజెపి ప్రభుత్వం, విద్యుత్ సవరణ చట్టం 2025.విబి జీ - రామ్ చట్టం, విత్తన సవరణ బిల్లు. ఎల్ఐసి లో 100% విదేశీ పెట్టుబడుదారులను అనుమతించడం. ఇలాంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కోసం. కార్మికుల శ్రమను దోచుకోవడం కోసం, కేంద్ర బిజెపి ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాలను తీసుకొస్తుందని, ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమ్మెతో మోడీ ప్రభుత్వం కళ్ళు తెరవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బీరం మల్లేశం, యాదగిరి, బాగారెడ్డి, ప్రసన్నరావు, రామదాసు, వెంకటరెడ్డి, శివ, అశోక్, కృష్ణ, వివిధ పరిశ్రమ రంగాల నాయకులు, కార్మికులు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎంఏ. రెహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకటరాజ్యం, సెకండ్ ఏఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి శ్యామల, శివశంకర్,ర్.లక్ష్మి, వడ్డే అంజయ్య, బిహెచ్ఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి. ప్రవీణ్, బాలరాజ్, శంకరప,ఏఐటీయూసీ సీనియర్ నాయకులు లింగమయ్య, ఏఐటియుసి జిల్లా కోశాధికారి జి. ఆంజనేయులు, సంతోష్ గుప్త,సాయికుమార్, ఏఐటీయూసీ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయిన్ ప్రసాద్, పాడి పాల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సంజీవరెడ్డి, సయెద్ సమద్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఉదయం 08.00 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల, వేములవాడలోని సినారె కళామందిరంలో కౌంటింగ్ ఏర్పాట్లు



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి)ః** సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల సినారె కళామందిరంలో మాక్ కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం చేయగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. వేములవాడ సినారె కళామందిరంలో మాక్ కౌంటింగ్ ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో సినారె కళామందిరాల్లో కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచామని, ఇప్పటికే ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి ఏర్పాట్లు పరిశీలించామని వివరించారు. శుక్రవారం ఉదయం 08.00 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారని వివరించారు. ఒక్కో వార్డుకు ఒక టేబుల్ చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, మూడు టేబుల్ లకు కలిపి ఒక ఆర్ఓ, ఏఆర్ఓ ఉంటారని వెల్లడించారు. సిరిసిల్లలో మొత్తం 39 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 78 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. వేములవాడ లో మొత్తం 28 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 56 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు గెజిటెడ్ అధికారులను నియమించామని పేర్కొన్నారు. పరిశీలనలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు శ్రీనివాసాచారి, మీర్జా ఫసహత్ అలీ బేగ్, అన్వార్ తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన జలలింగార్చన మహోత్సవం

- జ్యోతిర్వసు విద్యాపీఠంలో ఆధ్యాత్మిక ప్రభంజనం
- లక్షలాదిగా తరలి రానున్న భక్తులు
- జ్యోతిర్వాస విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర్ శర్మ సిద్ధాంతి



**సంగారెడ్డి, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి)ః** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామంలో విద్యాపీఠం ఆధ్వర్యంలో చాలా లింగ ఆర్చన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జ్యోతిర్వాసు విద్యాపీఠం సిద్ధాంతి మహేశ్వర శర్మ తెలిపారు. గురువారం నాడు ఆశ్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. జ్యోతిర్వాస్ వృద్ధాపీఠంలో ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకమైన శివలింగాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితుగా వస్తుందని 2022లో వస్త్ర లింగం 2023లో సైకత లింగం 2024లో బాస్మలింగం 2025 లో రుద్రాక్ష లింగం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సంవత్సరం 1008 పవిత్ర నది తీర్థ జలాల ద్వారా నిర్మితమైన జల లింగం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు భారతదేశంలో 48 కిలోమీటర్లు ప్రయాణం చేసి 30 రాష్ట్రాల పవిత్రమైన నది తీర్థాల నుండి సముద్రాల నుండి సేకరించిన ఈ జలాలతో లింగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు ఈ నెల 15వ తేదీ శివరాత్రి సందర్భంగా ఉదయం 5 గంటల నుండి 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు భక్తులకు అభిషేకం చేసుకొని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం భక్తులు సుమారు మూడు లక్షల మంది దర్శించుకోనున్నట్టు తెలిపారు.

# ఓసిల మహా ధర్నాకు మద్దతివ్వండి



**జగిత్యాల ఫిబ్రవరి 12(మనం న్యూస్)ః** ఓసి ల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 23 న డిల్లీలో జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు . ఈ మేరకు డిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నాకు మద్దతు తెలపాలని గురువారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డిని ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు కోరుతూ జగిత్యాల లో ఆహ్వాన పత్రం అందజేశారు. ఈసందర్భంగా రామారావు మాట్లాడుతూ అగ్రవర్ణాల్లోని ఆర్థికంగావెనుక బడి ఉన్నవారు రిజర్వేషన్లు లేమి కారణంగా అటు సంక్షేమ పథకాలఫలాలు ఇటు రాజకీయ పదవులు పొందలేక పోతున్నారని అన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాలతో మున్సిపల్ వార్డు రిజర్వేషన్లలో ఓసి లకు తీవ్ర అన్యాయం జరిగి అవకాశాలు కోల్పోయారని మండిపడ్డారు. రాజ్యాంగ బద్దంగా ఏర్పడ్డ 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పై రాజకీయ పబ్బం కోసం కొందరు ఆయా కులాల్లోని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద ఓసి లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జనరల్ స్థానాల్లో సైతం ఓసి లు తట్టుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. హన్మకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీలో 16డివిజన్లు జనరల్ కేటగిరీకి రిజర్వు కాగా 12చోట్ల ఓసి లు పోటీ చేయలేక పోయారన్నారు. జనరల్ స్థానాల్లో కూడా ఓసి లకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వక పోవడం వల్ల రాజకీయంగానూ వెనుక బడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారికి చేయూతనిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పిస్తే వాటిపైనా దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేసేందుకు జాతీయ ఈడబ్ల్యూఎస్ కమిషన్ను ఏర్పాటు చేయాలని రామారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓసి జేఏసీ జగిత్యాల జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్న పాల్గొన్నారు.

# నేడే మున్సిపల్ ఫలితాలు

- ఉమ్మడి నిజామాబాద్‌లో పూర్తయినా ఏర్పాట్లు
- ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీస్ అధికారులు



**నిజామాబాద్, ఫిబ్రవరి 12 ( మనం బ్యూరో )ః** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిజామాబాద్ నగరానికి సంబంధించి పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా కామారెడ్డికి సంబంధించి పట్టణంలోని ఏఎంసీ గోదాంలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటైంది.

**నిజామాబాద్ జిల్లాలో....**

నిజామాబాద్ జిల్లాలోని నగరపాలక సంస్థతో పాటు ఆర్మూర్ భీమ్‌గల్, బోధన్ మున్సిపాలిటీల లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. నగరానికి సంబంధించి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఇందుకోసం 60టేబుళ్లను, 230 మంది సిబ్బందిని నియమించారు. అలాగే బోధన్ మున్సిపాలిటీకి సంబంధించి విజయ్ మేరీ పాఠశాలలో లెక్కింపు జరగనుంది. ఇందుకోసం 38 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఆర్మూర్‌లో 36 టేబుళ్లు, 130 మంది సిబ్బందిని నియమించారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏడు గదుల్లో 36 టేబుళ్లు ఏర్పాటు చేసి 150మందిని నియమించారు. భీమ్‌గల్ లో 12 టేబుళ్లు ఏర్పాటయ్యాయి. తొలి గంట లోనే మూడు మున్సిపాలిటీల ఫలితాలు తేలనున్నట్లు తెలుస్తోంది. నగరపాలక సంస్థ ఫలితాలు మాత్రం నాలుగు రౌండ్లలో తేలనున్నాయి.

హైదరాబాద్, ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు బైపాస్ కంఠేశ్వర్, బైపాస్ ఖాజా హోటల్, ఐడీఓసీ, ఖానాపూర్ కాలూర్ జంక్షన్ నుండి దుబ్బా చౌరస్తాకు చేరుకోవాలి. అక్కడి నుండి శివాజీ విగ్రహం, రైల్వే ఫ్లైఓవర్ గుండా బస్టాండ్ వైపునకు వెళ్లాలి. అలాగే బోధన్, బాన్సువాడ వైపు నుండి వచ్చే వాహనాల రాకపోకల్లో ఎలాంటి మార్పులు లేవు.

**కామారెడ్డి జిల్లాలో....**

కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించి ఎస్పీ కార్యాలయ సమీపంలో ఉన్న ఏఎంసీ గోదాంలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఎన్నికలు ముగియగానే బ్యాలెట్ బాక్సులను పోలీసుల భద్రత మధ్య కౌంటింగ్ కేంద్రానికి తరలించిన అధికారులు కౌంటింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలో 32 టేబుళ్లు ఏర్పాటు చేసిన అధికారులు ఒక్కో టేబుల్‌కు ఒక ఆర్వో, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సిబ్బందితో పాటు మరొకరిని అదనంగా ఏర్పాటు చేశారు. అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మధ్యాహ్నం వరకు తొలి రౌండ్ ఫలితం వచ్చే అవకాశం ఉంది. సాయంత్రం 4 గంటలలోపు లెక్కింపు పూర్తిచేసి ఫలితాలు వెల్లడించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు గోదాం వద్ద పోలీసుల భారీ బందోబస్తు కొనసాగుతోంది.

**ట్రాఫిక్ ఆంక్షలు....**

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ మేరకు ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వేగేటు నుంచి అడ్లూర్ వెళ్లే దారిలో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మూలమలుపు నుంచి కలెక్టర్ కార్యాలయానికి వచ్చే వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

అలాగే రామారెడ్డి రోడ్డు గుమస్తా కాలనీ నుంచి ఎస్పీ కార్యాలయం వైపు వచ్చే రహదారిలో వాహనాల రాకపోకలకు నిలిపివేసామన్నారు. కామారెడ్డి పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ వెళ్లే దారి, కామారెడ్డి నుంచి గర్గుల్, రామారెడ్డి వెళ్లే రహదారిపై రాకపోకలు ఎప్పటిలాగే కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ మళ్లించిన ప్రాంతాల నుంచి వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు.

# ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్నికల నిబంధనలకులో బడే ఓట్ల లెక్కింపు...
- మూడు రౌండ్లలో పూర్తిస్థాయి టీవి ఫలితాలు ఒక్కో రౌండ్లో 8 వార్డుల లెక్కింపు
- అత్యంత పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12 (మనం బ్యూరో)ః** నాగర్ కర్నూల్ జిల్లాలో నిర్వహించనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నాగర్కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ నైస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని, వార్డు వారీగా ఓట్ల లెక్కింపు క్రమబద్ధంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 6 గంటలకల్లా సిబ్బంది తమ తమ కౌంటింగ్ కేంద్రాలకు హాజరు కావాలని ఆదేశించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభించి, అనంతరం పోలింగ్ కేంద్రాలు, వార్డుల వారీగా బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరవాలని తెలిపారు. ప్రతి 25 ఓట్లను ఒక కట్టగా తయారు చేసి, లెక్కించాలన్నారు. చెల్లిన ఓట్లను మాత్రమే సంబంధిత అభ్యర్థి గుర్తు ఉన్న బాక్సుల్లో వేయాలని సూచించారు. చెల్లని ఓట్లను గుర్తించి ప్రకటించే పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికల నిబంధనలకు లోబడి, పారదర్శకంగా సాగాలని ఆదేశించారు. నాగర్కర్నూల్ మున్సిపాలిటీలో 8 టేబుళ్లు ఏర్పాటు చేసి, ప్రతి టేబుల్కు ముగ్గురు చొప్పున మొత్తం 24 మంది కౌంటింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. ఒక్కో రౌండ్లో 8 వార్డుల చొప్పున లెక్కింపు జరిపి, మొత్తం 3 రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. కల్వకుర్తిలో 8 టేబుళ్లు ఏర్పాటు చేసి 24 మంది అధికారులు, కొల్లాపూర్లో 7 టేబుళ్లు ఏర్పాటు చేసి 21 మంది అధికారులు కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు మొత్తం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, మూడంచెల భద్రత కల్పించడం, స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. స్ట్రాంగ్ రూములను కూడా తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను సమీక్షించినట్లు చెప్పారు. అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు తలెత్తిన పక్షంలో వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఓట్ల లెక్కింపును ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, నాగర్కర్నూల్ ఆర్డీవో సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల 15వ తేది నుండి మహాశివరాత్రి జాతర ఉత్సవాలు



- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి
- జాతర ఏర్పట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

**చేవెళ్ల, ఫిబ్రవరి 13 (మనం న్యూస్)ః** మండలంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో మహా శివరాత్రి జాతర ఉత్సవాలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం సందర్శించి పరిశీలించారు.జాతర ఏర్పాట్లపై పూజారులు వామానచారి, గ్రామ పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, స్నానాలు గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర సాఫీగా జరిగేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు,మాజీ సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి, సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, గుత్తి మల్లేష్, సాయి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి అదనపు యూరియా

**కొత్తగూడెం ఎయిర్ పోర్టు పై కేంద్రానికి నివేదికలు ఇవ్వనున్న ప్రభుత్వం**

**ఢిల్లీలో ఉన్న సీఎం పేషి అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడిన మంత్రి తుమ్మల**



దమ్మపేట, ఫిబ్రవరి 12 (మనం న్యూస్): ఈ సీజన్లో వరి, మొక్కజొన్నసాగు అధికంగా ఉన్న పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన యురియా తో పాటు అదనంగా 2 లక్షల 50 మెట్రిక్ టన్నుల యూరియాను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. దమ్మపేట మండలం, గండుగులపల్లి, గ్రామంలో గురువారం ఉదయం మంత్రి ఢిల్లీలో ఉన్నసీఎం పేషి అధికారులతో చరవాణి తో మాట్లాడారు. కొత్తగూడెం,లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి అనుమతులు విషయంపై కేంద్ర విమాన యన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడు కలిసి వినతి పత్రం అందజేయాలని సూచించారు. కొత్తగూడెం జిల్లాలో అనువైన ప్రదేశం ఉందని, ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నదృష్ట్యా పేషీ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. వ్యవసాయ శాఖలో ఉన్నపలు పెండింగ్ సమస్యలను కేంద్రం పరిష్కారం అయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఆదేశించారు.

# కార్మిక శక్తిని తాకట్టు పెట్టేందుకే లేబర్ కోడ్స్

## మోడీ పాలనలో హక్కుల హననం

### కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతల హెచ్చరిక





ఖమ్మం, ఫిబ్రవరి 12(మనం బ్యూరో): దేశంలోని కార్మిక శక్తిని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ను అమల్లోకి తీసుకు వచ్చిందని అఖిలపక్ష, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లతో పాటు విద్యుత్, విత్తన సవరణ బిల్లులు, విబిజీ రాంజీ చట్టం కూడా దేశ ప్రజల పాలిట శాపంగా మారాయని వాటిని తక్షణం రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ఖమ్మంలోని పెవిలియన్ మైదానం నుంచి జెడ్పి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు, బ్యాంకు ఉద్యోగ సంఘాలు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘాలు సంపూర్ణ మద్దతునిచ్చాయి. పెవిలియన్ మైదానంలో వివిధ కార్మిక సంఘాల అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, నరాల నరేష్ నాయుడు, కళ్యాణం వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, వెంకన్న, ఎండివై పాషా అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు ఎస్ కె ఖాసీం, గుండాల కృష్ణ తదితరులు ప్రసంగించారు. బ్రిటిష్ పాలన కాలంలో సైతం కార్మికులు పోరాడి కార్మిక చట్టాలను, హక్కులను సాధించుకున్నారని దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం రద్దు చేస్తుందని ఆరోపించారు. 50 కోట్ల కార్మిక హక్కులను ఒక శాతం జనాభా కలిగిన కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చారని ఆయన తెలిపారు. ఏ ప్రభుత్వం ఇంత వరకు కార్మికులకు అనుకూల చట్టాలు చేయలేదన్నారు. పోరాట ఫలితంగానే పాలకులు చట్టాలు తీసుకు వచ్చారని వారు తెలిపారు. ఇప్పటికే ప్రైవేటీకరణ వేగం పెంచిన మోడీ ప్రభుత్వం యావత్ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలోనే 29 కార్మిక చట్టాలను మార్చారన్నారు.
మోడీ తీసుకు వచ్చిన చట్టాలలో సంక్షేమం, హక్కులు లేకపోగా ఆ చట్టాలకు సంక్షేమ చట్టాలని పేరుపెట్టడం నేతి బీరకాయలో నేతి చందమేనన్నారు. తక్షణమే లేబర్ కోడ్లను రద్దు చేసి పాత చట్టాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెకు వచ్చిన స్పందన చూసిన తర్వాతనైనా తమ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం మార్చుకోవాలన్నారు. లేని పక్షంలో తగిన ఫలితాన్ని అనుభవించక తప్పదని వారు హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో వివిధ సంఘాల నేతలు కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, బిజి క్లైమెంట్, వై.విక్రమ్, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మోహన్‌రావు, -పిల్లి రమేష్, జాకీరుద్దీన్, పోటు కళావతి, విష్ణువర్ధన్, భూక్యా శ్రీను, సంగయ్య, పాల్వంచ కృష్ణ, రాజేష్, రవి, సైదా, మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడడం ప్రతి పౌరుని బాధ్యత

- **ప్రజా గాయకుడు డాక్టర్ జయరాజ్**
- **యస్.బి.ఐ.టి. కళాశాలలో ప్రకృతి వైజ్ఞానిక అవగాహనా సదస్సు**



ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12(మనం న్యూస్): ప్రకృతిని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రజాగాయకుడు, కవి, పాటల రచయిత కాళోజీ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ జయరాజ్ అభిప్రాయపడ్డారు. ఖమ్మంలోని యస్.బి.ఐ.టి. కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రకృతి వైజ్ఞానిక అవగాహనా సదస్సు లో జయరాజ్ అతిథి గా హాజరై మాట్లాడారు .ప్లాస్టిక్ వస్తువుల వాడకం ప్రకృతిని హరిస్తుందని తెలిపారు. ఇప్పటికే ఎన్నో జీవరాసులు కాలగర్భంలో కలిసిపోవడానికి ప్లాస్టిక్, హానికారక రసాయనాలతో తయారు చేసిన వస్తువులే కారణమని తెలుపుతూ ప్లాస్టిక్ నివారణకు సదస్సులోని విద్యార్థులతో ప్రతిజ్ఞను చేయించారు. ప్రకృతి పట్ల పౌరులు సామాజిక స్పృహను కలిగి తమవంతు బాధ్యతగా నిబద్ధతను కలిగి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ పరికరాల ద్వారా రేడియోషన్, కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వంటివి ప్రకృతిని, ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయని, ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చినప్పటికి ప్రజలు వారి జీవన శైలిని మార్చుకోనిదే ప్రకృతిని కాపాడలేమని అభిప్రాయపడ్డారు. విజ్ఞాన దర్శిని జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ ఒకవైపు గ్రీన్ రెవల్యూషన్ లో భాగంగా బ్యాటరీ వాహనాలను వినియోగిస్తున్నప్పటికీ కృత్రిమ మేధ వల్ల ప్రకృతిలోని వనరులను నష్టపరుస్తున్నామని తెలిపారు. మానవ తప్పిదాలు, వారి వ్యక్తిగత అలవాట్లు కూడా ప్రకృతిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సామాజిక భాధ్యత కలిగి ఉండాలని కోరారు. అనంతరం ప్రజాగాయకుడు పాగి వెంకన్న నిర్వహించిన ఆటాపాట అలరించి ఆలోచింపజేసాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, డి. నాగరాజు, ప్రకృతి ప్రేమికులు, ఎస్‌ఎఫ్ఐ, పిడిఎస్‌యుతో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు

- **పకడ్బందీగా 163 బిఎన్ఎస్ఎస్ అమలు**
- **ఎలాంటి సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు**
- **ఎస్పీ రోహిత్ రాజు**



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (మనంప్రతినిధి): మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. డీజేల వినియోగం, బాణాసంచా కాల్చడం వంటివి కూడా నిషేధమని తెలియయజేశారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత ఉంటుందని అన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిసర ప్రాంతాలను డాగ్ స్క్వాడ్,బాంబుస్క్వాడ్స్ తో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో పకడ్బందీగా 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని అన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు లెక్కింపునకు హాజరయ్యే అధికారులు నిషేధిత వస్తువుల అయిన అగ్గిపెట్టెలు, లైటర్, ఇంక్ బాటిల్స్, పేలుడుకు కారణమయ్యే ఎలాంటి వస్తువులను లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకురాకూడదని తెలిపారు. తనిఖీలు చేసే పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎన్నికల అధికారులు జారీ చేయబడిన గుర్తింపు కార్డులు ఉన్న వారికి మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.



## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు శ్రమించిన వారికి ధన్యవాదాలు

- **కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

ఖమ్మం, ఫిబ్రవరి 12(మనం న్యూస్): జిల్లా లోని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు, కార్యకర్తలకు, అభిమానులకు, కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించిన అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాల్టీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయఢంకా మోగించేందుకు జిల్లాలో తిష్టవేసి ప్రత్యేక కార్యాచరణ చేసి నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి లకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఎంట్రెన్స్, ఎగ్జిట్**

**కౌంటింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్**



ఖమ్మం, ఫిబ్రవరి 12(మనం బ్యూరో): నిబంధనల ప్రకారం మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టర్, మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పై గురువారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5 మున్సిపాలిటీల ఎన్నికల కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో మెష్ ఏర్పాట్లతో, కౌంటింగ్ విధుల అధికారులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఎంట్రెన్స్, ఎగ్జిట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పటిష్ట పోలీస్ బందోబస్తుతో, అన్ని కౌంటింగ్ కేంద్రాలలో 100 శాతం వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నట్లు, ప్రతి కౌంటింగ్ కేంద్రంలో రూట్ మ్యాప్ బోర్డులు ఏర్పాట్లు చేసినట్లు అన్నారు. కౌంటింగ్ హాల్స్ లో కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, వీరందరికి సంబంధిత పాసులు జారీ చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ తో కౌంటింగ్ ప్రారంభ మవుతుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో పూర్తి నిబంధనలు పాటించాలని అన్నారు.
కౌంటింగ్ తర్వాత రిజెక్ట్ ఐనా బ్యాలెట్ పత్రాలతో సహా మొత్తం ఎన్నికల సామాగ్రి సీజ్ చేసి స్ట్రాంగ్ రూమ్ కు తరలించాలని కలెక్టర్ తెలిపారు. ఏదులాపురం లోని 31 వార్డులు, మధిరలోని 22 వార్డులకు, సత్తుపల్లి లోని 23 వార్డులకు, వైరా, కల్లూరు లోని 20 వార్డులకు రెండు రౌండ్ లలో కౌంటింగ్ పూర్తయ్యేలా టేబుల్స్ వేసి కౌంటింగ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.ఎన్నికల కౌంటింగ్ సంబంధించి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్స్ తరలించే ప్రక్రియ గురించి ముందుగానే రాజకీయ పార్టీలకు సమాచారం అందించి, మొత్తం ప్రక్రియ వీడియోగ్రఫీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ విధుల అధికారులు విధుల్లో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వవద్దని, అప్రమత్తంగా ఉంటూ, తమ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు. మునిసిపల్ కమిషనర్లు అప్రమత్తంగా ఉంటూ, ప్రక్రియను పర్యవేక్షణ చేయాలని, అధికారులు, కౌంటింగ్ సిబ్బందిని గైడ్ చేస్తూ, ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లుదా. పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## రహస్య టెలికాన్ఫరెన్స్ కలకలం

- **మంత్రి, ఉద్యోగ సంఘాల నేతలపై బీజేపీ ఫిర్యాదు**
- **ఆడియో సాక్ష్యాలతో కలెక్టర్ను కలిసి వినతి**
- **సస్పెన్షన్, క్రిమినల్ కేసుల డిమాండ్**



ఖమ్మం, ఫిబ్రవరి 12(మనం బ్యూరో): లీకైన ఆడియో వ్యవహారం జిల్లాలో రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుతో కలిసి జిల్లా కలెక్టర్ను కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఆడియో సాక్ష్యాలను అధికారులకు సమర్పించి తక్షణ విచారణ చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవకీ వాసుదేవరావు మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగ సంఘాల నేతలతో రహస్యంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల నిర్వహణపై చర్చించడం అత్యంత ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులు రాజకీయ పార్టీ ప్రయోజనాల కోసం పనిచేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పని వ్యాఖ్యానించారు. లీకైన ఆడియోలో ఉద్యోగ సంఘాల నేతలు '100% పోలింగ్ వేయిస్తాం, బంగారు పళ్లెంలో పెట్టి గెలిపిస్తాం' వంటి వ్యాఖ్యలు చేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బహిరంగంగా ధిక్కరించినట్లేనని ఆయన అన్నారు. వార్డుల వారీగా ఉద్యోగుల వివరాలను చదివి వినిపించడం ద్వారా ప్రభుత్వ సమాచారాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించిన అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన, ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం మరియు ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఉద్యోగ సంఘాల నేతలను సర్వీసు నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంగల సత్యనారాయణ, నున్నా రవి, గుత్తా వెంకటేశ్వరరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, వీరెల్లి రాజేష్, రవి రాథోడ్, అల్లిక అంజయ్య, దొడ్డ అరుణ, రవి గౌడ్, కొణతం లక్ష్మీనారాయణ, బోయినపల్లి సురేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్వాన్స్‌డ్ టిఏవిఐ పక్రియతో వైద్యం

- **రోగి ప్రాణాలు నిలబెట్టిన యశోద హాస్పిటల్ బృందం**




ఖమ్మం, ఫిబ్రవరి 12(మనం న్యూస్): అడ్వాన్స్‌డ్ టిఏవిఐ పక్రియతో వైద్యం చేసి ఓ హృద్రోగి ప్రాణాలను హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు కాపాడారు. ఖమ్మం యశోద హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ డాక్టర్.జగదీష్ మాదిరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు చెందిన వాసుదేవమూర్తికి 78 సంవత్సరాలు. పేషంట్ వాసుదేవమూర్తి కి గుండెవాల్వ్ కుంచించుకుని పొయ్యి అకస్మాత్తుగా శ్వాస తీసుకోవడంలో తీవ్రంగా ఇబ్బందిపడుతూ, అత్యవసర స్థితిలో సోమాజిగూడ యశోద హాస్పిటల్‌కు తీసుకురాబడ్డారు. అతని పరిస్థితి వేగంగా విషమిస్తుండడంతో ఆయనకు వెంటనే వెంటిలేటర్ సపోర్ట్ అందించాల్సి వచ్చి ఉంది. ఎకోకార్డియోగ్రఫ సీటీ అయోర్టోగ్రఫ పరీక్షలు నిర్వహించగా గుండెలోని అయోర్టిక్ వాల్వ్ తీవంగా ఇరుకైనట్లు నిర్ధారణ అయ్యి ఉంది. సకాలంలో చికిత్స అందకపోతే ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్న అత్యంత క్లిష్టమైన పరిస్థితి అతనిది. వెంటనే అత్యంత క్లిష్టమైన ట్రాన్స్ కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టిఏవిఐ) పక్రియను నిర్వహించి విజయవంతంగా రోగిని ప్రాణాపాయం నుండి కాపాడినట్లు డాక్టర్ జగదీష్ తెలిపారు. పేషంట్ వయస్సు, అప్పటికే ఉన్న తీవమ్ర వైన అనారోగ్య పరిస్థితులు, ఓపెన్-హార్ట్ సర్జరీవల్ల కలిగే అధిక ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకున్న కార్డియాలజీ బృందం కోత లేకుండా అత్యాధునిక టిఏవిఐ పక్రియిను తక్షణమే నిర్వహించాలని నిర్ణయించి జనవరి 2026లో కుడిఫెమోరల్ ఆర్టరీ ద్వారా 26 ఎంఎం మెడ్ట్రానిక్ ఎవోలట్ పిఆర్ఓ+ వాల్వ్ ను ఉపయోగించి ఈ పక్రియి ను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. సర్జరీ తర్వాత పేషెంట్ ఆరోగ్యం వేగంగా మెరుగుపడిందని, ఆయనను వెంటిలేటర్ సపోర్ట్ నుండి తొలగించగా శ్వాస తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా స్థిరమైన, ఆరోగ్యకరమైన స్థితిలో డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్ ఉన్న వృద్ధులకు, ఓపెన్ - హార్ట్ సర్జరీ చేయలేని హై-రిస్క్ రోగులకు టిఏవిఐ ఒక వరం లాంటిదని తెలిపారు. ఈ పేషేంట్ ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చారు సకాలంలో స్పందించడం వల్ల ఆయన ప్రాణాలు కాపాడగలిగాం. టిఏవిఐ అనేది అత్యంత సంక్లిష్టమైన పక్రియ. దీనికి ఖచ్చితమైన ప్రణాళిక, నైపుణ్యం అవసరం. తెలుగు రాష్ట్రాల్లో సొంతంగా టిఏవిఐ నిర్వహించడానికి సర్టిఫికేషన్ పొందిన అతికొద్ది మంది కార్డియాలజిస్టులలో ఒకరిగా చికిత్సకు చాలా తక్కువ అవకాశాలు ఉన్న పేషేంట్లకు ఇటువంటి అత్యాధునిక చికిత్సను అందించడం నాకు ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఖమ్మం వంటి జిల్లాల్లోని రోగులకు కూడా అంతర్జాతీయ స్థాయి చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడానికి తాము ఉన్నట్లు తెలిపారు. యశోద హాస్పిటల్స్ అధునాతన స్ట్రక్చరల్ హార్ట్ ఇంటర్వెన్షన్స్ లో అగ్రగామిగా ఉంటూ నిపుణులైన వైద్యులు, అత్యా ధునిక సాంకేతికతతో పప్రంచ స్థాయి గుండె సంరక్షణను అందిస్తోందన్నారు. యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్దాలుగా వైవిధ్యమైన వైద్య అవసరాలలో హార్ట్ ఇంటర్వెన్షన్స్ లో అగ్రగామిగా ఉంటూ నిపుణులైన వైద్యులు, అత్యా ధునిక సాంకేతికతతో పప్రంచ స్థాయి గుండెసంరక్షణను అందిస్తోందన్నారు. సమర్థవంతమైన నాయకత్వం, బలమైన యాజమాన్యం కింద యశోద గ్రూప్ అత్యున్నత పమ్రణాలతో కూడిన వైద్య చికిత్సను అందించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎదిగిందన్నారు. పేషెంట్ల అవసరాలకు అనుగుణంగా అరుదైన, క్లిష్టమైన పక్రియిల కోసం సైతం విప్లవాత్మక సాంకేతికతను ఉపయోగిస్తూ యశోద గ్రూప్ ప్రతి వైద్య విభాగంలోనూ అత్యాధునిక రోగనిర్ధారణ, చికిత్సా సేవలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ విభాగం డాక్టర్ వినీత్, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సత్యా రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కూనంనేని



చుంచుపల్లి, ఫిబ్రవరి 12(మనం న్యూస్) : దేశవ్యాప్త జరుగుతున్న సార్వత్రిక సమ్మెను చుంచు పల్లి మండలం సిపిఐ పార్టీ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ యూనియన్, ఆశ వర్కర్స్, అంగనవాడి, పంచాయతీ కార్మికుల ధర్నా నిర్వహించారు. సమ్మె లో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర. కార్యదర్శి కూనం నేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 చట్టాలుగా రూపొందించి కార్మికుల పొట్ట కొడుతుందని తెలిపారు. నేడు దేశ వ్యాప్త సమ్మె లో ఎప్పుడు లేని విధంగా సింగరేణి బొగ్గు బావుల కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొన్నారని, ఆశ వర్కర్లు, అంగనవాడి లు, పంచాయతీ కార్మికులు పాల్గొంటున్నారని తెలిపారు. మోడీ కి ఒక్కడే దేవుడు కాదు, శ్రీ రాముడు అందరికీ దేవుడని ఎద్దేవా చేసారు. కార్మిక, ప్రజా, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ యూనియన్, ఆశ వర్కర్లు, అంగనవాడి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన సౌకర్యాలు



- ప్రభుత్వం తరపున శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిలకు పట్టు వస్త్రాల సమర్పణ
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**శ్రీశైలం / నంద్యాల జిల్లా, ఫిబ్రవరి 12: మనం న్యూస్:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో గురువారం సాయంత్రం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రం దేశవ్యాప్తంగా విశిష్ట స్థానం కలిగిన శైవక్షేత్రమని, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాల సమర్పణ చేయడం ఆనందంగా ఉందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, దేవస్థానం సమన్వయంతో చర్యలు కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ మంత్రికి వివరించారు. ఆలయ ఏర్పాట్లు, భక్తులకు అందిస్తున్న సదుపాయాలపై మంత్రికి వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో అన్నదానం ప్రారంభించిన సత్రం కమిటీ



**గడివేముల, ఫిబ్రవరి 12(మనంన్యూస్):** మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలంలోని శ్రీశ్రీశ్రీ అఖిలభారత కురువంశ నిత్యాన్న దాన సత్రం కమిటీ నిర్వాహకులు అధ్యక్షులు ఎంకే రంగస్వామి, ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పర్ల శ్రీనివాసులు, సభ్యులు కేసి నాగన్న, కె నాగేశులు, జి శివన్న, వెంకటేశ్వర్లు, లు గురువారం నాడు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఐదు రోజులు నిర్వహించే ఈ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని పర్ల గ్రామానికి చెందిన మల్లికార్జున, నాగన్న, రాముడు ,బృందం వారు అన్నదానం కోసం ఎంతో సహకరించాలని వారు తెలిపారు. అలాగే మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామానికి చెందిన కే. దేవరెడ్డి ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరించాలని వారు తెలిపారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తాదులకు శ్రీశ్రీశ్రీ అఖిలభారత కురువంశ నిత్యాన్నదాన సత్రంలో నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్రం కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎంకే రంగస్వామి, ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పర్ల శ్రీనివాసులు, సభ్యులు కేసి నాగన్న ,కె నాగేశులు, జి శివన్న ,వెంకటేశ్వర్ల, తో పాటు కురువ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు, సత్రం సభ్యులు తిమ్మయ్య, హరికృష్ణ, సుబ్బయ్య,మరియు కురువ కుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న వై. సీతారామిరెడ్డి



**మంత్రాలయం , ఫిబ్రవరి 12,మనం న్యూస్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు , టీటీడి మాజీ సభ్యులు వై. సీతారామిరెడ్డి గురువారం వచ్చారు. వారి గ్రామ సర్పంచ్ భీమయ్య స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , పూజలు చేసిమంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూలబృందావనన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈయనతో పాటు రిటైర్డ్ తహసీల్దార్ వర్మ తదితరులు ఉన్నారు.

# పాతాళగంగ స్నాన ఘట్టాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ పరిశీలన



**శ్రీశైలం / నంద్యాల జిల్లా, ఫిబ్రవరి 12మనం న్యూస్:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాలను గురువారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. స్నాన ఘట్టాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరుగుతోందా లేదా, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉన్నాయా, రన్నింగ్ వాటర్ అందుబాటులో ఉందా అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. దుస్తులు మార్చుకునే గదులు శుభ్రంగా ఉంచుతున్నారా ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నియమించిన గజ ఈతగాళ్లు (లైఫ్ గార్డులు) ఎంతమంది ఉన్నారు, వారు విధుల్లో నిరంతరం అందుబాటులో ఉన్నారా అనే విషయంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం అవసరమైన భద్రతా ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని



ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణంలో సురక్షితంగా స్నానాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం విధుల్లో ఉండి పరిశుభ్రతను కాపాడాలని, తాగునీటి సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా సమన్వయంతో పనిచేసి, అన్ని మౌలిక సదుపాయాలను పర్యవేక్షిస్తూ ఉండాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.




# నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయండి

**గూడూరు, ఫిబ్రవరి 12(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నూతన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా మండల కేంద్రమైన గూడూరు పట్టణంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులతో కలసి భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ లో సిఐటియు మండల అధ్యక్షుడు గుంటప్ప అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు దివాకర్, డివిజన్ కార్యదర్శి జే మోహన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ కార్పొరేట్ల ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చిందని ఆరోపించారు. బ్రిటిష్ ప్రభుత్వంలో కార్మికులు ప్రాణ త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నారని వీటితోనే కార్మికుల స్వేచ్ఛగా బతుకుతున్నారని అన్నారు. కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# 8గంటల పని విధానాన్నే అమలు చేయాలి




- స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**బేతంచేర్ల ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** భారతదేశ వ్యాప్తంగా కార్మిక రంగ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్న ఏఐటియుసి మండల కార్యదర్శి తాలూకా తిరుమలేష్ ఏఐటీయూసీ జిల్లా నాయకులు సూర్యచంద్ర మహాలక్ష్మి సీపీఐ పట్టణ కార్యదర్శి పి.నాగరాజు ల ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయం నుండి ఎస్బిఐ బ్యాంక్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక హక్కులకు ప్రమాదంగా మారిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని నూతన జి.రామ్.జి పథకాన్ని రద్దుచేసి పాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని అంగన్వాడి ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని వారి డిమాండ్లను పరిష్కరించాలని 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు బ్యాంకులు బిఎస్ఎన్ఎల్ స్టీల్ రైల్వే, పోస్టల్ సంస్థలను కాపాడాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా బేతంచెర్ల రంగాపురం లోని అన్ని బ్యాంకులను ప్రైవేట్ ఫైనాన్స్ ఆఫీసులను మూసివేసి సార్వత్రిక సమ్మెను నిర్వహించడం జరిగిందన్నారు ఈ సమ్మెలో ఏఐటీయూసీ సీపీఐ ప్రజాసంఘాల నాయకులు మహిళా సమాఖ్య నాయకులు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు విద్యార్థి యువజన సంఘాల నాయకులు ఎర్రగుడి రాముడు ఉదయ్ కోన రామకృష్ణ నాగేశ్వరరావు సోమన్న శ్రీరాములు నాగేష్ తిమ్మయ్య పుష్పవతి రామాంజనమ్మ, రమాదేవి, నాగేంద్రమ్మ మధు ఎల్లకృష్ణ రవి ఖదీర్ దేవరాజు పెంచలయ్య సుబ్బరాయుడు రాముడు శ్రీమన్నారాయణ మరియు కార్మికులు కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# తెర్నేకల్లో పారిశుద్ధ్య పనులకు ఊపిరి

**దేవనకొండ, ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** డిప్యూటీ ఎంపీడీవో రాముడు యాదవ్ ఆదేశాల మేరకు తెర్నేకల్ గ్రామంలో పారిశుద్ధ్య పనులకు వేగం వచ్చింది. గ్రామ సర్పంచ్ ఎం. అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో డ్రైనేజీ కాలువల శుభ్రపరిచే కార్యక్రమాలు, మురుగు నీటి నిల్వలు తొలగింపు, ప్రధాన వీధుల్లో మురికివాడల శుద్ధి పనులు చేపట్టారు. వర్షాకాలం ముందు డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా ఉంచడం ద్వారా దోమల బెడద, అంటువ్యాధుల ముప్పును తగ్గించవచ్చని అధికారులు సూచించారు.

అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ సెక్రటరీ ఎస్. అబ్దుల్లా ఆధ్వర్యంలో ఇంటి పన్నుల వసూళ్లు, రికార్డుల నవీకరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ సేవలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా అందాలంటే పన్నుల వసూళ్లు కీలకమని అధికారులు స్పష్టం చేశారు. పన్నులు సకాలంలో చెల్లించడం ద్వారా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు సమకూరుతాయని వివరించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ వాలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు చురుకుగా పాల్గొన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో శుభ్రత పాటిస్తూ అధికారులకు సహకరించాలని



సర్పంచ్ అరుణ్ కుమార్ కోరారు. గ్రామాల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

# దాతృత్వం చాటుకున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్

- 'కామార్తి నాగరాజు కుటుంబ సభ్యులకు 1లక్ష 12, 750 అందించిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్



**కర్నూలు, ఫిబ్రవరి 12(మనం న్యూస్ ):** పెద్దకడబురు మండలం హనామాపురం గ్రామానికి చెందిన గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న కామార్తి నాగరాజు అనారోగ్యంతో చనిపోయారు.స్పందించిన తోటి ఉద్యోగులంతా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1లక్ష 12, 750 వారి కుటుంబ సభ్యులకు గురువారం అందించారు.ఈ సందర్భంగా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కామార్తి నాగరాజు సేవలు అభినందనీయమన్నారు.జిల్లా లో వెల్ఫేర్ అసిస్టెంట్లకు అన్నివేళలా అండగా ఉంటామని,ఏదైనా సమస్యలు వచ్చిన వెంటనే యూనియన్ దృష్టికి తీసుకురావాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పులి శేఖర్,వైస్ ప్రెసిడెంట్ హనుమేష్, జనరల్ సెక్రెటరీ నీలకంఠశ్వర సింగ్, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, పరమేష్,వీరేష్,రవి,లింగన్న తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

**మంత్రాలయం, ఫిబ్రవరి 12 మనం న్యూస్:** మంత్రాలయంలోని వార్డు సభ్యులు రామాంజనేయులుకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి రామాంజనేయులు తండ్రి కర్రెప్ప మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. అనంతరం రూ 15 వేలు తక్షణ సహాయం కింద నగదు ను అందజేశారు. వీరితో పాటు వైస్సార్సీపీ మండలాధ్యక్షులు జి. భీమారెడ్డి, వైఎస్సార్సీపీ మండల ఇన్ చార్జ్ సి. వి. విశ్వనాథ్ రెడ్డి , బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, మంత్రాలయం లీడర్స్ తదితరులు ఉన్నారు.

# చదువుల తల్లి ముద్దుబిడ్డల భవిష్యత్తుకు కూటమి భరోసా



- విద్యార్థులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేష్
- ఫీజు రీమంబర్స్మెంట్ బకాయిలు రూ.1200 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.
- సమావేశం లో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

**తుగ్గలి, ఫిబ్రవరి 12(మనం న్యూస్ ):** విద్యార్థుల భవిష్యత్తు కూటమితోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు,టీడీపీ మండల ఉపాధ్యక్షులు వెంకటరాముడు చౌదరి లు అన్నారు. గురువారం తుగ్గలిలో విలేకరులతో మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన విద్యార్థుల సర్టిఫికేట్లు, ఫీజుల సమస్యలకు చెక్ పడిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో 2024-25 విద్యా సంవత్సరానికి గాను రూ.1,200 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని వారు పేర్కొన్నారు .విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా చదువుకోవాలని,మీ కలల సాకారానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది వారు సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మచ్చా మద్దిలేటి, సంఘాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**కర్నూలు, ఫిబ్రవరి 12మనం న్యూస్:** నంద్యాల జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు జరుగుచున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తుల సౌకర్యాలను మరియు బందోబస్తు ఏర్పాట్ల గురించి తెలుసుకునేందుకు శ్రీశైల క్షేత్రం నందు లడ్డు కౌంటర్, శివాజీ గోపురం, అమ్మవారి దేవాలయం, గుడి లోపలి ప్రదేశంలోనే వివిధ ప్రాంతాలు, నాగుల కట్ట, చంద్రావతి కళ్యాణ మండపం, వీఐపీ ఎంట్రన్స్, హరిహరరాయ గోపురం,మొదలగు ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# సేవాగఢ్‌లో నా పుస్తకం గోర్ (బంజారా) లిపిపుస్తకం ఆవిష్కరణ

- 'డా. ఎన్. రాజేంద్ర నాయక్



**తుగ్గలి, ఫిబ్రవరి12 (మనం న్యూస్):** అనంతపురం జిల్లా, గుత్తి సమీపంలో ఉండే బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ ఆలయంలో సేవాగడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన నా పుస్తకం గోర్ (బంజారా) లిపి పుస్తకం ను ఆవిష్కరణ చేస్తున్నట్లు వ్యవసాయ మరియు రైతుల కేంద్ర సంక్షేమ మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. రాజేంద్ర నాయక్ (ఏ .ఆర్. ఎస్,) తెలిపారు.

మండలంలోని గుండాల తండా లో తమ స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ మరియు రైతుల కేంద్ర సంక్షేమ మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. రాజేంద్ర నాయక్ (ఏ .ఆర్. ఎస్,) మాట్లాడుతూ తానే స్వయంగా నా పుస్తకం గోర్ (బంజారా) లిపి పుస్తకం ను రచించి, ముద్రించడం జరిగిందన్నారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల చేత సేవా గడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ పుస్తకంలో గిరిజనుల భాష, జీవన విధానం తదితర వాటిపై రచించడం జరిగిందన్నారు.

# అంతారం గ్రామ సభ సమాచారం



**చేవెళ్ల, ఫిబ్రవరి 12 (మనం న్యూస్) :**చేవెళ్ల మండల పరిధి అంతారంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామ అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనపై గ్రామస్తులతో సమగ్రంగా చర్చించారు. గ్రామ ప్రజల సమస్యలను నేరుగా విని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో: ఉప సర్పంచ్ కావలి వెంకటేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి నామ శ్రీకాంత్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## రష్యా చమురును భారత్ కొనదన్నది ట్రంప్ ఒక్కరే

- మోడీ సహా భారతీయ నేతలెవరూ ఆ మాట చెప్పలేదు
- పార్లమెంటులో రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్ వ్యాఖ్యలు

**మాస్కో , ఫిబ్రవరి 12:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందంటూ వార్తలొస్తున్న వేళ.. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ తమ దేశ పార్లమెంటులో కీలక వ్యాఖ్యలు చేశారు. మాస్కో నుంచి చమురు కొనుగోలును ఢిల్లీ ఆపేస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మినహా మరెవరూ చెప్పలేదన్నారు. పార్లమెంటు దిగువ సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు లావ్రోవ్ బుధవారం ఈ మేరకు సమాధాన మిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని ప్రధాని మోడీ సహా ఇతర భారతీయ నేతలెవరూ ప్రకటించలేదన్నారు. భారత్ వేదికగా ఈ ఏడాది జరగబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో 'ఇంధన భద్రత' ఓ కీలకాంశంగా ఉండబోతోందని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతిని లావ్రోవ్ గుర్తుచేశారు. ఆ సదస్సు సందర్భంగా మోడీతో రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఢిల్లీతో సంబంధాల విషయంలో మాస్కో ఆకాశమే హద్దుగా ఎంత దూరమైనా వెళ్తుందని ఉద్ఘాటించారు.

# టీనేజర్లను ఛిద్రంచేసిన నరరూప రాక్షసుడు జెఫ్రీ ఎప్‌స్టీన్

**న్యూయార్క్ , ఫిబ్రవరి 12:** టీచర్.. ఇన్వెస్టర్.. లాబీయిస్ట్.. ఇలా అమెరికా సమాజంలోని ఉన్నత స్థాయి వ్యక్తుల మధ్య చలామణి అయిన ఓ కామాంధుడి వ్యవహారం ప్రభుత్వాలను వణికిస్తోంది. టీనేజ్ బాలికలను ఉచ్చులోకి లాగి నిర్మించిన ఓ అసాంఘిక సామ్రాజ్యాన్ని ప్రపంచంలో నిత్యం సుద్దులు చెబుతూ పెద్దమనుషులుగా చలామణి అయ్యే వారంతా సందర్శించారు. వీరిలో అమెరికా అధ్యక్షులు.. వివిధ దేశాల రాకుమారులు.. బడా రాజకీయ నేతలు.. ఈ శతాబ్ద సృజనాత్మక టెక్ దిగ్గజాలు ఉండటం చూసి ప్రపంచం అవాక్కైంది. ఈ పాపాల చిట్టాలోని మొత్తం 35 లక్షల ఫైళ్లు.. 1,80,000 ఫొటోలు, 2,000 వీడియోలను అమెరికా న్యాయశాఖ విడుదల చేసింది. ఇన్ని పాపాలు చేసిన ఎప్‌స్టీన్.. శిక్షను అనుభవించకుండానే 2019లో జైల్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించాడు. కానీ.. ఆ చీకటి చరిత్రలోని మురుగు ప్రపంచ రాజకీయాలను కుదిపేస్తోంది.

1953లో బ్రూక్లిన్‌లో ఎప్‌స్టీన్ జన్మించాడు. అతడి తండ్రి న్యూయార్క్‌లో గార్డెనర్. స్కూల్ జీవితంలో సరిగ్గా చదువు అబ్బలేదు. కానీ, గణితం మాత్రం బాగా వచ్చు. డిగ్రీ కూడా పూర్తిచేయలేదు. 1970ల్లో అమెరికాలోని ప్రముఖ డాల్టన్ స్కూల్లో హెడ్మాస్టర్ డొనాల్డ్ బార్ చలువతో గణితం, ఫిజిక్స్ బోధకుడిగా చేరాడు. అక్కడా విద్యార్థినులతో అతడి ప్రవర్తన సరిగా లేదనే విమర్శలు చెలరేగాయి. అతని పనితీరు బాగోలేదని రెండేళ్ల తర్వాత తొలగించారు.

అదే సమయంలో ఓ విద్యార్థి తండ్రి సాయంతో వాల్‌స్ట్రీట్‌లోని గ్రీన్‌బెర్గ్‌కు పరిచయమయ్యాడు. ఇది అతని జీవితంలో టర్నింగ్ పాయింట్. అక్కడ పనిచేసిన నాలుగేళ్లలోనే ఆ సంస్థలో పరిమిత భాగస్వామిగా మారాడు. ఈ సమయంలో గ్రీన్‌బెర్గ్ కుమార్తెతో అతడు డేటింగ్ చేసినట్లు ప్రచారం జరిగింది. సంపన్న ఖాతాదారులను డీల్ చేయడంలో దిట్టగా పేరు తెచ్చుకొన్నాడు. ఆ తర్వాత ఇంటర్ కాంటినెంటల్ అసెట్స్ గ్రూప్ అనే రుణ, మోసపోయిన సొమ్ము వసూళ్ల కంపెనీ స్థాపించాడు. ఈక్రమంలో తాను సీఐఏ ఏజెంట్‌నని చెప్పుకోవడం మొదలుపెట్టాడు. అతడి వద్ద ఆస్ట్రియా పాస్‌పోర్టు కూడా ఉండటం గమనార్హం. ఈ సమయంలోనే స్టీవెన్ హాఫెన్‌బెర్గ్ వంటి సంపన్నులతో పరిచయం ఏర్పడింది. ముఖ్యంగా సౌదీకి చెందిన ఆయుధ దళారి అద్నాన్ ఖషోగ్గితో కలిసి భారీ డీల్ చేయడంతో పెద్దమొత్తంలో సంపాదించాడు. కొన్నాళ్లకు స్టీవెన్‌తో కలిసి టవర్ ఫైనాన్షియల్ కార్పొరేషన్లో పనిచేశాడు. ఈ సంస్థలో ఉంటూనే సొంతంగా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ మొదలుపెట్టాడు.

ఆ తర్వాత టవర్ ఫైనాన్షియల్‌ను వదిలేశాడు. కొన్నాళ్లకే ఆ సంస్థ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు ఏ పనిచేసినా.. దాని చాటున వక్రమార్గం పడుతూనే ఉన్నాడు. కొత్త కంపెనీలో ఓ ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ సీఈవోతో పరిచయం పెంచుకొని రైట్‌హ్యాండ్‌గా మారిపోయాడు. తాను సంపాదించిన సొమ్ముతో ఫ్లోరిడాలో ఓ భవనాన్ని కొనుగోలు చేశాడు. న్యూమెక్సికోలో ఓ ర్యాంచ్‌ను సొంతం చేసుకొన్నాడు. ఇక న్యూయార్‌లోనే అతిపెద్దదైన ప్రైవేట్ హోమ్‌ను దక్కించుకొన్నాడు. మోడల్స్, కళాకారులు, హైప్రొఫైల్ వ్యక్తులతో ఆ భవనాల్లో కలిసేవాడు. ఈ ఇళ్లల్లో రహస్య కెమెరాలను అమర్చి అక్కడి కార్యకలాపాలను రికార్డు చేసి దాచడం మొదలుపెట్టాడు. 1996లో తన సంస్థ పేరును ఫైనాన్షియల్ ట్రస్ట్ కంపెనీగా పేరు మార్చి.. వర్జిన్ ఐలాండ్‌కి హెడ్ ఆఫీస్‌ను మార్చాడు. పన్ను తప్పించుకోవడానికే ఇలా చేసినట్లు నిఘావర్గాల సమాచారం.

ఇతనికి ఓ ప్రైవేటు బోయింగ్ 747 విమానం ఉంది. దానిలో హైప్రొఫైల్ మిత్రులతో కలిసి విదేశాలకు, తన సొంత ద్వీపానికి వెళ్లేవాడు. ఈ విమానాన్ని వర్జిన్ ద్వీపాల్లో స్థానికులు 'లోలితా ఎక్స్‌ప్రెస్‌గా'గా పిలిచేవారు. తరచూ దీనిలో యువతులు, బాలికలు అనుమానాస్పదంగా కనిపిస్తుండటంతో ఈ పేరు పెట్టారు. ఈ ఫ్లైట్ లాగ్స్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ట్రంప్ సహా పలువురి పేర్లు బయటకు వచ్చాయి.

1990ల నుంచి 2000 ప్రారంభం వరకు ఎప్‌స్టీన్, డొనాల్డ్ ట్రంప్ మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. అనంతరకాలంలో పామ్ బీచ్‌లో మాన్షన్ డె లమిటి భవన వేలం విషయంలో విభేదాలు మొదలయ్యాయి. నాడు బిడ్‌లో ట్రంప్ విజయం సాధించినా.. తన క్లబ్‌లోని ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించాడంటూ 2007లో అతన్ని బహిష్కరించినట్లు చెబుతారు.

వాస్తవానికి 2005లో ఎప్‌స్టీన్ బాలికను లైంగిక కార్యకలాపాలకు వాడుకొన్న కేసు నమోదైంది. దీనిలో 2008లో దోషిగా తేలడంతో 18 నెలల జైలుశిక్ష విధించారు.

టీనేజర్లకు వలవిసిరే మ్యాక్స్‌వెల్..

ఎప్‌స్టీన్ విద్యార్థులను మోసపూరితంగా లొంగదీసుకొని..



ఈ రొంపిలోకి లాగేట్లు.. ఓ నెట్‌వర్క్‌ను సృష్టించాడు. ఇందుకు అతడి స్నేహితురాలు మ్యాక్స్‌వెల్ సహకరించేది. ఇటీవల విడుదలైన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఓ ఘటన ఉదహరించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ జస్టిస్ లెక్కప్రకారం 1,000 మంది వరకు మహిళలను లొంగదీసుకొన్నట్లు అంచనా. బయటకు రాని వారు ఇంకా ఎక్కువే ఉంటారు. ముఖ్యంగా కళ్లు చెదిరే స్కాలర్‌షిప్‌లు, ఉన్నత వర్గాలతో సంబంధాలు, మాన్ హట్టన్ టౌన్ హౌస్‌పార్టీలు వంటివి ఎరగా వేసేవాడు. తూర్పు ఐరోపాలోని దేశాల్లో మోడలింగ్ కాంటాక్ట్‌లను అడ్డంపెట్టుకొని అక్కడి మహిళలను అమెరికా రప్పించేవాడు. సైనిక ఘర్షణల్లో ఉండే యుగోస్లావియా వంటి దేశాల్లోని బాలికలను టార్గెట్ చేసేవాడు. ఇక మ్యాక్స్ వెల్ పాఠశాలలను సందర్శిస్తూ బలహీన కుటుంబాల నుంచి వచ్చే బాలికలను గుర్తించి వారికి ఎరవేసేవారు. ఎప్‌స్టీన్ మసాజ్‌కు 300 డాలర్లు చెల్లించి.. మరో బాలికను తీసుకొస్తే ఇంకో 300 డాలర్లు చెల్లించేవాడని టైమ్స్ కథనంలో పేర్కొంది. ఎప్‌స్టీన్ తన పరపతి పెంచుకోవడంతోపాటు.. నెట్‌వర్క్‌ను విస్తరించుకోవడానికి తరచూ పార్టీలను నిర్వహించేవాడు. విచ్చలవిడి శృంగారంతో సాగే వీటి కోసం సమాజంలో హైప్రొఫైల్ వ్యక్తులు కూడా అర్రులు చాచి హాజరయ్యేవారు. పైరవీలు, ఆర్థిక లావాదేవీలు, సమాజంలో శక్తిమంతులతో స్నేహం వంటి వాటి కోసం చేసేవాడు. తాజాగా వాటికి సంబంధించిన ఫైల్స్‌ను అమెరికా ప్రభుత్వం విడుదల చేసింది. ప్రిన్స్ ఆండ్రూ, ఎలాన్ మస్క్, రిచర్డ్ బ్రాన్సన్, వెక్సనెర్, మైకెల్ జాక్సన్, సారా ఫెర్గ్యూసన్, బిల్ గేట్స్, డొనాల్డ్ ట్రంప్, బిల్ క్లింటన్, ఎహుద్ బరాక్, లారీ సమ్మర్స్, హూవర్డ్ లుట్నిక్,సెర్గీ బ్రైన్, స్టీవ్ బానన్ ఇలా చెప్పుకొంటూ పోతే పెద్ద జాబితా ఉంది.

జెఫ్రీ ఎప్‌స్టీన్‌ను 2019 జులైలో వివిధ ఆరోపణలపై న్యూయార్క్ సిటీలో అరెస్ట్ చేశారు. ఆ తర్వాత అతడికి బెయిల్ నిరాకరించారు. ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే జైల్లో మెడపై గాయాలతో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. అతడి భవనాలు, ప్రైవేటు ద్వీపం నుంచి స్వాధీనం చేసుకొన్న ఫైళ్లను ఇప్పుడు అమెరికా ప్రభుత్వం విడుదల చేసింది.

# అమెరికాలో జాహ్నవి కందుల మృతి కేసు..

## కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం

**సియాటెల్, ఫిబ్రవరి 12:** అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మృతి చెందిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమె కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.262 కోట్లు) పరిహారం చెల్లించేందుకు సియాటెల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) ప్రకటన విడుదల చేశారు.

''జాహ్నవి కందుల మృతి అత్యంత బాధాకరం. ఈ సెటిల్‌మెంట్‌తో ఆమె కుటుంబానికి కాస్తయినా ఉపశమనం లభిస్తుందని ఆశిస్తున్నాం'' అని సియాటెల్ అటార్నీ తమ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, దీనిపై జాహ్నవి కుటుంబం తరఫు అటార్నీ నుంచి ఇంతవరకూ స్పందన రాలేదు. ఈ కేసులో పరిహార ఒప్పందం కోసం ఇరుపక్షాలూ గతవారం కోర్టులో దరఖాస్తు దాఖలు చేసినట్లు తెలిసింది.



ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి (23) ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికా వెళ్లారు. సౌత్‌లేక్ యూనియన్‌లోని నార్త్‌ఈస్ట్రన్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీలో చేరారు. 2023 జనవరి 23న రాత్రి ఆమె రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జాహ్నవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవే.. జాహ్నవి మృతిపై పరిహాసం చేయడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది.

'ఆమె ఓ సాధారణ వ్యక్తి.. ఈ మరణానికి విలువ లేదు' అని పోలీసు అధికారి అన్న మాటలు ఆయన బాడీ కెమెరాలో రికార్డయ్యాయి. దీనిపై అప్పట్లో భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. కెవిన్ తీరుపై అమెరికాలోనూ విమర్శలు రావడంతో ఆయనను విధుల నుంచి తొలగించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 40 కెపిహెచ్ జోన్‌లో ఉంది. కానీ, కెవిన్ గంటకు 119 కిలోమీటర్ల వేగంతో వాహనం నడిపి జాహ్నవిని ఢీకొట్టగా.. ఆమె 100 అడుగుల దూరం ఎగిరిపడినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.

# ఎప్‌స్టీన్‌ను నియమించుకోలేదు

- గేట్స్ ఫౌండేషన్ వెల్లడి

**న్యూయార్క్, ఫిబ్రవరి 12 :** జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇటీవల అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన ఫైళ్లలో ఎప్‌స్టీన్, దాతృత్వ సంస్థ గేట్స్ ఫౌండేషన్ సిబ్బంది మధ్య సంభాషణ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. తాము అతడిని నియమించుకోలేదని, ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపలేదని వెల్లడించింది. ''ఆరోగ్య సంరక్షణ, అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చే దాతలను సమకూరుస్తానని ఎప్స్టీన్ చెప్పడంతో ఫౌండేషన్ సిబ్బంది కొందరు అతడితో సంభాషణలు జరిపారు. అయితే తర్వాత దీనిపై ముందుకువెళ్లలేదు. ఎలాంటి నిధి ఏర్పాటు చేయలేదు. విషయం ఏదైనా సిబ్బంది అతడితో మాట్లాడటంపై చింతిస్తున్నాం'' అని తన ప్రకటనలో పేర్కొంది.



మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, మిలిందా (గేట్స్ మాజీ భార్య) 2000 సంవత్సరంలో బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపడుతోంది. దీనికి బిల్‌గేట్స్ ఛైర్మన్‌గా ఉన్నారు. కాగా.. ఇటీవల అమెరికా ప్రభుత్వం 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. జైల్లో చనిపోయిన మిలియనీర్ ఫైనాన్షియర్ ఎప్‌స్టీన్ ఆధ్వర్యంలో మైనరు బాలికలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. ఈ విషయంలో ఆయన డోనాల్డ్ ట్రంప్, బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూలతో జరిపిన సంభాషణలు ఉన్నాయి.

## భూమి దిశగా దూసుకొచ్చిన స్విఫ్ట్ అబ్జర్వేటరీ

### తాత్కాలికంగా నిలిపిన నాసా



**న్యూయార్క్ , ఫిబ్రవరి 12:** నాసా టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ'భూమి దిశగా దూసుకొచ్చింది. వాతావరణ రాపిడి వల్ల ఇది తన కక్ష్య నుంచి భూమి వైపు కదిలింది. 585 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఇది 400 కి.మీ కిందికి చేరింది. దీంతో అట్మాస్పెరిక్ డ్రాగ్‌ను తగ్గించేందుకు తాత్కాలికంగా సైన్స్ ఆపరేషన్‌లను నిలిపివేశారు. అలాగే మళ్లీ దానిని యథాస్థితికి చేర్చేందుకు నాసా రీబూస్ట్ మిషన్‌ను చేపట్టింది.

విశ్వంలో చోటుచేసుకునే గామా కిరణాల పేలుళ్లను గుర్తించి, అధ్యయనం చేసేందుకు నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీని నాసా 2004లో దీన్ని ప్రయోగించింది. సోలార్ యాక్టివిటీ వల్ల భూ ఎగువ వాతావరణం వేడెక్కి, ఈ అబ్జర్వేటరీ కక్ష్య నుంచి కిందికి రావడం ప్రారంభమైంది. దీనిని అలాగే వదిలేస్తే.. 2026 చివరి నాటికి భూవాతావరణంలోకి ప్రవేశించి కాలిపోయేది. దాని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. అయితే దాని సేవల్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగించాలని నాసా భావిస్తోంది. రీబూస్ట్ మిషన్‌ను చేపట్టేవరకు ఆ టెలిస్కోప్‌ను 300కి.మీ.ఎత్తులో ఉంచేందుకు.. అట్మాస్పెరిక్ డ్రాగ్‌ను తగ్గించేలా చర్యలు తీసుకుంటోంది.

కాగా.. రీబూస్ట్ మిషన్ కోసం ఆరిజోనాకు చెందిన కాటలిస్ట్ స్పేస్ టెక్నాలజీస్‌తో నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జూన్‌లో 30 మిలియన్ డాలర్లతో రోబోటిక్ లింక్ స్పేస్‌క్రాఫ్ట్ కక్ష్యలో సర్వీసింగ్ కోసం, ఉపగ్రహ మరమ్మతు, డాకింగ్ కోసం రూపొందించిన ఒక రోబో వ్యవస్థను పంపించనుంది. ఇది స్విఫ్ట్‌ను 600కి.మీ ఎత్తులో స్థిరమైన కక్ష్యలోకి చేరుస్తుంది. దాంతో అది మళ్లీ మరో పదేళ్ల సేవలు అందించడానికి వీలుకలుగుతుంది. ఈ ప్రయత్నం విజయవంతమైతే.. ఇప్పటివరకు సంగ్రహించిన డేటాను కాపాడుకునే వీలు కలుగుతుంది.




## మాకు ప్రత్యామ్నాయం ఉంది

- వాట్సప్‌ను పూర్తిగా బ్లాక్ చేసిన రష్యా

**మాస్కో, ఫిబ్రవరి 12:** సామాజిక మాధ్యమం వాట్సప్‌ను రష్యా నిషేధించింది. స్థానిక చట్టాలను పాటించేందుకు వాట్సప్ మాతృసంస్థ మెటా నిరాకరించిందన్న కారణంతో పుతిన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. అలాగే స్థానిక మెసెంజర్ 'మ్యాక్స్'కు మారాలని ప్రజలకు సూచించారు. ''మనకు మ్యాక్స్ ఒక ప్రత్యామ్నాయం ఉంది. అది స్వదేశీ యాప్. ప్రస్తుతం అది మార్కెట్లో అందుబాటులో ఉంది'' అని వెల్లడించారు.

అయితే మ్యాక్స్‌మెసెంజర్‌పై దేశీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం దానిని నిఘా సాధనంగా వాడుతుందని విమర్శకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అయితే ఆ వ్యాఖ్యలను రష్యా అధికారులు కొట్టిపారేశారు. ఇది ప్రజల దైనందిన కార్యకలాపాలు సులభతరంగా మారతాయని భరోసా ఇస్తుంది. కాగా.. స్థానిక చట్టాలను పాటించాలంటూ గత ఆరు నెలలుగా రష్యా ప్రభుత్వం వాట్సప్పై ఒత్తిడి తీసుకువస్తోంది. రష్యాను మెటా ఇప్పటికే అతివాద సంస్థగా గుర్తించింది. ''ప్రజలను ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిఘా యాప్ దిశగా మళ్లించేందుకు వాట్సప్‌ను పూర్తిగా బ్లాక్ చేసేలా రష్యా చర్యలు ప్రారంభించింది'' అని గతంలో వాట్సప్ ఆరోపించింది.

# లంబోర్గిని కారు ప్రమాదం కేసు..

- గంటల్లో వ్యాపారవేత్త కుమారుడికి బెయిల్



**కాన్పూర్, ఫిబ్రవరి 12:** ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారులపైకి లంబోర్గిని కారు దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యాపారి కుమారుడు శివం మిశ్రాను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత నిందితుడిని అరెస్టు చేయగా.. కొన్ని గంటల్లోనే అతడికి బెయిల్ వచ్చింది. అతడిని తమ రిమాండ్‌కు అప్పగించాలని పోలీసులు కోరగా న్యాయస్థానం అందుకు నిరాకరించింది.

కాన్పూర్‌లో ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివం మిశ్రా.. లంబోర్గిని కారులో వేగంగా వెళ్తుండగా వీఐపీ రోడ్లో అదుపుతప్పింది. ఈ క్రమంలో అక్కడున్న పాదచారులు, వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దర్యాప్తు చేపట్టిన అధికారులు.. నిర్లక్ష్యంగా, అతివేగంగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తేల్చారు. అయితే, అంతకుముందు కేసు అనేక మలుపులు తిరిగింది. ఘటన సమయంలో శివం డ్రైవింగ్ చేయలేదని అతడి కుటుంబీకులు పేర్కొన్నారు. అయితే, ప్రత్యక్షసాక్షులతోపాటు ఆ సమయంలో తీసిన వీడియోలు, సీసీకెమెరాలను పరిశీలించిన పోలీసులు.. శివం డ్రైవింగ్ చేసినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై సంగారెడ్డి పీఎస్లో కేసు నమోదు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12 :** కాంగ్రెస్ సీనియర్ నేత, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల అధికారుల విధులకు ఆటంకం కలిగించారని ఎఫ్ఎస్టీ టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీస్ స్టేషన్లో 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై జగ్గారెడ్డి స్పందించారు. ''సంగారెడ్డిలో దొంగ ఓట్లను అడ్డుకున్న కాంగ్రెస్ నేతపై సీఐ చేయిచేసుకున్నారు. మా నేతను కొట్టినందుకు సీఐని తిట్టాల్సి వచ్చింది. సీఐ శివకుమార్ బీఆర్ఎస్ అభ్యర్థికి సహకరించారు. ఎన్నికల నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు ఉండాలి. నిన్న జరిగిన ఘటనలో తప్పు ఎవరిదనేది న్యాయస్థానంలో తేలుతుంది'' అని అన్నారు.

# రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

## బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే డిమాండ్

**ఢిల్లీ , ఫిబ్రవరి 12:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే డిమాండ్ చేశారు. ఈమేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్ గాంధీ, బీజేపీ ఎంపీల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. ''రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు..? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించాను.

లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి'' అని దూబే అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు. బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్ సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ధ్రువీకరణ లేదని పేర్కొన్నాయి.



# ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి



**సూర్యాపేట, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి):** పురపాలక సంస్థల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ఓట్లు లెక్కింపు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్ వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓట్లు లెక్కింపు కేంద్రంలో అనుసరించాల్సిన నియమావళి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, టేబుల్వైజ్ కౌంటింగ్ విధానం, బ్యాలెట్ పేపర్లు వేరు చేయుట, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ... ప్రతి రౌండ్ లెక్కింపు పూర్తయ్యే సరికి ఫలితాలను సమగ్రంగా నమోదు చేసి, సంబంధిత అభ్యర్థుల ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని, తదుపరి పరిశీలకుల అనుమతితో విజేతలను ప్రకటించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. సిబ్బంది ఉదయం 7 గంటల వరకు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, అనుమతి పొందిన వ్యక్తులకే ప్రవేశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు. లెక్కింపు సిబ్బంది సమయానికి కేంద్రాలకు హాజరై తమ విధులను బాధ్యతా యుతంగా నిర్వర్తించాలని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జనరల్ అబ్జర్వర్ పాండా దాస్ మాట్లాడుతూ.. కౌంటింగ్ ను చాలా పకడ్బందీగా నిర్వహించాలని, వ్యాలిడిటీ, ఇన్ వ్యాలిడిటీ ఓట్ల గురించి ఆర్వోలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఒకసారి ఒక ఓటును రైట్, రాంగ్ గా నిర్ధారించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అట్టి నిర్ణయాన్ని మార్చుకోకూడదని, కౌంటింగ్ సిబ్బంది అందరూ సకాలంలో హాజరుకావాలని అన్నారు. ఈ శిక్షణ సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీవోలు వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు మున్సిపల్. కమిషనర్లు, తాసిల్దారులు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీశక్తి మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**తిరుమలగిరి, ఫిబ్రవరి 12(మనం న్యూస్):** మండలం తాటిపాముల గ్రామంలో స్త్రీశక్తి మహిళాసంఘాల భవనానికి స్థానిక సర్పంచ్ బోయపల్లి కృష్ణయ్య (కిషన్) గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ,మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి ,భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి,ల ఆదేశానుసారం భవనాన్ని మంజూరు చేయించుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తుందని చెప్పారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను మహిళా సంఘాలు వినియోగించుకోవాలని అన్నారు. సంఘాలలోని సభ్యులు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. మహిళలు తమ సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం కోసం ప్రభుత్వం తాటిపాముల గ్రామానికి సంఘ బంధం 1 సంఘ బంధం 2 భవనాలు మంజూరు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోనాసి ఎల్లమ్మ సోమయ్య, పంచాయతి రాజ్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి రాజు, సంఘ బంధం అధ్యక్షురాలు తాటిపాముల కవిత కార్యదర్శి కోల జ్యోతి కోశాధికారి అంజమ్మ, నాయకురాళ్ళు ఎస్.కె. రజియా, గ్రామ పెద్దలు పాలబిందెల లక్ష్మయ్య, పి.యాదగిరి, ఎర్ర యాదగిరి, సుదర్శన్, కిష్టయ్య, వివోఏ మల్లేష్, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు మహిళా సంఘం నాయకురాళ్ళు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అందుబాటులో లేని సర్పంచ్



- వార్డులలో నెలకొన్న సమస్యలతో తీవ్ర ఇబ్బందులు

**రుద్రూర్, ఫిబ్రవరి 12 ( మనం న్యూస్ ):** రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అఫిన్ బేగం అందుబాటులో ఉండడం లేదని, వార్డులలో తమస్తులు తీవ్రంగా ఉన్నాయని వార్డు మెంబర్లు సెక్రెటరీ పై తీవ్రంగా మండిపడ్డారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వార్డు మెంబర్లు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అవార్డు మెంబర్లు మాట్లాడుతూ., గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, మురికి కాలువల్లో చెత్తాచెదారం చేరి అధ్వానంగా మారాయన్నారు. అదేవిధంగా రాయకూర్ గ్రామానికి వెళ్లే రహదారి ప్రక్కన ఉన్న పల్లె ప్రకృతి వనం కబ్జాకు గురైందని, ఆ స్థలంలో గేదెలను కట్టివేస్తూ, ఇటుక డంపులు చేస్తున్నారని ఈ సమస్య గురించి సెక్రటరీకి విన్నవించి 15 రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులలో నెలకొన్న సమస్యల గురించి సెక్రటరీకి విన్నవిస్తే పట్టించుకోకుండా తమకేమిలే అన్నచందంగా నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఈ సమస్యల గురించి సర్పంచ్ కు ఫోన్ చేయమని సెక్రటరీకి చెపితే, మాజీ సర్పంచ్ కు ఫోన్ చేసి చెప్తున్నాడని, సర్పంచ్ ఫోన్ నెంబర్ అడిగితే లేదని, సర్పంచ్ ఎవరో కూడా నాకు తెలియదు అని సెక్రటరీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామ సర్పంచ్, సెక్రెటరీ పై చర్యలు తీసుకోవాలని వార్డు మెంబర్లు కోరారు.

# నాలుగు లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేయాల్సిందే

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ యధాతథంగా కొనసాగించాలి
- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య




**తిరుమలగిరి, ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** మతోన్మాద ఫాసిస్టు కేంద్ర ప్రభుత్వం, నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేసేంతవరకు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా కొనసాగించేంతవరకు ఉద్యమాలు నిర్వహిస్తామని సి.పి.ఐ. (ఎం-ఎల్ )మాస్ లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ పేర్ల నాగయ్య అన్నారు. గురువారం దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో భాగంగా తిరుమలగిరిలోని మార్కెట్ యార్డ్ ఎదురుగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ, కార్మికుల శ్రమను బడా పెట్టుబడిదారులకు, కార్పొరేటు శక్తులకు దోచిపెట్టేటందుకు 27 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్ చట్టాలను తేవడం జరిగిందని, నాలుగు లేబర్ కోడ్ చట్టాలు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, కార్మికులపై అదనపు పని భారం పడే ప్రమాదం ఉన్నందున లేబర్ కోడ్ చట్టాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. భీమరంగంలో 100 శాతం ప్రైవేట్ పెట్టుబడుదారులకు అప్ప చెప్పడం వలన సామాన్యుడి జీవిత భద్రత గాలిలో దీపం చందంగా తయారవుతుందని ఆయన హెచ్చరించారు. ఏలాంటి సుంకాలు లేకుండా విదేశీ ఉత్పత్తులను కూడా దేశంలోకి ఆహ్వానించడం అంటే భారతదేశ చిరు వ్యాపారులను దెబ్బతీయడమేనని అన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 70 శాతం వ్యవసాయ కార్మికులను మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం వలన, గ్రామీణ వ్యవసాయ కార్మికులను దిక్కులేని వారిగా నడిరోడ్డుపై వదిలేయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా ఉద్యమాలపై నిరంకుశ అణిచివేతను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కమిటీ సభ్యుడు కందుకూరి కొండయ్య, టి యు సి ఐ డివిజన్ కార్యదర్శి పరిపటి ఏకవరెడ్డి, ఉపాధ్యక్షులు గోపు సుధాకర్ రెడ్డి, అరుణోదయ కళాకారుడు డప్పు రవి, హమాలీ యూనియన్ నాయకులు దాసు, ఆటో యూనియన్ నాయకులు చింతకాయల లక్ష్మయ్య, మామిడి గట్టయ్య, ఎస్ కే పాషా, నర్రా శ్రీనివాస్, గజ్జి లక్ష్మయ్య,బొబ్బలి మల్లయ్య పాల్గొన్నారు.

# చీఫ్ మినిస్టర్స్ కప్-2025 ఘనంగా ప్రారంభం

- ప్రతిభను చాటుకునేందుకు గ్రామీణ క్రీడాకారులకు సీఎం కప్ ఒక వరం
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, ఫిబ్రవరి 12 ( మనంప్రతినిధి):** జిల్లా స్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్-2025 (2వ ఎడిషన్) టోర్నమెంట్లను గురువారం కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఘనంగా ప్రారంభించారు. అదనపు కలెక్టర్ విక్టర్తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు తమ ప్రతిభను చాటుకునేందుకు చీఫ్ మినిస్టర్స్ కప్ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. జిల్లాకు కీర్తి తీసుకొచ్చేలా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ., ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడా విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ స్వయంగా కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభించడం విశేషం. ఈ కార్యక్రమంలో క్రీడా అధికారులు వెంకటేశ్వర్లు గౌడ్, ఆర్డీవో వీణ, తహసిల్దార్ జనార్ధన్, పీడీ మెప్మ, కోచ్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కామారెడ్డిలో కార్మికుల నిరసనలు




- ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్.దశరథ్, జిల్లా కార్యదర్శి పి.బాలరాజ్.
- కార్మికులకు పని భద్రత కల్పించాలి

**కామారెడ్డి, ఫిబ్రవరి 12 ( మనం న్యూస్ ):** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కామారెడ్డి పట్టణ కేంద్రంలో కార్మికులు నిరసనలో భారీగా పాల్గొన్నారు. కామారెడ్డి మున్సిపల్ వాటర్ సెక్షన్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి ముందు, అలాగే సివిల్ సప్లై గోదాముల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి, పాత 29 చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, సుప్రీంకోర్టు జీవో ప్రకారం కనీస వేతనం అమలు, పీఎఫ్ - ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే బ్యాంకింగ్, వైద్యం, విద్య, ఎల్ఐసి, రైల్వే, విద్యుత్ రంగాల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి కార్మికులకు పని భద్రత కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్.దశరథ్, జిల్లా కార్యదర్శి పి.బాలరాజ్, ప్రభుత్వ ఆసుపత్రి కార్మిక నాయకులు శ్రీనివాస్, రఫిక్, సునీత, పద్మ, లావణ్య, అనిత, మమత, ప్రవీణ్, రజిత, బాలరాజ్, సంగమేశ్వర్, లక్ష్మి, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి నర్సింగ్రావు, రాజిరెడ్డి, రాజు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే సివిల్ సప్లై హమాలీలు కూడా సమ్మెలో భాగస్వాములయ్యారు.



# సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

**పాలకీడు, ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం పాలకీడు మండల కేంద్రంలో భారీ ఎత్తున సిపిఎం సిఐటియు ఆధ్వర్యంలో 200 మంది కార్మికులతో పాలకీడు ప్రధాన కూడలిలో రాస్తారోక చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కన్నగట్ల అనంత ప్రకాష్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం రైతా వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకుని వచ్చిన నేపథ్యంలో రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళనలు పోరాటాలు సుమారు 16 నెలలు చేశారని అందులో 150 మంది రైతులు ప్రాణాలు పోగొట్టుకున్నారని ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కుదిచ్చి నాలుగు లేబర్ కోర్టు తీసుకోవచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా మహాత్మా గాంధీ పేరు తొలగించి వీరాంజి పేరు మీద ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఇది వ్యవసాయ కూలీల పొట్ట కొట్టే విధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు దీనిని వెంటనే రద్దు చేయాలని మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు కనీస వేతనం చట్టప్రకారం అంగన్వాడీలకు, ఆశ వర్కర్లకు, కాంట్రాక్టు కార్మికులకు, వివిధ రంగాలలో పనిచేస్తున్న వారికి నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పురుషోత్తం, రమేష్, మాతంగి యేసురత్నం, వీరభద్రం, మల్లారెడ్డి సిఐటియు నాయకులు ఏడుకొండలు, లతీఫ్, మహేష్, రషీద్, నాగరాజు, గౌతమ, పార్వతీ విజయమ్మ భావన నిర్మాణంగా కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, వివిధ శాఖలలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి



- సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్

**బాల్కొండ, ఫిబ్రవరి 12 ( మనం న్యూస్ ):** దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మెలో భీమ్గల్ పట్టణంలో అంగన్వాడీ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు గురువారం భారీ ర్యాలీ ధర్నా నిర్వహించారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఏ. రమేష్ బాబు మాట్లాడుతూ., కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం మరియు ఉపాధి హామీ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని కార్మికులకు పెట్టుబడిదారుల వద్ద వెట్టి చాకిరి చేయించాలని సిద్ధపడి, ఎంతోమంది అనేక పోరాటాలు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని ఆయన విమర్శించారు. అదేవిధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి వి బి జి రాంజీ స్కీమును తెచ్చి రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపుతూ నిర్ణయించటం మూలంగా గ్రామీణ పేదలు మరింత పేదరికంలోకి నెట్టబడతారని ఇది వికసిత్ భారత్కు ఎట్లా దారితీస్తుందని ఆయన అన్నారు అదేవిధంగా విద్యుత్ సవరణ బిల్లును, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తదితర వినాశకరా చట్టాలను తీసుకొచ్చి శ్రమజీవులపై దాడి చేస్తుందని ఆయన అన్నారు వీటి మూలంగా అసంఘటిత మరియు కుటుంబాలు నష్టపోతారని ఆయన అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఎంత ఉండాలో, ఎన్ని గంటల పని ఉండాలో, జపాలు పెట్టుబడిదారులే నిర్ణయిస్తారని పద్ధతుల్లో కార్మిక చట్టాలను సవరించటం ఈ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందో అర్థమవుతుందని అన్నారు అంగన్వాడి ఉద్యోగులను కార్మికులుగా గుర్తించకుండా కనీస వేతనాలు అమలు జరపటం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఉపాధి హామీ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనలు పోరాటాలు మీకు సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా అధ్యక్షులు, కే. దేవగంగు, ప్రాజెక్టు నాయకులు జ్యోతి, ప్రమీల, చంద్రకళ, భాగ్య, వసంత పాటు తదితరులతోపాటు మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఫలితాల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించబోతుంది



- ఇందూర్ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయం

**నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 12 ( మనం న్యూస్ ):** ఇందూర్ బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులు మరియు కౌంటింగ్ ఏజెంట్లతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ., ఇందూర్ మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయం సాధించి, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. 'మన ఇందూర్ - మన మేయర్' ఉండాలని నగర ప్రజలు బలంగా విశ్వసించారని, పోలింగ్ సరళిని బట్టి చూస్తే ప్రజల నాడి పూర్తిగా బిజెపి వైపే ఉందని స్పష్టమవుతోందని అన్నారు. ఇందూర్ అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమని ప్రజలు నమ్మారని, అందుకే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను ప్రజలు తిరస్కరించారని, ఫలితాల రోజున ఆ పార్టీలకు భంగపాటు తప్పదని అన్నారు. కార్యకర్తల కష్టానికి తగిన ఫలితం దక్కబోతోందని, రేపు వెలువడే ఫలితాల్లో బిజెపి ప్రభంజనం సృష్టించబోతోందని అన్నారు. ఏజెంట్లు సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, బాక్సు ఓపెన్ చేసేముందే సీల్స్ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలని, ఓట్లు లెక్కించేటప్పుడు ప్రతి ఓటును జాగ్రత్తగా గమనించాలని అన్నారు. బిజెపికి పడిన ఓటును పొరపాటున ఇన్వాలిడ్ కింద వేయకుండా చూసుకోవాలి. అనుమానం ఉంటే వెంటనే అభ్యంతరం చెప్పాలి. ప్రతి రౌండ్ తర్వాత, అధికారుల లెక్కలతో మీ దగ్గర ఉన్న లెక్కలు సరిచూసుకోవాలి. కౌంటింగ్లో ఏమైనా తేడా అనిపిస్తే, వెంటనే 'రీ-కౌంటింగ్' కోరాలని కౌంటింగ్ ప్రక్రియపై అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కందగట్ల రాంచందర్, నాగ్గొల్ల లక్ష్మీనారాయణ, ప్రమోద్ కుమార్, తిరుపతి రెడ్డి, బద్దం కిషన్, బంటు రాము, పుట్ట వీరేందర్, శ్రీకాంత్, కార్పొరేటర్ అభ్యర్థులు, మరియు కౌంటింగ్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ



**పెన్ పహాడ్ ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** మండలంలోని అనంతారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు 2026-2027 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో వివిధ గురుకుల పాఠశాల్లో అర్హత సాధించడం కోరకు కారడ్స్ బాలబాట స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మోడల్ పరీక్ష పేపర్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా కారడ్స్ బాలబాట జిల్లా కోఆర్డినేటర్ మామిడి పరంధాములు మాట్లాడుతూ విద్యార్థులు ఈ మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకుని ఉత్తమంగా చదువుకొని ఎక్కువ గురుకుల సీట్లు సంపాదించాలని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి రమేష్,విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

రామప్పలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్ ప్రారంభించిన రాష్ట్ర మంత్రి సీతక్క



**ములుగు, ఫిబ్రవరి 12మనం ప్రతినిధిః** ఈనెల 15న శివరాత్రి సందర్భంగా రామప్ప ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రామప్ప ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం రామప్ప ఆలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనం చేసుకుని శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆలయ అధికారులకు చెప్పారు మహా శివరాత్రి సందర్భంగా ఆలయ పరిసరాలు,పార్కింగ్ స్థలం పరిశీలించి శివరాత్రి పండుగ నిర్వహణలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, ఆయా గ్రామాల సర్పంచులు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని వ్యాపారం

- గిరిజనేతరుల షాపులను నిలుపుదల చేయాలి
- మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య



**ములుగు, ఫిబ్రవరి 12మనం ప్రతినిధిః** అనుమతులు లేకుండా షెడ్యూల్ ఏరియాలో ఆదివాసి గిరిజన చట్టాలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న గిరిజన షాపులను నిలుపుదల చేయాలని మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య మండల అధ్యక్షుడు దాటి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా షెడ్యూల్ ఏరియా మంగపేట తాహసిల్ పరిధిలోని చల్ల రమణయ్య చల్ల రాంకీ చల్ల శ్రీహరి లు ఆంధ్ర ప్రాంతం నుంచి అక్రమంగా వలస వచ్చి అనుమతి లేని ఐరన్ షాప్ ఇటుక పెయింట్ కంకర మిషనరీలు తదితర ఎలాంటి పర్మిషన్ లేకుండా దుకాణాలు నిర్వహిస్తూ పలుమార్లు తహసిల్దార్ చెప్పిన తమరు మా ముందు అనేక సార్లు చెప్పిన కూడా లెక్క చెయ్యకుండా గిరిజన చట్టాలకు విరుద్ధంగా అనుమతి లేని భవన నిర్మాణాలు చేస్తూ ఆదివాసి గిరిజన చట్టాలను జీవోలను లెక్కచేయకుండా అవహేళన చేస్తూ గిరిజనులను దౌర్జన్యంగా దోసుకుంటున్న ఆంధ్ర వలస వాదులను గిరిజ నేతరులను గిరిజన ప్రాంతం నుండి ఖాళీ చేసి గిరిజన చట్టాలను రక్షించే విధంగా రక్షణ కల్పించాలని మంగపేట తాహసిల్దార్ తోట రవీందర్ ను కలిసి మేమేరాండం ఇచ్చిన మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర కమిటీ చేయు ప్రాతినిధ్యం ఏమనగా షెడ్యూల్ ఏరియా ఏజెన్సీ ప్రాంతంలోనికి గిరిజనేతరులు వలస వచ్చే ముందు పర్మిషన్ తీసుకోవాలి పర్మిషన్ పొంద కుండా అక్రమంగా వలస వచ్చి భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా పనులు చేస్తూ తాహసిల్దార్ మరియు ఆదివాసి సంఘాల నుంచి చల్ల రమణయ్య కు ఎన్నిసార్లు చెప్పినా ఆదివాసులకు చెందిన గిరిజన పట్టా భూములలో అక్రమంగా భవన నిర్మాణం చేస్తున్న యస్.కె మహమ్మద్ హుస్సేన్ భవన నిర్మాణం ఆదివాసి సంఘాలు ఎన్ని సార్లు చెప్పిన వినకుండా అనుమతి లేని భవన నిర్మాణాలు చేస్తూ ఆదివాసి గిరిజన చట్టాలకు జీవోలను అవహేళన చేస్తూ గిరిజనులను నుండి దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేస్తూ గిరిజన ప్రాంతాన్ని దోసుకుంటున్నారు గిరిజన చట్టాలైన 1359 పసిలి 1ఆఫ్59, 1ఆఫ్70,పెసా చట్టం 1996, పెసా చట్టం 1998,పెసా చట్టం 2011 ప్రకారం వలస గిరిజనేతరులకు ఎలాంటి రైట్స్ లేవు చట్టాలు లేవు చల్ల రమణయ్య, ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చి ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని అనుమతి లేకుండా ఐరన్ షాపు పెయింట్ షాపు కంకర ఇటుకలు సిమెంట్ లు తదితర పర్మిషన్ లేని దుకాణాలు నిర్వహిస్తూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి గిరిజన చట్టాలను జీవోలను అవహేళన చేస్తూ విరుద్ధంగా గిరిజనులను దౌర్జనంగా దోసుకుంటున్న చల్ల రామణయ్య ను ఆంధ్ర వలస వాదులను గిరిజనేతరులను గిరిజన ప్రాంతం నుండి ఖాళీ చేయించి గిరిజన ప్రాంతాన్ని కాపాడాలని రక్షించాలని మంగపేటం తాహసిల్దార్ ను కలిసి వివరించిన మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తోలేం సుధాకర్, జిల్లా అధ్యక్షులు ఆక తిరుమలరావు, మంగపేట మండలం అధ్యక్షుడు తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



- ఆధ్యాత్మిక శోభతో రామప్ప ఆలయాన్ని సుందరీకరించాలి
- మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ములుగు, ఫిబ్రవరి12, మనం ప్రతినిధిః** రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం లో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాన్ని సుందరీకరించాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేట రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణం లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి,ఆర్డీఓ వెంకటేష్ ఆలయ ఈవో ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, ఫిబ్రవరి 12 మనంప్రతినిధిః** సంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ 13.02.2026 న ఉదయం 8:00 గంటలకు ప్రారంభం కానుందని, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వివరించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని, అనధికార వ్యక్తులకు ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు మరియు విధుల్లో ఉన్న సిబ్బంది తప్ప మరెవ్వరూ కౌంటింగ్ కేంద్రాల పరిధిలోకి రాకూడదని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, ఎంసిసి ని అతిక్రమించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు భద్రతా చర్యలు: కౌంటింగ్ హాల్ లోపలికి మొబైలు ఫోన్ల అనుమతి లేదు. మీడియా అక్రడేషన్ కార్డ్ వున్న వారిని మీడియా పాయింట్ వరకు మాత్రమే అనుమతించాలి. ' కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడు అంచెల భద్రతా వ్యవస్థ అమలు. సీసీ కెమెరాల నిఘా నీడలో కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్స్. స్ట్రాంగ్ రూమ్ల వద్ద సాయుధ భద్రతా సిబ్బంది నియామకం. కౌంటింగ్ హాల్ వద్ద క్విక్ రియాక్షన్ టీమ్లు సిద్ధంగా ఉంటాయి. సోషల్ మీడియా మానిటరింగ్ ద్వారా అపోహలు, వదంతులను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి, పూర్తి నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతర నిఘా, గస్తీ నిర్వహణ కొనసాగించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ఆదివాసి కుటుంబాలకు న్యాయం చేయాలి



**ములుగు, ఫిబ్రవరి 12మనం ప్రతినిధి :** చుంచుపల్లి ఆదివాసి సొసైటీ కుటుంబాలకు అయినా న్యాయం చేయాలని ఆదివాసి సేన మండలం ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుంచుపల్లి సొసైటీలకు ఆధ్వర్యంలోఆదివాసి సొసైటీల ద్వారా 2024.2025.సం. ఇసుక లావదేవులు నిర్వహించారు. వాటికి సంబంధించిన బిల్లులు టీజీఎండీసీ ఆదివాసీ ఆర్గనైజేషన్ తరుపున ఆదివాసీ సేన మంగపేట మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ.ఆర్టీఐ2005 చట్టం ద్వారా దరఖాస్తు పెట్టుకోగా చుంచుపల్లి ఆదివాసీ సొసైటీలకు సుమారుగా 46838022. నాలుగు కోట్ల 68 లక్షలు 38వేల 22 రూపాయలు. ఆదివాసీ సొసైటీలకు టీజీఎండీసీ చుంచుపల్లి ఆదివాసి సొసైటీలకు ఇవ్వవల సిందిగా తెలియపరిచారు వెంటనే జిల్లా కలెక్టర్, ఐటీడీపీఓ స్పందించి చుంచుపల్లి ఆదివాసీ సొసైటీ కుటుంబాలకు తగు న్యాయం చేయగలరని విజ్ఞప్తి చేశారు.

## పుట్టిన ప్రతి దూడకు గంటలోపే జున్నుపాలు తాగించాలి



**దుగ్గొండి, ఫిబ్రవరి 12 (మనం న్యూస్)ః** దుగ్గొండి మండలం లోని గుడెలుగులపల్లి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత గర్భకోష వ్యాధుల చికిత్స శిబిరం, నిర్వహించడం జరిగింది ఈ శిబిరంనకు ముఖ్యఅతిధిగా స్థానిక సర్పంచ్ జంగిలి రాజు ప్రారంబించారు ఈ శిబిరానికి స్థానిక పశువైద్యాధికారి డాక్టర్.వి.సోమశేఖర్ పివిసి దుగ్గొండి హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పుట్టిన ప్రతి దూడకు గంటలోపు జున్ను పాలు తాగించవలెను దానివలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం డాక్టర్ బి.బాలాజీ పీ వీ సి తిమ్మంపేట, దూడ పుట్టిన 24 గంటల లోపల టీటీ ఇంజక్షన్ వేయించుకోవడం వలన ధనుర్వాతం రాకుండా నివారించవచ్చు, ప్రతి రైతు కనీసం 10 గుంటల భూమిలో పచ్చగడ్డి వేసుకోవాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం లో రైతులు పశువుల పాకలు నిర్మాణం చేసువాలని సూచించారు ఈ శిబిరంనకు ఉపసర్పంచ్ తొర్రూరు కరుణాకర్ , వీఎ కవిత,గోపాలమిత్ర సూపర్వైజర్ . యం డి జహంగీర్ గోపాలమిత్రులు. ఇజ్జగిరి కుమారస్వామి, రాజ్ కుమార్, ప్రసాద్, వోఎస్ శివ, బిక్షపతి సుధాకర్ రెడ్డి గ్రామ రైతు సోదరులు హాజరైనారు ఈ శిబిరంలో 68పశువులు రాగా 29ఎదకు రాని 27దూడలకు నట్టల నివారణ మందులు 5 గర్భకోశ వ్యాధులు 11 చూడినిర్ధారణ మరియు 3 కృత్రిమ గర్భధారణ 9పశువులకు సాధారణ చికిత్సలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది

## శివాలయం ప్రాంగణనికి గ్రావెల్ తోలకాలు



- భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తాం
- సర్పంచ్ సుతారి రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్

**ఆళ్లపల్లి, ఫిబ్రవరి 12 (మనం న్యూస్):** శివరాత్రి పర్వదినం సమీపిస్తుండడంతో పరమశివుని భక్తులు శివాలయం వద్ద పూజలు నిర్వహించుకునేందుకు మర్కోడు సర్పంచ్ సుతరి రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్ ఆధ్వర్యంలో అన్ని సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో శివాలయానికి స్థలం ఉన్నప్పటికీ గుడి లేకపోవడంతో ఆ స్థలంలో గ్రావెల్ తోలకాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. శివా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా శివాలయం ఏర్పాటు చేయడం జరుగుతుందనీ వారు తెలిపారు. రాబోవు రోజులలో శివాలయా నిర్మాణానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ పడిగా సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుతారి కృష్ణ, కొమరం వెంకట్ దొర, వివిధ పార్టీల నాయకులు కొమరం వెంకటేష్, ఇరుప నాగేశ్వరరావు, కొమరం రామనాథం, సుతారి రామ్మూర్తి, దొడ్డి రాము, బుర్ర రవి, కిసరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్పు పోటీలకు ఆదర్శవాణి విద్యార్థులు



**దుగ్గొండి, ఫిబ్రవరి 12 (మనం న్యూస్)ః** ఈనెల 9 10వ తేదీలలో నిర్వహించిన సీఎం కప్పు సెకండ్ ఎడిషన్ పోటీలలో వివిధ క్రీడలలో ఆదర్శవాణి హై స్కూల్ దుగ్గొండి బ్రాంచ్ కి చెందిన విద్యార్థిని విద్యార్థులు కో కో,కబడ్డీ,అథ్లెటిక్స్,జూడో రెజ్లింగ్ క్రీడలలో 20 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికైనరని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీ ఆదర్శవాణి విద్యాసంస్థల చైర్మన్ నాగనబోయిన రవి డైరెక్టర్ కవిత బిక్షపతి పాల్గొన్నారు విద్యార్థిని విద్యార్థులు 20 మందికి పైగా రాష్ట్రస్థాయికి ఎంపిక అవడం సంతోషంగా ఉంది అని తెలియజేశారు పదవ తారీకున వరంగల్ ఓ సిటి గ్రౌండ్ లో నిర్వహించిన కో కో పోటీలలో జిల్లాలో ద్వితీయ స్థానం మండలానికి రావడం గౌరవంగా ఉంది అని తెలియజేశారు సీఎం కప్పు సెకండ్ ఎడిషన్ లో భాగంగా వివిధ క్రీడలలో విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనందుకు క్రీడాకారులని పూలమాలతో అభినందించారు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె నుండి పట్నం వరకు అనే నినాదంతో గ్రామాల నుండి క్రీడాకారులను వెలికి తీసే దిశగా సీఎం కప్పు సెకండ్ ఎడిషన్ క్రీడాకారులకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా ఉంటుంది అని తెలియజేశారు అలాగే విద్యార్థిని విద్యార్థులు ఈ క్రీడా పోటీలను వినియోగించుకోవాలని కోరారు రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిని మన జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని కోరారు విద్యార్థిని విద్యార్థులు ఆటలు ఆడడం వలన మానసిక ఉల్లాసం శారీర దృఢత్వాన్ని కలిగి ఉంటారని తెలియజేశారు ఆటలు ఆడడం వలన గెలుపు ఓటములను సులువుగా తీసుకుని అవకాశం ఉంటుందని తెలియజేశారు జీవితంలో ముందుకు వెళ్లడానికి ఒక దృఢ సంకల్పంగా ముందుకు వెళ్తారని తెలియజేశారు అలాగే క్రీడలతోపాటు చదువులో ముందుండాలని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీ ఆదర్శవాణి విద్యా సంస్థల చైర్మన్ నాగన బోయిన రవి డైరెక్టర్ కవిత బిక్షపతి ప్రిన్సిపాల్ స్రవంతి వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



**కరీంనగర్, పిబ్రవరి 12(మనం న్యూస్ ):** నగరపాలక సంస్థ 66 డివిజన్ కు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. నగరపాలక సంస్థ 2 వ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం రోజు స్థానిక ఎస్ ఆర్ ఆర్ కళాశాలలో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, సీపి గౌస్ ఆలం సమక్షంలో మాస్టర్ ట్రైనర్లు కౌంటింగ్ అధికారులు సిబ్బంది కి శిక్షణ నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులకు సిబ్బంది కి ఓట్ల లెక్కింపు విధి విధానాల పై దిశా నిర్దేశం చేశారు. ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనల పై పలు సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల సంఘం నియమ నిభందనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సర్వం సిద్ధం చేశామని తెలిపారు. స్థానిక ఎస్ ఆర్ ఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో శుక్రవారం రోజు ఉదయం 66 డివిజన్లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు 8:00 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సుపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లు కలుపుకొని మొత్తం 300 మంది కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ కోసం కావల్సిన వసతి సౌకర్యాలు అన్ని కల్పించామన్నారు. పోలీస్ భారీ బంధోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు జరుగుతుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ సెంటర్ లో మొత్తం 66 టేబల్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని... మొదటగా ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్లను లెక్కించడం జరుగుతుందని... తదనంతరం బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందని తెలిపారు. 1000 ఓట్లకు ఒక రౌండ్ చొప్పున పలితాలను వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీనివాసాలో శ్రీనోవా పాలీటెక్ ఫెస్ట్ - 2026 గోడ పత్రిక ఆవిష్కరణ



**కాట్రేనికోన, ఫిబ్రవరి 12, మనం ప్రతినిధి :** అమలా పురం సమీపంలో చెయ్యేరు నందుగల శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల డిప్లమా విభాగము ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీనోవా పాలీటెక్ ఫెస్ట్ -2026 కు సంబంధించిన గోడపత్రికను వివిధ విభాగాధి పతుల సమక్షమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే సురేష్ బాబు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల డిప్లమా విభాగము ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఈ సాంకేతిక ఉత్సవము ప్రతి విద్యార్థిలో సాంకేతిక, క్రీడా నైపుణ్యములను వెలికి తీయటకు ఉద్దేశించబడినదని, ప్రతీ విద్యార్థికి వివిధ సాంకేతికతో మోడల్స్ తయారీ, దోషరహిత పఠనం (ఫ్లాలెస్ రీడింగ్) మరియు కోడ్ క్రాఫట్స్ వంటి సాంకేతిక పోటీలు, వాలీబాల్, త్రోబాల్ , క్యారమ్స్, చెస్ వంటి క్రీడల పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డి వి ఎన్ ఎస్ వర్మ, కళాశాల పాలక వర్గ సభ్యులుసందీప్ ,కళాశాల వివిధ విభాగాదిపతులు, అద్యాపకులు, విద్యార్థినీ విద్యారులు పాల్గొన్నారు.



## స్ట్రాంగ్ రూమ్ సెంటర్‌ను సందర్శించిన అడిషనల్ డీసీపీ లాఆర్డర్

**ఖమ్మం, ఫిబ్రవరి 12(మనం న్యూస్)ః** ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన ఎదులాపురం మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సెంటర్ / స్ట్రాంగ్ రూమ్ ను అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీంచారు. స్ట్రాంగ్ రూమ్ కు రక్షణ కల్పిస్తున్న ఆర్మ్డ్ ఫోర్స్ గార్డును తనిఖీ చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

## నేడు ఆచంటేశ్వర మహాశివరాత్రి ప్రారంభం

- ఆయా శాఖల అధికారులు సమన్వయంతో విధి నిర్వహణ చేయాలి
- అధ్యక్షులు గజేశ్వరరావు



**ఆచంట ఫిబ్రవరి 12 మనం న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా ఆచంట క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ రామేశ్వర స్వామి మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని ఆచంటేశ్వర దేవాలయ అధ్యక్షులు నెక్కంటి గజేశ్వరరావు దేవాలయ కార్యదర్శి ఎస్ ఎస్ రంగరాజు విలేకర్ల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదిన దక్షిణ భారతావనిలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఆచంట క్షేత్రం ప్రథమం అని అన్నారు గోదావరి తీరానికి మూడు కిలోమీటర్ల దూరంలో పూర్వం మార్తండపురమే ఎన్నో దశాబ్దా లా కాలంగా ఆచంటగా పేరుగాంచిందని అన్నారు ఆచంటేశ్వరుడిని దర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు విచ్చేస్తారని ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని విజ్ఞప్తి చేశారుఈ సమావేశంలో ఆచంట మండల తెలుగు యువత నాయకుడు కేత మురళీకృష్ణ ఆచంటేశ్వర ఆలయ పాలకవర్గ సభ్యులు మన్నే విజయలక్ష్మి ధర్మకర్తలు పి.సత్యనారాయణ బి రేవతి పి ఏడుకొండలు ఎం వెంకట ఉష మధుర మీనాక్షి రవీంద్ర కుమార్ ఎన్ నరసింహారావు ఎస్ దేశాలమ్మ ఎస్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# 'ది ప్యారడైజ్' కొత్త డేట్..

## జడల్ బాక్సాఫీస్ టేకోవర్ చేసేది ఆరోజునే




నాచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా చిత్రమే ది ప్యారడైజ్. తన బ్లాక్ బస్టర్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో చేస్తున్న ఈ రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామా పట్ల భారీ అంచనాలు ప్రస్తుతం నెలకొన్నాయి. ఇక ఈ సినిమా కోసం చూస్తున్న ఫ్యాన్స్ కి ఆల్రెడీ ఈ సినిమా వాయిదాపై ఓ క్లారిటీ ఉంది.

ఈ మార్చ్ 26న విడుదల కావాల్సిన సినిమా ఇంకా పలు పనులు బాకీ ఉండడం మూలాన సినిమా అలా ఆలస్యం అయ్యింది. ఇక కొత్త డేట్ కోసం చూస్తున్న ఫ్యాన్స్ కి ఫైనల్ గా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఒక స్ట్రైకింగ్ పోస్టర్ తో కొత్త రిలీజ్ డేట్ ని ప్రకటించారు. తన జడల్ ఈ ఆగస్ట్ 21 నుంచి బాక్సాఫీస్ టేకోవర్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు.

సో ఆరోజు వరకు అభిమానులు ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న ఆడియెన్స్ ఆగాల్సిందే. ఈ సినిమాతో నాని భారీ ఓపెనర్ ని బాక్సాఫీస్ దగ్గర సెట్ చేస్తాడనే టాక్ ఉంది. మరి అంతా సెట్ అయితే మాత్రం నాని టైర్ 1 లోకి ఎంటర్ అయ్యినా ఎలాంటి ఆశ్చర్యం లేదు. ఇక ఈ సినిమాకి అనిరుద్ సంగీతం అందిస్తుండగా ఎస్ ఎల్ వి సినిమాస్ వారు భారీ బడ్జెట్ తో ఈ సినిమాని నిర్మాణం వహిస్తున్నారు.

# శ్రీలంక విజయం..

## 120 పరుగులకే పరిమితమైన ఒమన్





పల్లెకెలె వేదికగా పొట్టి ప్రపంచకప్ లో భాగంగా ఒమన్ తో జరిగిన మ్యాచ్ లో శ్రీలంక 105 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఛేదనలో పసికూన ఒమన్ తడబడింది. 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 120 పరుగులకు పరిమితమైంది. మహ్మద్ నదీమ్ (53*; 56 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో అజేయంగా నిలిచాడు.

వసీమ్ అలీ (27; 20 బంతుల్లో 3 సిక్స్ లు) ఫర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో చమీరా, తీక్షణ తలో రెండు, హేమంత, కమిందు మెండిస్, దునిత్ వెల్లలాగే చెరో వికెట్ తీసుకున్నారు. అంతకుముందు.. శ్రీలంక బ్యాటర్లలో కుశాల్ మెండిస్ ( 61; 45 బంతుల్లో 7 ఫోర్లు), పవన్ రత్నాయకే (60; 28 బంతుల్లో, 8 ఫోర్లు, 1 సిక్స్), డాసున్ శనక (50; 20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్ లు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఒమన్ బౌలర్లలో జితేన్ రామానంది 2, జే ఒడెడ్రా, సుఫ్యాన్ మెహమూద్ తలో వికెట్ తీసుకున్నారు.



# 'యుఫోరియా'పై మహేష్ బాబు రెస్పాన్స్..

## అందరూ చూడాల్సిన సినిమా అంటూ ప్రశంసలు..!

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్ర షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఇంత బిజీ షెడ్యూల్ లో కూడా ఆయన ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ రూపొందించిన తాజా చిత్రం 'యుఫోరియా'ను వీక్షించారు. ఒక స్టార్ హీరో ఇలా చిన్న సినిమాలను ప్రోత్సహించడం పట్ల ఇండస్ట్రీలో హర్షం వ్యక్తమవుతోంది.

సినిమా చూసిన అనంతరం మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నారు. గుణశేఖర్ గారు తన కథలను ప్రెజెంట్ చేసే విధానంలో ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన శైలి ఉంటుంది. ఈ సినిమా నాకు బాగా నచ్చింది, ముఖ్యంగా క్లైమాక్స్ తీర్చిదిద్దిన తీరు అద్భుతం. ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా ఇది. గుణశేఖర్ గారికి, భూమిక చావ్లాకు మరియు యుఫోరియా టీమ్ మొత్తానికి అభినందనలు అంటూ రాసుకొచ్చారు. మహేష్ ఇచ్చిన రెస్పాన్స్ తో చిత్ర యూనిట్ కు కొండంత బలాన్ని వచ్చింది.

ఈ చిత్రం ద్వారా సారా అర్జున్ తెలుగులో హీరోయిన్ గా పరిచయం కాగా, విఘ్నేష్ గవిరెడ్డి నటుడిగా తన తొలి అడుగు వేశారు. వీరిద్దరి నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. నీలిమ గుణ మరియు యుక్త గుణ నిర్మించిన ఈ చిత్రానికి కాల భైరవ సంగీతాన్ని అందించాడు.



# నేపాల్ చిత్తు.. బోణీ కొట్టిన ఇటలీ



టీ20 ప్రపంచ కప్ 2026 లో ఇటలీ బోణీ కొట్టింది. గ్రూప్-సిలో నేపాల్ తో జరిగిన మ్యాచ్ లో 10 వికెట్ల తేడాతో ఆ జట్టు ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకే ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని ఇటలీ వికెట్లేమీ కోల్పోకుండానే 12.4 ఓవర్లలోనే ఛేదించింది. జస్టిన్ మోస్కా (60₹; 44 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్ లు), ఆంథోనీ మోస్కా (62*; 32 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్ లు) చెలరేగారు. నేపాల్ కు వరుసగా ఇది రెండో ఓటమి.

తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఆరిఫ్ షేక్ (27) టాప్ స్కోరర్. రోహిత్ పౌడెల్ (23), ఆసిఫ్ షేక్ (20), కరణ్ కేసీ (18*), దీపేంద్ర సింగ్ (17) పరుగులు చేశారు. ఒక దశలో 93/3తో ఉన్న నేపాల్.. చూస్తుండగానే కుప్పకూలింది. ఆ జట్టు 30 పరుగుల వ్యవధిలో చివరి ఏడు వికెట్లను కోల్పోవడం గమనార్హం. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ మన్నెంటి 2, అలీ హసన్, స్మట్స్, జస్ప్రీత్ సింగ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ముఖ్యంగా యువత ఈ ట్రైలర్ ని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. దానికి కారణం అందులో ఓ ముద్దు సీన్ కూడా చూపించడం. సినిమాలో ఇలాంటి సన్నివేశాలు చాలానే ఉన్నాయంటోంది హీరోయిన్ మానస వారణాసి. కథ చెప్పినప్పుడే తనకు ముద్దు సీన్ల గురించి చెప్పారని.. టీమ్ పై నమ్మకంతో ఓకే చెప్పానని అంటోంది. అయితే ట్రైలర్ రిలీజ్ తర్వాత ఇంట్లో వాళ్లు ఆ సీన్లను చూసి ఇబ్బంది పడ్డారట. ఈ విషయాన్ని స్వయంగా మానస వారణాసినే చెప్పింది.

# ఇంట్లో వాళ్లు ఇబ్బంది పడ్డారు : మానస వారణాసి



సినిమా ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ఆమె మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా సినిమాలోని ముద్దు సీన్ల గురించి మాట్లాడుతూ.. 'ఈ మూవీలో సన్నిహితంగా ఉండే సన్నివేశాలు ఉంటాయి. కథ చెప్పినప్పుడే ఇది లవ్ స్టోరీ రెండు ముద్దు సీన్స్ ఉంటాయని చెప్పారు. మొదట్లో నేను సందేహించాను. కానీ మా డీవోపీ, డైరెక్టర్, హీరో సంతోష్..ఇలా టీమ్ అంతా ప్రొఫెషనల్, హానెస్ట్ గా ఉన్నారు. వీళ్లు అసభ్యంగా సీన్స్ చేయరు అని నమ్మకం కలిగింది. నాకొక కంఫర్ట్ సిచ్యువేషన్ క్రియేట్ చేశారు. సంతోష్ చాలా ఫ్రెండ్లీగా ఉండేవారు. ఈ టీమ్ అంతా ఒక మ్యాజిక్ క్రియేట్ చేసేందుకు ట్రై చేస్తుంటే నటిగా నేనూ ప్రొఫెషనల్ గా ఉండాలి కదా అని నటించాను. రొమాంటిక్ సీన్స్ అయినా బ్యూటిఫుల్ గా పొయెటిక్ గా తెరకెక్కించారు. నా దృష్టిలో గ్లామర్ అంటే ఎక్స్ పోజింగ్ కాదు. టీజర్, ట్రైలర్ రిలీజ్ అయ్యాక మా ఇంట్లో వాళ్లు కొంచెం ఇబ్బందిగా మాట్లాడారు. మన వారణాసి కుటుంబంలో ఉండి ఇలా ఎలా చేశావు అన్నారు. ఆ తర్వాత మా ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు. సపోర్ట్ చేశారు' అని మానస చెప్పుకొచ్చింది.

## కేవలం 100 రూపాయలు పెట్టిన చిచ్చు

ఈ వారం థియేటర్స్ లో రిలీజ్ కి వస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా కయాదు లోహర్ హీరోయిన్ గా దర్శకుడు అనుదీప్ కే వి తెరకెక్కించిన ఎంటర్టైనర్ చిత్రం 'ఫంకీ' కూడా ఒకటి. డీసెంట్ బజ్ ని సొంతం చేసుకున్న ఈ సినిమా ప్రమోషన్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. అయితే అసలు ఈ సినిమా కథ ఏంటి అనేది రివీల్ అయ్యింది. అనుదీప్ హిట్ చిత్రం జాతి రత్నాలు లో చిన్న కేక్ ముక్క కోసం ఎలా అయితే చిన్న కాంఫ్లిక్ట్ ఉంటుందో ఇందులో కూడా చిన్న కాంఫ్లిక్ట్ ఉన్నట్టు నిర్మాత నాగవంశీ రివీల్ చేశారు. ఇందులో ఒక దర్శకునికి, నిర్మాతకి మధ్య 100 రూపాయల వల్ల వచ్చే ఛాలెంజ్ ఉంటుందని, కేవలం 100 రూపాయలతో సినిమా తీయడంపై కథనం ఉంటుంది అన్నట్టు తెలిపారు. సో సినిమా ప్రధాన కథ ఏంటి అనేది ఇదే అని చెప్పొచ్చు. మరి రేపు థియేటర్స్ లో ఫన్ దీనిపై ఇంకెలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందించగా సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహించారు.




ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల తర్వాత సినిమా వేడుకల్లో మహిళలందరూ చీరలోనే కనిపిస్తున్నారని సీనియర్ నటుడు నరేశ్ అన్నారు. అలా ఉండటం భారతీయ



# మిమ్మల్ని కూడా హగ్ చేయాలనే వచ్చా.. కానీ.. - నరేశ్

సంస్కృతి అని పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన 'హే భగవాన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో మాట్లాడారు. ఈ వేడుకలో.. వాలంటైన్ వీక్ లో భాగమైన 'హగ్ డే' సందర్భంగా టీమ్ లోని పురుషులను ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపిన నరేశ్.. శివానీ నాగారం, చొక్కారపు స్రవంతికి కేవలం విషెస్ చెబుతూ వారి వస్త్రధారణను ప్రస్తావించారు. ''మిమ్మల్ని కూడా హగ్ చేయాలనే వచ్చా. కానీ, మీరు లక్షణంగా చీరలు ధరించారు. కొన్ని పరిణామాల తర్వాత వేదికలపై చాలామంది చీరల్లోనే కనిపిస్తున్నారు'' అని అన్నారు.

సుహాస్ హీరోగా దర్శకుడు గోపి తెరకెక్కించిన కామెడీ ఎంటర్ టైనర్ 'హే భగవాన్'. శివానీ హీరోయిన్. యాంకర్ స్రవంతి కీలక పాత్ర పోషించారు. సినిమా ఈ నెల 20న విడుదల కానున్న సందర్భంగా ఏర్పాటైన ఈవెంట్ కు హీరో సాయి దుర్గాతేజ్ ముఖ్య అతిథిగా హాజరై, సినిమా మంచి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు.

''నా 'సుప్రీమ్' సినిమా ప్రమోషన్స్ సమయంలో సుహాస్ ను చూశా. ఆయన అప్పుడెలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. నరేశ్ అంకుల్ ఎప్పుడూ స్నేహపూర్వకంగా ఉంటారు. ఈ సినిమా మీ అందరికీ వినోదం పంచుతుందని అనుకుంటున్నా'' అని సాయి దుర్గాతేజ్ పేర్కొన్నారు.

# 70వ ఫిల్మ్‌ఫేర్ నామినేషన్స్..




టాలీవుడ్ లో తమ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన సినిమాలకు అందించే ప్రతిష్టాత్మకమైన 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ సౌత్-2026 వేడుకకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 21న అట్టహాసంగా జరగనున్న ఈ వేడుక కోసం 2024లో బాక్సాఫీస్ ను షేక్ చేసిన సౌత్ ఇండియన్ చిత్రాల నామినేషన్ల జాబితా విడుదలైంది. ముఖ్యంగా టాలీవుడ్ నుంచి 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'హనుమాన్' వంటి భారీ చిత్రాలతో పాటు కంటెంట్ ఉన్న చిన్న సినిమాలు సైతం అవార్డుల రేసులో నిలవడంతో, ఈసారి విజేతలు ఎవరనేది ఉత్కంఠగా మారింది.

ఇక ఈ సారి 'బ్లాక్ లేడీ'ని దక్కించుకునేందుకు నామినేషన్స్ లో చోటు దక్కించుకున్న జాబితాను ఓసారి చూద్దాం.

**ఉత్తమ చిత్రం :**

కల్కి 2898 ఏడీ
పుష్ప: ది రూల్
కమిటీ కుర్రోళ్లు
లక్కీ భాస్కర్
35 చిన్న కథ కాదు
హనుమాన్

**ఉత్తమ దర్శకుడు :**

నాగ్ అశ్విన్ (కల్కి 2898 ఏడీ)
సుకుమార్ (పుష్ప: ది రూల్)
యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
నంద కిశోర్ (35 చిన్న కథ కాదు)
ప్రశాంత్ వర్మ (హనుమాన్)

**ఉత్తమ నటుడు :**

అల్లు అర్జున్ (పుష్ప: ది రూల్)
ఎన్టీఆర్ (దేవర)
దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
నాని (సరిపోదా శనివారం)
తేజ సజ్జ (హనుమాన్)
సిద్ధూ జొన్నలగడ్డ (టిల్లు స్క్వేర్)

**ఉత్తమ నటి :**

నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
రష్మిక మందన్న (పుష్ప: ది రూల్)
అనుపమ పరమేశ్వరన్ (టిల్లు స్క్వేర్)
ఆషికా రంగనాథ్ (నా సామిరంగ)
మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్)
ప్రియాంక మోహన్ (సరిపోదా శనివారం)

**ఉత్తమ సహాయ నటుడు:**

అమితాబ్ బచ్చన్ (కల్కి)
సత్య (మత్తు వదలరా 2)
వినయ్ రాయ్ (హనుమాన్)
ధనంజయ్ (జీబ్రా)
ఎస్.జె. సూర్య (సరిపోదా శనివారం)
ఫహద్ ఫాజిల్ (పుష్ప 2)

**ఉత్తమ సహాయ నటి:**

శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజీ బ్యాండు)
అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2)
వరలక్ష్మి శరత్ కుమార్ (హనుమాన్)
శ్రద్ధా శ్రీనాథ్ (మెకానిక్ రాకీ)
రాశి సింగ్ (ప్రసన్నవదనం)




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.